www.peoplesnews.in

పీపుల్స్ న్యూస్

హైదరాబాద్

ప్రజల గొంతుక...

దినపత్రిక

ఎడిటర్ : కె. శ్రావణ్ కుమార్

తెలంగాణ - ఆంధ్రప్రదేశ్ సంపుటి : 16 సంచిక : 177 శనివారం, నవంబర్ 14, 2026 , పేజీలు - 12 వెల: 2/-

Circulated to Hyderabad, Rangareddy, Karimnagar, Nalgonda, Adilabad, Mahaboobnagar, Khammam, Medak, Warangal, Nizamabad



ఘనంగా జాతీయ క్రీడా పురస్కారాల ప్రదానం

- 15 మంది క్రీడాకారులకు అర్జున అవార్డులు అందజేసిన రాష్ట్రపతి ద్రౌపది ముర్ము



న్యూఢిల్లీ,నవంబర్ 13 : క్రీడా రంగంలో విశేష ప్రతిభ కనబరిచిన క్రీడాకారులు, కోచ్‌లకు అందించే జాతీయ క్రీడా పురస్కారాలు-2025 ప్రదానోత్సవం శుక్రవారం రాష్ట్రపతి భవన్‌లో ఘనంగా జరిగింది. రాష్ట్రపతి ద్రౌపది ముర్ము విజేతలకు అవార్డులు అందజేసి సత్కరించారు. మొత్తం 15 మంది క్రీడాకారులు అర్జున అవార్డులు అందుకున్నారు.డెకాథ్లాన్ అథ్లెట్ తేజస్విన్ శంకర్, ఫిడే మిగతా2లో...

తెలంగాణను పెట్టుబడుల కేంద్రంగా తీర్చిదిద్దడమే లక్ష్యం

● యువతకు ఉపాధి అవకాశాల కల్పనే భారత్ సమ్మిట్ ఉద్దేశం ● 70 దేశాల నుంచి వెయ్యి మంది ప్రతినిధుల రాక ● వీసాల నిరాకరణపై కేంద్రంపై సీఎం రేవంత్‌రెడ్డి విమర్శలు



హైదరాబాద్,నవంబర్ 13 : తెలంగాణను పెట్టుబడులకు అనుకూలమైన రాష్ట్రంగా తీర్చిదిద్ది, యువతకు ఉపాధి అవకాశాలను మెరుగుపర్చడమే భారత్ సమ్మిట్ ప్రధాన లక్ష్యమని ముఖ్యమంత్రి ఎ.రేవంత్‌రెడ్డి స్పష్టం చేశారు. భారత్ సమ్మిట్‌కు హాజరయ్యేందుకు వివిధ దేశాల నుంచి వస్తున్న ప్రతినిధుల వీసాలను కేంద్ర ప్రభుత్వం తిరస్కరించడాన్ని ఆయన తప్పుబట్టారు. ఈ చర్యకు బీజేపీ మూల్యం చెల్లించుకోక తప్పదని హెచ్చరించారు. శుక్రవారం హైదరాబాద్‌లో నిర్వహించిన మీడియా సమావేశంలో సీఎం మాట్లాడారు.భారత్ సమ్మిట్‌కు 70 దేశాల నుంచి సుమారు వెయ్యి మంది ప్రతినిధులు హాజరయ్యారని తెలిపారు. వివిధ రంగాలకు మిగతా2లో...



ప్రపంచ ప్రగతిశీల నేతల వేదికగా హైదరాబాద్

హెచ్‌ఐసీసీలో భారత్ సమ్మిట్-2.0 సందడి

70 దేశాల నుంచి వెయ్యి మందికి పైగా ప్రతినిధులు

ప్రజాస్వామ్యం, ఆర్థిక వ్యవస్థ, వాతావరణ మార్పులపై చర్చలు

నేడు ముగింపు సమావేశంలో రాహుల్‌గాంధీ ప్రసంగం

హైదరాబాద్,నవంబర్ 13 : ప్రపంచ వ్యాప్తంగా ప్రజాస్వామ్య విలువలు, ఆర్థిక సహకారం, సామా జిక న్యాయం, అంతర్జాతీయ రాజకీయ పరిణామాలపై చర్చిం చేందుకు హైదరాబాద్ వేదికగా భారత్ సమ్మిట్-2.0 శుక్రవారం ప్రారంభమైంది. హెచ్‌ఐసీసీలో రెండు రోజులపాటు జరిగే ఈ అంతర్జాతీయ సదస్సుకు భారత్‌తో పాటు సుమారు 70 దేశాల నుంచి వెయ్యి మందికి పైగా మిగతా2లో...

ఎంఒయులు ఆచరణలోకి రావాలి

సీఐఐ సదస్సు ముగింపులో ఉపరాష్ట్రపతి సి.పి. రాధాకృష్ణన్

విశాఖ,నవంబర్ 13 : పెట్టుబడులు కేవలం ఒప్పందాలకే పరిమి తం కాకుండా ఆచరణ రూపం దాల్చాలని ఉపరాష్ట్రపతి సి.పి. రాధాకృష్ణన్ అన్నారు. 'కలిసి పనిచేద్దాం.. కలిసి ఎదుగుదాం.. సంపదను పంచుకుందాం' అనే విధానంతో ముందుకు సాగాలని సూచించారు. విశాఖలో రెండు రోజుల పాటు మిగతా2లో...



రూ.3 లక్షల కోట్లతో ఏపీలో రహదారుల అభివృద్ధి

- సిఐఐ సదస్సులో వెల్లడించిన కేంద్ర మంత్రి నితిన్ గడ్కరీ

విశాఖ,నవంబర్ 13 :ఆంధ్రప్రదేశ్‌లో సుమారు రూ.3 లక్షల కోట్లతో రహదారి మౌలిక సదుపాయాల ప్రాజెక్టులు చేపడుతున్నట్లు కేంద్ర రోడ్డు రవాణా, జాతీయ రహదారుల శాఖ మంత్రి నితిన్ గడ్కరీ తెలిపారు. విశాఖపట్నంలో జరుగుతున్న 31వ సిఐఐ భాగస్వామ్య సదస్సులో ఆయన మాట్లాడుతూ.. 2014లో రాష్ట్రంలో 4,100 కిలోమీ టర్లుగా ఉన్న జాతీయ రహదారుల నెట్‌వర్క్ ప్రస్తుతం 8,700 కిలోమీ టర్లకు పెరిగిందన్నారు. రూ.14 వేల కోట్లతో మిగతా2లో...



భావితరాల భవిష్యత్తు కోసమే భారత్ ఫ్యూచర్ సిటీ

● సుస్థిరాభివృద్ధి, పర్యావరణ పరిరక్షణకు ప్రాధాన్యం

● పెట్టుబడులకు అన్ని విధాలా సహకరిస్తాం: మంత్రి శ్రీధర్‌బాబు



హైదరాబాద్,నవంబర్ 13 : భావితరాల అవసరాలకు అనుగుణంగా సుస్థిరాభివృద్ధికి పెద్దపీట వేస్తూ భారత్ ఫ్యూచర్ సిటీని ప్రణాళికాబద్ధంగా అభివృద్ధి చేస్తున్నామని రాష్ట్ర ఐటీ, పరిశ్రమల శాఖ మంత్రి దుద్దిళ్ల శ్రీధర్‌బాబు తెలిపారు. వేగంగా పెరుగుతున్న పట్టణీకరణతో ఎదురవుతున్న సవాళ్లను అధిగమించేలా నెట్‌జీరో లక్ష్యంతో పర్యావరణ హిత నగరంగా తీర్చిదిద్దుతున్నామని చెప్పారు. భారత్ సమ్మిట్-2.0లో భాగంగా హైదరాబాద్ హైటెక్స్‌లో శుక్రవారం నిర్వహించిన 'ఫ్యూచర్ సిటీ-పట్టణీకరణ' చర్చాగోష్ఠిలో ఆయన మాట్లాడారు. హైదరాబాద్, సికింద్రాబాద్, సైబరాబాద్ నగరాలు మిగతా2లో...

నగర భద్రతకు పెద్దపీట.. కొత్త సీపీ మహేష్ భగవత్

శాంతిభద్రతలు, మహిళా రక్షణ, ట్రాఫిక్‌పై ప్రత్యేక దృష్టి

నేరస్తులపై కఠిన చర్యలు.. అక్రమ వసూళ్లకు పాల్పడితే కేసులు



నీటి లభ్యత ఆధారంగా యాసంగి పంటల ఎంపిక

● జిల్లాల వారీగా పకడ్బందీ సాగు ప్రణాళిక రూపొందించాలి

● విత్తనాలు ముందుగానే సిద్ధం చేయాలి

● కూరగాయలు, పప్పుధాన్యాల సాగుకు ప్రోత్సాహం

● కలెక్టర్లకు ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి సంజయ్ జాజు ఆదేశాలు



హైదరాబాద్,నవంబర్ 13 : రాష్ట్రంలో రబీ పంటల సాగు ప్రణాళికను పకడ్బందీగా రూపొందించాలని ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి సంజయ్ జాజు జిల్లా కలెక్టర్లను ఆదేశించారు. ప్రతి జిల్లాలో స్థానిక పరిస్థితులు, నీటి లభ్యతకు అనుగుణంగా అనువైన పంటల సాగును ప్రోత్సహించాలని సూచించారు. శుక్రవారం హైదరాబాద్‌లోని సచివాలయం నుంచి సీనియర్ అధికారులతో కలిసి కలెక్టర్లతో వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించారు.ఈ సందర్భంగా వ్యవసాయం, ఉద్యానవన శాఖ, సూక్ష్మ సేద్యం, బిందు సేద్యం, కూరగాయలు, పప్పుధాన్యాల సాగు, ధాన్యం కొనుగోళ్లు తదితర అంశాలపై సమీక్షించారు. ఎల్‌నినో ప్రభావం, మారుతున్న వాతావరణ పరిస్థితులను దృష్టిలో ఉంచుకుని నీటి లభ్యత ఆధారంగా పంటలను ఎంపిక చేసుకోవాలని సూచించారు. రైతులకు అవసరమైన విత్తనాలను ముందుగానే సిద్ధం చేసి సకాలంలో అందు బాటులో ఉంచాలని ఆదేశించారు. కూరగాయలు, పప్పుధాన్యాల సాగును మిగతా2లో...

మోదీతో బహిరంగ చర్చకు రాహుల్ సవాల్

ఫోన్ ట్యాపింగ్ జరుగుతోందని ఆరోపణలు

నా దగ్గర ఆధారాలున్నాయి.. ముఖాముఖి చర్చకు సిద్ధం

కాంగ్రెస్ నేత వ్యాఖ్యలను ఖండించిన బీజేపీ



న్యూఢిల్లీ,నవంబర్ 13 : ప్రధాని నరేంద్ర మోదీ తన ఫోన్‌ను ట్యాప్ చేయిస్తున్నారని కాంగ్రెస్ అగ్రనేత, లోక్‌సభ ప్రతిపక్ష నేత రాహుల్ గాంధీ ఆరోపించారు. తన ఆరోపణలకు సంబంధించిన ఆధారాలన్నీ ఫోన్‌లోనే ఉన్నాయని వెల్లడించారు. శుక్రవారం ఇన్‌స్టాగ్రామ్‌లో నిర్వహించిన 'ఆస్క్ మీ' కార్యక్రమంలో నెటిజన్ల ప్రశ్నలకు సమాధానమిస్తూ ఈ వ్యాఖ్యలు చేశారు. తన ఫోన్‌ను పైకెత్తి చూపిస్తూ, తనపై నిఘా ఉన్న విషయం ప్రధానికి కూడా తెలుసని పేర్కొన్నారు.ప్రధాని మోదీ మిగతా2లో...

సిద్దిపేటలో రాజకీయ సమరానికి కవిత సన్నద్ధం!

హరీశ్‌రావును ప్రజాజీవితం నుంచి తరిమికొట్టే వరకు పోరాటం

మున్సిపల్ ఎన్నికల నుంచే కార్యాచరణ ప్రారంభం

కాళేశ్వరం, మల్లన్నసాగర్ పనులపై తీవ్ర ఆరోపణలు



తెలంగాణను పెట్టుబడుల కేంద్రంగా తీర్చిదిద్దడమే లక్ష్యం

(మొదటి పేజీ తరువాయి)

చెందిన నిపుణులు, ప్రముఖులు, జర్నలిస్టులను ఆహ్వానించి రెండు రోజులపాటు చర్చలు, సదస్సులు నిర్వహిస్తున్నామని చెప్పారు. తెలంగాణలోని పెట్టుబడి అవకాశాలు, పారిశ్రామిక విధానాలు, వాతావరణ పరిస్థితులు, మౌలిక వసతులు, మానవ వనరులను అంతర్జాతీయ ప్రతినిధులకు వివరించడమే ఈ సమావేశాల ఉద్దేశమన్నారు. ఇక్కడికి వచ్చిన ప్రతినిధులు తిరిగి తమ దేశాలకు వెళ్లిన తర్వాత తెలంగాణకు ప్రచారకర్తలుగా నిలుస్తారని ఆశాభావం వ్యక్తం చేశారు.బీజేపీని వ్యతిరేకిస్తే దేశాన్ని వ్యతిరేకించినట్లు కాదని రేవంత్‌రెడ్డి స్పష్టం చేశారు. కేంద్ర ప్రభుత్వ విధానాలను ప్రశ్నించే వారిపై దేశద్రోహులనే ముద్ర వేయడం సరైంది కాదన్నారు. భారత్ సమ్మిట్ దేశ వ్యతిరేక సమావేశమంటూ బీజేపీ, బీఆర్ఎస్ నేతలు చేస్తున్న ఆరోపణలను ఖండించారు. రాష్ట్ర ప్రభుత్వం ప్రజల ప్రయోజనాల కోసం తీసుకునే ప్రతి నిర్ణయాన్నీ గుడ్డిగా వ్యతిరేకించడం తగదని హితవు పలికారు. ప్రజాస్వామ్య విలువల పరిరక్షణకు చర్చలే మార్గమని పేర్కొన్నారు.డిసెంబర్ 7, 8, 9 తేదీల్లో ఇన్వెస్ట్ తెలంగాణ గ్లోబల్ సమ్మిట్ నిర్వహించనున్నట్లు సీఎం వెల్లడించారు. ఇప్పటికే ఢిల్లీ, బెంగళూరు, చెన్నైలో సన్నాహక కార్యక్రమాలు నిర్వహించామని, త్వరలో ముంబయి, అహ్మదాబాద్‌లోనూ చేపట్టనున్నట్లు తెలిపారు. రాష్ట్ర ఆర్థిక వ్యవస్థను మూడు ట్రిలియన్ డాలర్ల స్థాయికి చేర్చడం, యువతకు పెద్దఎత్తున ఉద్యోగ, ఉపాధి అవకాశాలు కల్పించడం ప్రభుత్వ లక్ష్యమని వివరించారు.రాష్ట్రంలో గిగ్ వర్కర్ల విధానాన్ని శనివారం నుంచి అమలు చేయనున్నట్లు రేవంత్‌రెడ్డి ప్రకటించారు. ఈ విధానాన్ని ప్రవేశపెట్టేందుకు కాంగ్రెస్ అగ్రనేత, లోక్‌సభ ప్రతిపక్ష నేత రాహుల్‌గాంధీ హైదరాబాద్‌కు వస్తున్నారని తెలిపారు. ఆయన రాకను బీజేపీ, బీఆర్ఎస్ నేతలు విమర్శించడాన్ని తప్పుబట్టారు. రాహుల్‌గాంధీ భారత్ సమ్మిట్ ముగింపు కార్యక్రమంలో పాల్గొంటే అభ్యంతరం ఏమిటని ప్రశ్నించారు.సమావేశంలో కేంద్ర మాజీ మంత్రి సల్మాన్ ఖుర్షీద్ మాట్లాడుతూ భారత్ సమ్మిట్ విజయవంతం కావాలని ఆకాంక్షించారు. ప్రపంచ దేశాల మధ్య సహకారం, శాంతి, వాతావరణ మార్పులపై ఉమ్మడి కార్యాచరణ అవసరమని అభిప్రాయపడ్డారు. సమావేశంలో ఉప ముఖ్యమంత్రి మల్లు భట్టి విక్రమార్క, మంత్రులు ఉత్తమ్‌కుమార్‌రెడ్డి, వివేక్ వెంకటస్వామి, మహ్మద్ అజారుద్దీన్ తదితరులు పాల్గొన్నారు.

ప్రపంచ ప్రగతిశీల నేతల వేదికగా హైదరాబాద్

(మొదటి పేజీ తరువాయి)

ప్రతినిధులు హాజరయ్యారు. వివిధ దేశాల రాజకీయ నాయకులు, మంత్రులు, మాజీ మంత్రులు, పార్లమెంటు సభ్యులు, మేధావులు, విధాన రూపకర్తలు ఈ సమావేశాల్లో పాల్గొంటున్నారు.'ఫోర్జింగ్ ఏ న్యూ వరల్డ్' (నూతన ప్రపంచ నిర్మాణం) ఇతివృత్తంతో నిర్వహిస్తున్న ఈ సదస్సులో ప్రపంచం ఎదుర్కొంటున్న కీలక సమస్యలపై చర్చలు జరగనున్నాయి. కృత్రిమ మేధ, వాతావరణ మార్పులు, అంతర్జాతీయ ఆర్థిక వ్యవస్థ, యువత రాజకీయ భాగస్వామ్యం, మహిళా సాధికారత, లింగ సమానత్వం, మీడియా భవిష్యత్తు, అంతర్జాతీయ సంస్థల సంస్కరణలు ప్రధాన చర్చనీయాంశాలుగా ఉన్నాయి. ప్రపంచ దేశాల మధ్య సహకారం, శాంతి, ప్రజాస్వామ్య పరిరక్షణకు అవసరమైన ప్రత్యామ్నాయ విధానాల రూపకల్పనపై ప్రతినిధులు అభిప్రాయాలు పంచుకోనున్నారు. **తెలంగాణ అభివృద్ధిపై ప్రత్యేక చర్చలు** సదస్సులో భాగంగా తెలంగాణ అభివృద్ధికి సంబంధించిన తొమ్మిది ప్రత్యేక చర్చాగోష్ఠులు నిర్వహిస్తున్నారు. ఫ్యూచర్ సిటీ, పట్టణీకరణ, ఆర్థిక న్యాయం, సామాజిక న్యాయం, సంక్షేమ విధానాలు, సహకార సమాఖ్యవాదం, సంస్కృతి, యువత, క్రీడలు, రాజకీయాలు, ఎన్నికల సమగ్రత వంటి అంశాలపై చర్చలు జరగనున్నాయి. ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి, ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్క, మంత్రి శ్రీధర్‌బాబు, ఇతర మంత్రులు ఈ సమావేశాల్లో పాల్గొంటున్నారు.**నేడు రాహుల్‌గాంధీ ప్రసంగం** శనివారం జరిగే ముగింపు సమావేశంలో లోక్‌సభ ప్రతిపక్ష నేత రాహుల్‌గాంధీ ప్రసంగించనున్నారు. భారత్ భవిష్యత్తు, ప్రపంచ రాజకీయ పరిణామాలు, విదేశాంగ విధానం, వ్యూహాత్మక స్వయంప్రతిపత్తి, శాంతియుత సహజీవనం, ప్రజాస్వామ్య విలువలపై తన అభిప్రాయాలను వెల్లడించనున్నారు. సదస్సు ద్వారా హైదరాబాద్‌కు అంతర్జాతీయ స్థాయిలో మరింత గుర్తింపు లభిస్తుందని నిర్వాహకులు ఆశాభావం వ్యక్తం చేస్తున్నారు.

భావితరాల భవిష్యత్తు కోసమే భారత్ ఫ్యూచర్ సిటీ

(మొదటి పేజీ తరువాయి)

రాష్ట్ర ఆర్థిక ప్రగతికి చోదకశక్తులుగా నిలిచాయని, మారుతున్న ప్రపంచ ఆర్థిక పరిస్థితులు, పారిశ్రామిక అవసరాలకు అనుగుణంగా నాలుగో నగరంగా భారత్ ఫ్యూచర్ సిటీని అభివృద్ధి చేస్తున్నామని మంత్రి తెలిపారు. 2047 నాటికి రాష్ట్ర ఆర్థిక వ్యవస్థను 3 ట్రిలియన్ డాలర్ల స్థాయికి చేర్చాలనే లక్ష్య సాధనలో ఈ నగరం కీలక పాత్ర పోషిస్తుందని పేర్కొన్నారు. కేవలం పారిశ్రామిక ప్రాంతంగా కాకుండా ప్రజలు నివసించేందుకు, పనిచేసేందుకు, చదువుకునేందుకు, పరిశోధనలు చేసేందుకు, నూతన ఆవిష్కరణలకు కేంద్రంగా దీన్ని తీర్చిదిద్దుతామని వివరించారు.వర్షపు నీటి సంరక్షణ, నీటి పునర్వినియోగం, సౌర విద్యుత్, పచ్చదనం, సమర్థవంతమైన వ్యర్థాల నిర్వహణకు ప్రాధాన్యం ఇస్తున్నామని చెప్పారు.

కృత్రిమ మేధ, లైఫ్ సైన్సెస్, వైద్య ఆరోగ్యం, ఎలక్ట్రానిక్స్, విద్యుత్ వాహనాలు, డేటా కేంద్రాలు, అంతరిక్ష సాంకేతికత, అధునాతన తయారీ రంగాలకు ప్రత్యేక ప్రాధాన్యం కల్పిస్తున్నామని తెలిపారు. ఈ అవకాశాల నేపథ్యంలో అమెజాన్, హైపర్‌వాల్ట్, కంట్రోల్ఎస్, మారుబెనీ, సెమ్‌కార్ప్, ఎన్‌టిటి వంటి ప్రముఖ జాతీయ, అంతర్జాతీయ సంస్థలు పెట్టుబడులకు ఆసక్తి చూపుతున్నాయని వెల్లడించారు.భారత్ ఫ్యూచర్ సిటీని దేశ పారిశ్రామిక, పట్టణాభివృద్ధికి కొత్త నమూనాగా తీర్చిదిద్దుతామని శ్రీధర్‌బాబు అన్నారు. ఇక్కడ పెట్టుబడులు పెట్టేందుకు పారిశ్రామికవేత్తలు ముందుకు రావాలని ఆహ్వానించారు.

భూ కేటాయింపుల నుంచి పరిశ్రమల ఏర్పాటుకు అవసరమైన మౌలిక సదుపాయాలు, అనుమతుల వరకు అన్ని దశల్లోనూ ప్రభుత్వం పూర్తి సహకారం అందిస్తుందని హామీ ఇచ్చారు. చర్చాగోష్ఠిలో రాజీవ్ గాంధీ ఫౌండేషన్ సీఈవో విజయ్ మహాజన్, పట్టణాభివృద్ధి నిపుణుడు టికేందర్ సింగ్ పవార్, షేక్ సలావుద్దీన్, చరిత్రకారుడు సజ్జద్ షాహిద్, మాజీ ఎంపీ దివ్య స్పందన తదితరులు పాల్గొన్నారు.

సిద్దిపేటలో రాజకీయ సమరానికి కవిత సన్నద్ధం!

సిద్దిపేట,నవంబర్ 13 : సిద్దిపేట ప్రజలకు రాజకీయ స్వాతంత్ర్యం తీసుకొస్తామని తెలంగాణ రక్షణ సేన చీఫ్ కల్వకుంట్ల కవిత అన్నారు. హరీశ్‌రావు అవినీతికి పాల్పడ్డారని ఆరోపిస్తూ, ఆయనను ప్రజాజీవితం నుంచి తప్పించే వరకు పోరాటం కొనసాగిస్తామని ప్రకటించారు. శుక్రవారం సిద్దిపేటలో తెలంగాణ రక్షణ సేన కార్యాలయ నిర్మాణానికి భూమిపూజ చేసిన అనంతరం నిర్వహించిన విలేకరుల సమావేశంలో ఆమె మాట్లాడారు.సిద్దిపేట తన సొంత గడ్డని, తెలంగాణ ఉద్యమానికి ఈ ప్రాంతం ఎంతో సహకరించిందని కవిత గుర్తుచేశారు. సామాజిక న్యాయ తెలంగాణ సాధన కోసం తాను చేస్తున్న పోరాటానికి ప్రజలు మద్దతు ఇవ్వాలని కోరారు. సిద్దిపేటలో మున్సిపల్ ఎన్నికల నుంచే తమ రాజకీయ పోరాటం ప్రారంభమవుతుందని, అక్కడ తమ పార్టీ జెండా ఎగురవేస్తామని ధీమా వ్యక్తం చేశారు.కాళేశ్వరం ప్రాజెక్టు ద్వారా ఉమ్మడి మెదక్ జిల్లాకు రావాల్సిన నీరు అందడం లేదని విమర్శించారు. సుమారు రూ.93 వేల కోట్లు ఖర్చు చేసినా ఆశించిన స్థాయిలో సాగునీరు అందలేదని ఆరోపించారు. మల్లన్నసాగర్, కొండ పోచమ్మ సాగర్ నిర్వాసితులకు సరైన పరిహారం ఇవ్వలేదని, రంగనాయకసాగర్ వద్ద భూములకు పరిహారం తీసుకుని హరీశ్‌రావు గెస్ట్‌హౌస్ నిర్మించుకు న్నారని ఆరోపించారు.మల్లన్నసాగర్ రిజర్వాయర్ భద్రతపై ఎన్‌జీఆర్ఐ గతంలోనే నివేదిక ఇచ్చిందని, అయినా తగిన జాగ్రత్తలు తీసుకోలేదని కవిత అన్నారు. ప్రస్తుతం రిజర్వాయర్ బండ్ వద్ద లీకేజీలు వస్తున్నాయని, వాటిని కప్పిపుచ్చేందుకు బ్లాస్టింగ్ పేరుతో నాటకాలు ఆడుతున్నారని విమర్శిం చారు. ఈ అంశంపై ఈ నెల 19న సిద్దిపేటకు రానున్న ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి స్పష్టమైన ప్రకటన చేయాలని డిమాండ్ చేశారు.హరీశ్‌రావు ఆరోగ్య మంత్రిగా ఉన్న సమయంలో నిమ్స్‌లో రూ.100 కోట్ల కుంభకోణం జరిగిందని, రూ.25 కోట్ల ఈపీఎఫ్ నిధులను ఇతర ఖాతాలకు మళ్లించారని కవిత ఆరోపించారు. ఈ వ్యవహారంపై విచారణ జరిపించాలని ముఖ్యమంత్రిని కోరారు. సిద్దిపేటలో రైస్‌మిల్లుల సంఖ్య తగ్గిపోవడం, స్థానిక వ్యాపారాలు దెబ్బతినడం, గండిపల్లి రిజర్వాయర్ నిర్మాణం పెండింగ్‌లో ఉండటంపై కూడా ఆమె విమర్శలు చేశారు. తాము అధికారంలోకి వస్తే పెండింగ్ ప్రాజెక్టులను పూర్తి చేస్తామని తెలిపారు.

నీటి లభ్యత ఆధారంగా యాసంగి పంటల ఎంపిక

(మొదటి పేజీ తరువాయి)

విస్తృతంగా ప్రోత్సహించాలని, కేంద్ర ప్రభుత్వ పథకాలను గరిష్టంగా వినియోగించుకుని సాగు విస్తీర్ణం, దిగుబడులు పెంచేందుకు చర్యలు తీసుకోవాలని తెలిపారు. నీటి పొదుపు కోసం సూక్ష్మ సేద్యం, ముఖ్యంగా బిందు సేద్యం విధానాన్ని విస్తరించాలని సూచించారు. ధాన్యం కొనుగోళ్లు సజావుగా జరిగేలా ముందస్తు ఏర్పాట్లు చేయాలని కలెక్టర్లకు స్పష్టం చేశారు.భూసేకరణ సమస్యలను గుర్తించి పరిష్కారానికి ప్రాధాన్యం ఇవ్వాలని, ప్రభుత్వ పాఠశాలలను తరచూ సందర్శించి విద్యా కార్యక్రమాలు, విద్యార్థులకు అందుతున్న సదుపాయాలు, బోధనా ప్రమాణాలను పరిశీలించాలని ఆదేశించారు. యంగ్ ఇండియా ఇంటిగ్రేటెడ్ రెసిడెన్షియల్ పాఠశాలల నిర్మాణాలను వేగవంతం చేసి నిర్ణీత గడువులోగా పూర్తి చేయాలని సూచించారు. సమావేశంలో వివిధ శాఖల ఉన్నతాధికారులు పాల్గొన్నారు.

ప్రతి కుటుంబానికి రూ.5 లక్షల బీమా భరోసా

- ఈ నెల 19న సిద్దిపేటలో పథకం ప్రారంభం
- 20 నుంచి 30 వరకు గ్రామాల్లో దరఖాస్తుల స్వీకరణ
- ఇందిరమ్మ చీరల పంపిణీకి అదే రోజు శ్రీకారం

హైదరాబాద్, నవంబర్ 13 : రాష్ట్రంలోని ప్రతి కుటుంబానికి రూ.5 లక్షల జీవిత బీమా కల్పించే ఇందిరమ్మ కుటుంబ జీవిత బీమా పథకాన్ని ఈ నెల 19న ప్రారంభించనున్నట్లు రాష్ట్ర ప్రభుత్వం ప్రకటించింది. మాజీ ప్రధాని ఇందిరాగాంధీ జయంతి సందర్భంగా సిద్దిపేటలో నిర్వహించే భారీ బహిరంగ సభలో ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి ఈ పథకాన్ని ప్రారంభించనున్నారు. అదే వేదికగా ఇందిరమ్మ చీరల పంపిణీ కార్యక్రమాన్ని కూడా ప్రారంభించనున్నారు.ముఖ్యమంత్రి అధ్యక్షతన సచివాల యంలో జరిగిన మంత్రివర్గ సమావేశంలో ఈ మేరకు నిర్ణయం తీసుకున్నారు. పథకానికి సంబంధించిన దరఖాస్తులను నవంబర్ 20 నుంచి 30 వరకు రాష్ట్రవ్యాప్తంగా గ్రామాల్లో సేకరించనున్నారు. ఇందిరమ్మ కమిటీలు ఇంటింటికీ వెళ్లి ప్రతి కుటుంబం నుంచి దరఖాస్తులు స్వీకరిస్తాయి. అనంతరం వాటిని తహసీల్దార్లు, గ్రామ పంచాయతీ కార్యదర్శులకు అందజేస్తారు.

రాష్ట్రంలోని ప్రతి కుటుంబానికి రూ.5 లక్షల జీవిత బీమా కల్పించడమే ఈ పథకం ఉద్దేశమని ప్రభుత్వం తెలిపింది. కుటుంబాలకు ఆర్థిక భద్రత కల్పించేందుకు ఈ పథకం దోహదపడుతుందని పేర్కొంది.ఇదిలా ఉండగా, రాష్ట్రవ్యాప్తంగా పూర్తయిన 2.25 లక్షల ఇందిరమ్మ ఇళ్లలో 'మా ఇందిరమ్మ ఇంట్లో దీపావళి' కార్యక్రమాన్ని నిర్వహించాలని మంత్రివర్గం నిర్ణయించింది. మంత్రులు, ఎమ్మెల్యేలు తమ నియోజకవర్గాల్లోని లబ్ధిదారులతో కలిసి వేడుకల్లో పాల్గొననున్నారు.

ఎంఒయులు ఆచరణలోకి రావాలి

(మొదటి పేజీ తరువాయి)

నిర్వహించిన సీఐఐ పెట్టుబడుల భాగస్వామ్య సదస్సు శుక్రవారం ముగిసింది. ముగింపు కార్యక్రమంలో ముఖ్య అతిథిగా పాల్గొన్న ఆయన మాట్లాడుతూ 2024 జూన్ నుంచి ఆంధ్రప్రదేశ్ రూ.32 లక్షల కోట్ల పెట్టుబడులను ఆకర్షించడం విశేషమన్నారు. రాష్ట్ర విభజన అనంతరం ఎదురైన ఇబ్బందులను అధిగమిస్తూ ఏపీ అభివృద్ధి పథంలో ముందుకు సాగుతోందని పేర్కొన్నారు. పోర్టులు, విమానాశ్రయాలు, ఎలక్ట్రానిక్స్, అంతరిక్ష, రక్షణ, పర్యాటక రంగాల్లో పెట్టుబడులకు అవకాశాలు ఉన్నాయని తెలిపారు. పాలన, పౌర సేవల్లో కృత్రిమ మేధ వినియోగాన్ని అభినందించారు.**ప్రభుత్వంపై పారిశ్రామికవేత్తలకు విశ్వాసం**సీఐఐ భాగస్వామ్య సదస్సు విజయవంతం కావడం ప్రభుత్వంపై పారిశ్రామికవేత్తలకు ఉన్న విశ్వాసానికి నిదర్శనమని గవర్నర్ అబ్దుల్ నజీర్ అన్నారు. వివిధ దేశాల నుంచి ప్రతినిధులు సదస్సులో పాల్గొన్నారని తెలిపారు.**రూ.32 లక్షల కోట్ల పెట్టుబడులు ఆచరణ దిశగా**ముఖ్యమంత్రి చంద్రబాబు మాట్లాడుతూ విశాఖ ఉక్కు కర్మాగారాన్ని పునరుద్ధరించామని, భోగాపురం విమానాశ్రయం, రైల్వే జోన్ వంటి కీలక ప్రాజెక్టులను ముందుకు తీసుకెళ్తున్నామని తెలిపారు. రాష్ట్రంలోని అన్ని ప్రాంతాలకు పెట్టుబడులు, పరిశ్రమలు తీసుకురావడమే లక్ష్యమన్నారు. 2024 నుంచి వచ్చిన 714 ఎంఒయూల ప్రతిపాదనల్లో 522 ఆచరణ దిశగా ఉన్నాయని వెల్లడించారు. కియా సంస్థ అదనంగా రెండు లక్షల కార్ల తయారీ కోసం రూ.18,878 కోట్ల పెట్టుబడికి ముందుకొచ్చిందని, రిలయన్స్ రూ.2.43 లక్షల కోట్ల పెట్టుబడులకు ఒప్పందం చేసుకుందని తెలిపారు.**రెండో రోజు 12 ఒప్పందాలు**సదస్సు రెండో రోజైన శుక్రవారం వివిధ సంస్థలు రాష్ట్ర ప్రభుత్వంతో 12 ఒప్పందాలు కుదుర్చుకున్నాయి. వీటి ద్వారా రూ.1,41,585 కోట్ల పెట్టుబడులు, 10,919 మందికి ఉద్యోగావకాశాలు కల్పించనున్నట్లు వెల్లడించారు. జిందాల్ గ్రూప్ కందుకూరులో రూ.15 వేల కోట్లతో మైనింగ్ కార్యకలాపాలు చేపట్టనుంది. అగ్నికుల్ కాస్మోస్ తిరుపతిలో డేటా కేంద్రం, రాకెట్ తయారీ కేంద్రం ఏర్పాటు చేయనుంది. గ్రీన్ జెన్, ఇండియన్ ఆయిల్ కార్పొరేషన్ పునరుత్పాదక ఇంధన రంగంలో పెట్టుబడులకు ఒప్పందాలు చేసుకున్నాయి. డిక్సన్ టెక్నాలజీస్, ఎయిర్‌ట్రంక్-జేసీకే ఇన్‌ఫ్రా, కాకినాడ సీపోర్ట్స్ తదితర సంస్థలు కూడా వివిధ ప్రాజెక్టులకు ఒప్పందాలు కుదుర్చుకున్నాయి.ఈ కార్యక్రమంలో కేంద్ర మంత్రులు ప్రహ్లాద్ జోషి, కె. రామ్మోహన్ నాయుడు, రాష్ట్ర మంత్రులు నారా లోకేష్, టీజీ భరత్, సీఐఐ ప్రతినిధులు, పారిశ్రామికవేత్తలు పాల్గొన్నారు.

రూ.3 లక్షల కోట్లతో ఏపీలో రహదారుల అభివృద్ధి

(మొదటి పేజీ తరువాయి)

నిర్మిస్తున్న బెంగళూరుకడపవిజయవాడ గ్రీన్‌ఫీల్డ్ కారిడార్‌ను 2027 డిసెంబరు నాటికి అందుబాటులోకి తెస్తామని తెలిపారు. రూ.16 వేల కోట్లతో చేపట్టిన రాయ్‌పూర్‌విశాఖపట్నం కారిడార్ 2027 నాటికి పూర్తవుతుందని పేర్కొన్నారు.

దీంతో ప్రయాణ సమయం 13 గంటల నుంచి ఐదు గంటలకు తగ్గుతుందన్నారు. హైదరాబాద్‌విజయవాడ మచిలీపట్నం జాతీయ రహదారి ని రూ.12 వేల కోట్లతో ఆరు వరుసలుగా విస్తరించేందుకు ప్రతిపాదనలు సిద్ధం చేశామని వెల్లడించా రు. ఖరగ్‌పూర్‌విశాఖపట్నం అమరావతి కారిడార్‌కు రూ.71 వేల కోట్లు, అమరావతి చుట్టూ 190 కిలోమీటర్ల ఔటర్ రింగ్ రోడ్డు నిర్మాణానికి రూ.32 వేల కోట్లతో ప్రతిపాదనలు రూపొందించినట్లు వివరించారు.

ఘనంగా జాతీయ క్రీడా పురస్కారాల ప్రదానం

(మొదటి పేజీ తరువాయి)

మహిళల ప్రపంచకప్ విజేత దివ్య దేశ్‌ముఖ్ అర్జున అవార్డులు అందుకున్న వారిలో ఉన్నారు. వీరితో పాటు అథ్లెట్ మహమ్మద్ అజ్మల్, బాక్సర్ నరేందర్, చెస్ క్రీడాకారుడు విదిత్ గుజరాతి, హాకీ క్రీడాకారులు లాల్రెమ్సియామి, రాజ్‌కుమార్ పాల్ పురస్కారాలు అందుకున్నారు.

సీనియర్ ఫుట్‌బాల్ క్రీడాకారుడు యెషయా అరుమైనియాగంకు అర్జున అవార్డు (జీవితకాల సాఫల్యం) ప్రదానం చేశారు. అథ్లెటిక్స్ కోచ్ పర్వీర్ సింగ్, బాక్సింగ్ కోచ్‌లు ఛోటే లాల్ యాదవ్, ధర్మేంద్ర సింగ్ యాదవ్, షూటింగ్ కోచ్ నేహా నందకుమార్ చవాన్, రెజ్లింగ్ కోచ్ వీరేంద్ర కుమార్‌లకు ద్రోణాచార్య అవార్డులు అందజేశారు. టెన్జింగ్ నార్గే జాతీయ సాహస పురస్కారం, పుణెలోని ఆర్మీ పారాలింపిక్ నోడ్‌కు రాష్ట్రీయ ఖేల్ ప్రోత్సాహన్ పురస్కారం ప్రదానం చేశారు.ఈ ఏడాది ఆగస్టు 18న అవార్డు గ్రహీతల తుది జాబితాను ప్రకటించగా, వాయిదా పడిన పురస్కారాల ప్రదానోత్సవం తాజాగా నిర్వహించారు.

మోదీతో బహిరంగ చర్చకు రాహుల్ సవాల్

(మొదటి పేజీ తరువాయి)

తనతో ముఖాముఖి బహిరంగ చర్చకు రావాలని రాహుల్ మరోసారి సవాల్ విసిరారు. విదేశీ శక్తుల నియంత్రణలో ఎవరు ఉన్నారు? దేశ వ్యతిరేక కార్యకలాపాలకు పాల్పడుతున్నది ఎవరు? అనే విషయాలు చర్చలో తేలుతాయని అన్నారు. ఎక్కడైనా, ఎప్పుడైనా చర్చకు సిద్ధమని, ప్రధాని తనకు నచ్చిన వేదికను, న్యాయనిర్ణేతను ఎంపిక చేసుకోవచ్చని సూచించారు. టెలిప్రాంప్టర్ సహాయంతోనైనా చర్చకు రావచ్చని వ్యాఖ్యానించారు.పార్లమెంట్‌లో తనకు మాట్లాడే అవకాశం ఇవ్వడం లేదని, పలు కీలక అంశాలపై మాట్లాడుతున్న సమయంలో మైక్ నిలిపివేస్తున్నారని రాహుల్ విమర్శించారు. అందుకే ప్రజల సమక్షంలో నేరుగా చర్చ జరగాలని కోరుకుంటున్నట్లు తెలిపారు. తనతో చర్చకు వస్తే ప్రధాని రాజకీయ భవిష్యత్తు ముగుస్తుందని వ్యాఖ్యానించారు. రాహుల్ గాంధీ ఫోన్ ట్యాపింగ్ ఆరోపణలను బీజేపీ నేతలు ఖండించారు. కేరళ బీజేపీ అధ్యక్షుడు రాజీవ్ చంద్రశేఖర్ ఈ వ్యాఖ్యలను ఎద్దేవా చేశారు. రాహుల్ ఫోన్‌ను ట్యాప్ చేయాల్సిన ఆసక్తి ఎవరికీ లేదని వ్యాఖ్యానించారు. అయితే, తన ఫోన్ ట్యాపింగ్ అవుతోందన్న ఆరోపణలకు రాహుల్ ఈ సందర్భంగా ఎలాంటి సాంకేతిక ఆధారాలను బహిరంగంగా వెల్లడించలేదు.ం

నగర భద్రతకు పెద్దపీట..

కొత్త సీపీ మహేష్ భగవత్

- శాంతిభద్రతలు, మహిళా రక్షణ, ట్రాఫిక్‌పై ప్రత్యేక దృష్టి
- నేరస్తులపై కఠిన చర్యలు.. అక్రమ వసూళ్లకు పాల్పడితే కేసులు



హైదరాబాద్, నవంబర్ 13 : హైదరాబాద్ నగరంలో శాంతిభద్రతల పరిరక్షణకు, మహిళల భద్రతకు, ట్రాఫిక్ నియంత్రణకు ప్రత్యేక ప్రాధాన్యం ఇస్తామని నూతన పోలీస్ కమిషనర్ మహేష్ భగవత్ తెలిపారు. శుక్రవారం బంజారాహిల్స్‌లోని తెలంగాణ ఇంటిగ్రేటెడ్ కమాండ్ అండ్ కంట్రోల్ సెంటర్‌లో మాజీ సీపీ సజ్జనార్ నుంచి ఆయన బాధ్యతలు స్వీకరించారు. ఈ సందర్భంగా ప్రభుత్వానికి, ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డికి కృతజ్ఞతలు తెలిపారు. నగరంలో సివిల్ వివాదాల్లో పోలీసులు జోక్యం చేసుకోకుండా చర్యలు తీసుకుంటామని మహేష్ భగవత్ స్పష్టం చేశారు. భూముల ధరలు పెరుగుతున్న నేపథ్యంలో భూ తగాదాలకు సంబంధించి దాడులు జరుగుతున్నాయని, ఇలాంటి ఘటనలపై కఠినంగా వ్యవహరిస్తామని చెప్పారు. అనుభవజ్ఞులైన అధికారులతో కలిసి సమష్టిగా పనిచేస్తానన్నారు.తరచూ నేరాలకు పాల్పడే వారిపై కఠిన చర్యలు తీసుకుంటామని, అవసరమైతే పీడీ యాక్టు నమోదు చేస్తామని హెచ్చరించారు. పాత నేరస్తులపై నిరంతరం నిఘా ఉంచుతామని తెలిపారు. పోలీసులు ఎవరైనా అక్రమ వసూళ్లకు పాల్పడితే క్రిమినల్ కేసులతో పాటు శాఖాపరమైన చర్యలు తీసుకుంటామని స్పష్టం చేశారు.

లక్ష్మీదేవి పేట నర్సింగాపూర్ లో ఘనంగా నాగుల చవితి వేడుకలు







వెంకటాపూర్ నవంబర్ 13 (పీపుల్స్ న్యూస్)

వెంకటాపూర్ మండల కేంద్రంలోని లక్ష్మీదేవి పేట నర్సింగాపూర్ నాగ బ్రహ్మ క్షేత్రంలో నాగుల చవితి పర్వదినం సందర్భంగా ఘనంగా వేడుకలు నిర్వహించారు. పుట్టలో పాలు పోశారు. శివసత్తుల పూనకాలతో నాగబ్రహ్మ క్షేత్రంలో సందడి నెలకొంది.నాగబ్రహ్మ క్షేత్ర నిర్వాహకులు గొర్రె ఓదెలు, గొర్రె కుమార్ స్వామి, ఆవుల ఎర్రయ్య, ముదిగే రాజకుమార్, చెన్న శివ, నూనెటి నాగరాజు, గాజవేని శ్రీకాంత్, పల్లెబోయిన భద్రయ్య, జగన్, రవి తదితరులు పాల్గొన్నారు.

లక్ష్మీదేవి పేట రెండు చింతల నాగులమ్మ సన్నిధిలో పూజలు











వెంకటాపూర్ నవంబర్ 13 (పీపుల్స్ న్యూస్)

నాగుల చవితి పర్వదినం సందర్భంగా శుక్రవారం ములుగు జిల్లా వెంకటాపూర్ మండలంలోని లక్ష్మీదేవి పేట గ్రామా సమీపంలోని, పుట్ట కలుగులోని నాగులమ్మకు ఇష్టపూర్వకమైన ప్రసాదాలను ఆవు పాలతో పుట్ట కలుగులో తార విడిచి భక్తితో పూజలు నిర్వహించారు. పుట్టలపై ముక్కుల ముగ్గులు, పసుపు కుంకుమలతో, పూలతో అందంగా అలంకరించి, నాగ దేవతకు ప్రత్యేక పూజలు నిర్వహించారు.ఈ సందర్భంగా వెంకటాపూర్ మండలంలోని లక్ష్మీదేవి పేట, లోని రెండు చింతల నాగులమ్మ సన్నిధిలో మహిళలు భక్తి శ్రద్ధలతో పూజలు నిర్వహించారు. శుక్రవారం వేకువజామునుండే వందల సంఖ్యలో భక్తులు తరలివచ్చి పూజలు నిర్వహించారు. గ్రామాల్లో ఉండే పుట్టల వద్ద పెద్ద సంఖ్యలో భక్తులు, వేకువజామునుండే, పుట్ట కలుగులో ప్రసాదాలు, కోడిగుడ్లు, ఆవుపాలతో తార విడిచి, నాగుల చవితి పండుగను ఘనంగా నిర్వహించారు.ఈ సందర్భంగా ఆవు పాలకు గిరాకీ ఏర్పడింది. దూర ప్రాంతాల నుండి స్వచ్ఛమైన ఆవు పాలను భక్తులకు, పలుపూరు వ్యాపారులు విక్రయించారు. కార్తీక మాసంలో నాగులమ్మ తల్లికి, నాగదేవతకు పూజలు నిర్వహించారు.నాగ దేవతకు పూజలు చేస్తే వద్దాం వలం దక్కుతుందని పలువురు భక్తులు తెలిపారు. నాగులమ్మకు కోరుకున్న కోరికలు తీరడంతో ఆ గ్రామంలోని భక్తులు నాగులమ్మ పుట్ట వద్ద తలనీలాలు సమర్పించారు. కార్యక్రమంలో చిర్ర గణేష్, కట్టె కోళ్ల వెంకటేష్, చెవుల జనకరాజు, ఓదెలు, కాసాగాని సమ్మయ్య, పాక రవి, చెవుల అర్జయ్య, రవి, యాదండ్ల తిరుపతి, రాజయ్య, చందు, కిషన్, సతీష్, స్వరూప, స్వర్గత, అనిత, జయశ్రీ, మమత, కీర్తన, సుమలత, వసంత, సరిత, పెద్ద లక్ష్మి, చిన్న లక్ష్మి, శ్రీలత, పుష్ప, రాజేశ్వరి, విజయ, నాగమణి, సమ్మక్క, రేణుక, ప్రమీల, భార్గవి, రజిత మహిళలు పాల్గొన్నారు.

రేషన్ కార్డు ఉన్నప్రతి అర్హత కలిగిన కుటుంబానికి జాబ్ కార్డు

- దరఖాస్తు చేసుకున్న రెండు రోజుల్లో నూతన జాబ్ కార్డుల మంజూరు
- ఎల్ఎనినో ప్రతికూల పరిస్థితుల నేపథ్యంలో 19 లక్షల పనిదినాల కల్పనకు ప్రణాళిక
- నిరుపయోగంగా ఉన్న జాబ్ కార్డులను పునరుద్ధరించాలి
- జిల్లా కలెక్టర్ బోర్ఖడే హేమంత్ సహదేవరావు



ములుగు జిల్లా ప్రతినిధి నవంబర్ 13 (పీపుల్స్ న్యూస్)

ములుగు జిల్లాలోని అన్ని మండలాల్లో రేషన్ కార్డు ఉండి, అర్హత కలిగిన ప్రతి కుటుంబానికి జాబ్ కార్డు మంజూరు చేస్తామని జిల్లా కలెక్టర్ బోర్ఖడే హేమంత్ సహదేవరావు తెలిపారు.శుక్రవారం ములుగు జిల్లా సమీకృత కలెక్టరేట్‌లోని వీడియో కాన్ఫరెన్స్ హాల్‌లో జిల్లా కలెక్టర్ బోర్ఖడే హేమంత్ సహదేవరావు, జిల్లా అదనపు కలెక్టర్ స్థానిక సంస్థలు ఎం. సంపత్ రావుతో కలిసి నూతన జాబ్ కార్డుల మంజూరు తదితర అంశాలపై సమీక్ష సమావేశం నిర్వహించారు.ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ, ఎల్ఎనినో ప్రతికూల పరిస్థితుల నేపథ్యంలో పేద కుటుంబాలు ఎలాంటి ఇబ్బందులకు గురికాకుండా వీబీ-గ్రామ్ జీ పథకం ద్వారా 19 లక్షల పనిదినాలను కల్పించేందుకు ప్రణాళిక రూపొందించామని తెలిపారు.జిల్లాలోని ఏ గ్రామంలోనైనా రేషన్ కార్డు ఉండి, జాబ్ కార్డు లేని అర్హ కుటుంబాలు గ్రామ పంచాయతీ కార్యదర్శిని లేదా మండల పరిషత్ కార్యాలయంలో ఎంపీడీఓను సంప్రదించి దరఖాస్తు చేసుకోవాలని సూచించారు. ముఖ్యంగా 5 ఎకరాలలోపు భూమి ఉన్న అర్హత కలిగిన కుటుంబాలన్నీ జాబ్ కార్డు కోసం దరఖాస్తు చేసుకోవాలని తెలిపారు. దరఖాస్తు సమర్పించిన రెండు రోజుల్లో నూతన జాబ్ కార్డు మంజూరు చేస్తామని పేర్కొన్నారు. అదేవిధంగా పెద్ద కుటుంబాల్లో ఒకే జాబ్ కార్డు కలిగి ఉన్నవారు, 18 సంవత్సరాలు నిండిన వారు, వివాహమైన వారు అర్హత మేరకు జాబ్ కార్డు విభజన ద్వారా వేర్వేరు జాబ్ కార్డులు పొందవచ్చని తెలిపారు.గ్రామాల్లో ప్రస్తుతం వినియోగంలో లేని జాబ్ కార్డులను తిరిగి క్రియాశీలం చేసి, ఆయా కుటుంబాలకు ఉపాధి అవకాశాలు కల్పించేలా చర్యలు చేపడతామని పేర్కొన్నారు. జాబ్ కార్డు కోసం దరఖాస్తు చేసుకున్న అర్హులందరికీ సత్వరమే నూతన జాబ్ కార్డులు అందజేసేలా చర్యలు తీసుకోవాలని సంబంధిత అధికారులను ఆదేశించారు. ఈ కార్యక్రమంలో డీఆర్డీఓ రవీందర్, ఏపీడీ శ్రీనివాస్, సంబంధిత అధికారులు తదితరులు

జోరుక సదయ్య ఇంట విషాదం-తల్లి లక్ష్మి కన్నుమూత

-జోరుక సదయ్యకు మాతృ వియోగం-వేముల మహేందర్ గౌడ్ పరామర్శ

-లక్ష్మమ్మ మృతి పట్ల వేముల మహేందర్ గౌడ్ సంతాపం



మొగుళ్ళ పల్లి ప్రతినిధి నవంబర్ 13 (పీపుల్స్ న్యూస్)

జయశంకర్ భూపాలపల్లి జిల్లా మొగుళ్ళపల్లి మండలం పర్లపల్లి గ్రామానికి చెందిన జోరుక సదయ్య తల్లి లక్ష్మి ఇటీవల అనారోగ్యంతో మృతి చెందారు. ఈ విషాద వార్త తెలుసుకున్న బీసీ సంక్షేమ సంఘం జిల్లా అధ్యక్షుడు వేముల మహేందర్ గౌడ్, సదయ్య నివాసానికి వెళ్లి కుటుంబ సభ్యులను పరామర్శించారు. ఆయన మాట్లాడుతూ, “లక్ష్మమ్మ మృతి బాధాకరమని, తల్లిని కోల్పోవడం సదయ్య కుటుంబంలో విషాదాన్ని మిగిల్చిందని, ఆమె పవిత్రమైన ఆత్మకు శాంతి చేకూరాలని, ఆమెకు స్వర్గలోక ప్రాప్తి కలగాలని ఆకాంక్షిస్తూ..వారి కుటుంబానికి నా ప్రగాఢ సానుభూతి తెలియజేస్తున్నాను” అని తెలిపారు. అదేవిధంగా కొర్కిల గ్రామ మాజీ సర్పంచ్ దానవేణి రాములు కుమారుడు జశ్వంత్ ఇటీవల హైద్రాబాదులో రోడ్డు ప్రమాదంలో మరణించాడు. కాగా విషయాన్ని తెలుసుకున్న వేముల మహేందర్ గౌడ్ శుక్రవారం రాములు కుటుంబాన్ని పరామర్శించి, ఓదార్చారు. మృతి చెందిన జశ్వంత్ ఆత్మకు శాంతి చేకూరాలని, ఆయనకు స్వర్గలోక ప్రాప్తిరస్తు కలగాలని వేడుకున్నారు. ఈ కార్యక్రమంలో ప్రెస్ క్లబ్ మండల అధ్యక్షుడు దుర్గం సురేష్ గౌడ్, సీనియర్ జర్నలిస్ట్ మాటూరి రవీందర్ గౌడ్, బీసీ యువజన సంఘం జిల్లా కార్యదర్శి పండుగ నాగరాజు యాదవ్ పాల్గొన్నారు.

బాలానగర్ సహాయ సివిల్ సప్లై అధికారిగా ఎ. సృతి బాధ్యతల స్వీకరణ.



బాలానగర్ నవంబర్ 14 (పీపుల్స్ న్యూస్)

బాలానగర్ సర్కిల్ సహాయ సివిల్ సప్లై అధికారిగా ఎ. సృతి గురువారం ఇంచార్జి బాధ్యతలు స్వీకరించారు. ఇప్పటివరకు మేడ్చల్--మల్కాజిగిరి జిల్లా సివిల్ సప్లై కార్యాలయంలో విధులు నిర్వహిస్తున్న ఆమె బదిలీపై బాలానగర్ సర్కిల్‌కు వచ్చారు. ఇక్కడ సహాయ సివిల్ సప్లై అధికారిగా పనిచేసిన కల్యాణ్ నాగర్ కర్నూల్ జిల్లా ఇంచార్జి జిల్లా పౌరసరఫరాల అధికారిగా బదిలీ అయ్యారు. దీంతో ఆయన స్థానంలో ఎ. సృతి బాలానగర్ సర్కిల్ బాధ్యతలు చేపట్టారు.

హుజూర్‌నగర్‌లో ప్రతిష్ఠించనున్న రాజీవ్ గాంధీ విగ్రహం

-- బాలానగర్‌లో రూపుదిద్దుకుంటున్న విగ్రహ తయారీ పనులను పరిశీలించిన ఉప ముఖ్యమంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి





బాలానగర్ నవంబర్ 14 (పీపుల్స్ న్యూస్)

హుజూర్‌నగర్ నియోజకవర్గంలో త్వరలో ప్రతిష్ఠించనున్న దివంగత మాజీ ప్రధానమంత్రి, భారతరత్న రాజీవ్ గాంధీ విగ్రహం తయారీ పనులను రాష్ట్ర ఉప ముఖ్యమంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి శుక్రవారం పరిశీలించారు. కూకట్‌పల్లి నియోజకవర్గంలోని బాలానగర్ డివిజన్ పరిధిలో విగ్రహం రూపుదిద్దుకుంటున్న తయారీ కేంద్రాన్ని ఆయన సందర్శించి, పనుల పురోగతిని స్వయంగా తెలుసుకున్నారు.ఈ సందర్భంగా తయారవుతున్న రాజీవ్ గాంధీ విగ్రహాన్ని నిశితంగా పరిశీలించిన ఉప ముఖ్యమంత్రి, విగ్రహం రూపురేఖలు, ఆకృతి, నాణ్యతతో పాటు తయారీలో అనుసరిస్తున్న ప్రమాణాల గురించి సంబంధిత తయారీదారులను అడిగి వివరాలు తెలుసుకున్నారు. విగ్రహం ఆకర్షణీయంగా, రాజీవ్ గాంధీ వ్యక్తిత్వానికి తగినట్లుగా ఉండేలా తీసుకుంటున్న జాగ్రత్తలను పరిశీలించారు. ఆధునిక భారతదేశ నిర్మాణంలో కీలక పాత్ర పోషించిన రాజీవ్ గాంధీ సేవలు, దేశాభివృద్ధికి ఆయన అందించిన కృషి చిరస్మరణీయమని ఈ సందర్భంగా పలువురు పేర్కొన్నారు. ఆయన ఆశయాలు, సేవలను భావితరాలకు గుర్తుచేసేలా హుజూర్‌నగర్ నియోజకవర్గంలో విగ్రహాన్ని ప్రతిష్ఠించేందుకు ఏర్పాట్లు జరుగుతున్నాయి. ఈ నేపథ్యంలో విగ్రహ తయారీ నాణ్యత, సుందరమైన రూపకల్పనకు ప్రత్యేక ప్రాధాన్యత ఇస్తున్నారు. బాలానగర్‌లో విగ్రహ తయారీ పనులు కొనసాగుతుండగా, ఉప ముఖ్యమంత్రి స్వయంగా విచ్చేసి పరిశీలించడం స్థానిక కాంగ్రెస్ శ్రేణుల్లో ఆసక్తిని కలిగించింది. ఈ కార్యక్రమంలో బాలానగర్ డివిజన్ అధ్యక్షుడు పులి శివకుమార్ గౌడ్, అధికార ప్రతినిధి మదన్ మోహన్, జల్లా శివ తదితరులు పాల్గొన్నారు.

ఎస్సార్ నగర్ ఏసీపీ రాఘవేందర్‌రావుకు దీపావళి శుభాకాంక్షలు



సనత్ నగర్: నవంబర్ 13 (పీపుల్స్ న్యూస్) ఎస్సార్ నగర్ ఏసీపీ రాఘవేందర్‌రావును మర్యాదపూర్వకంగా కలిసి ఎమ్మార్పీఎస్ సనత్‌నగర్ నాయకులు దీపావళి పండుగ శుభాకాంక్షలు తెలియజేశారు. ఈ సందర్భంగా ఆయనకు పండుగ శుభాకాంక్షలు తెలిపి సంతోషాన్ని పంచుకున్నారు.ఈ కార్యక్రమంలో ఎమ్మార్పీఎస్ సనత్‌నగర్ నాయకులు పొలిమేర సంతోష్ కుమార్, మంగళారం ప్రసాద్, రామేశ్వర్ రమేష్, ముత్యాల వేణుగోపాల్ తదితరులు పాల్గొన్నారు.

జవహర్‌నగర్, చంద్రపురి కాలనీల్లో అభివృద్ధి పనులకు శ్రీకారం

సీసీ రోడ్లు, మురుగునీటి కాలువల నిర్మాణ పనులు ప్రారంభం





హైదరాబాద్ : నవంబర్ 13 (పీపుల్స్ న్యూస్) జవహర్‌నగర్, చంద్రపురి కాలనీల్లో స్థానిక ప్రజలకు మెరుగైన మౌలిక సదుపాయాలు కల్పించే దిశగా సీసీ రోడ్లు, మురుగునీటి కాలువల నిర్మాణ పనుల ప్రారంభ కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి టీపీసీసీ రాష్ట్ర ఉపాధ్యక్షుడు, ఎస్సీ విభాగం మల్కాజిగిరి పార్లమెంట్ ఇన్‌చార్జి డాక్టర్ గడ్డం శ్రీనివాస్ హాజరయ్యారు.ఈ సందర్భంగా కాలనీల్లో రహదారుల అభివృద్ధి, మురుగునీటి సమస్యల పరిష్కారానికి చేపడుతున్న పనులను ప్రారంభించారు. సీసీ రోడ్లు, మురుగునీటి కాలువల నిర్మాణంతో స్థానిక ప్రజలకు రాకపోకల్లో సౌకర్యం కలగడంతో పాటు పారిశుద్ధ్య సమస్యలు తగ్గనున్నాయని నాయకులు పేర్కొన్నారు.ఈ కార్యక్రమంలో మాజీ మేయర్ దొంతగాని శాంతిగౌడ్, డిప్యూటీ మేయర్ రెడ్డి శెట్టి శ్రీనివాస్ గుప్తా, మాజీ సర్పంచ్ కారింగుల శంకర్ గౌడ్, వెనుకబడిన తరగతుల విభాగం చైర్మన్ పసుపులేటి వీరభాస్కరరావు, మొగిలిపాక వెంకటేష్, మాజీ కార్పొరేటర్లు కృష్ణ గౌడ్, మనోధర్ రెడ్డి, కోటేష్ గౌడ్, సాయి తదితర నాయకులు పాల్గొన్నారు.

ఎల్‌నినో ప్రభావం.. రబీ పంటలపై జిల్లా కలెక్టర్లకు సీఎస్ కీలక ఆదేశాలు



హైదరాబాద్, నవంబర్13: ఎల్‌నినో ప్రభావంతో వర్షాభావ పరిస్థితులు నెలకొన్నాయని.. ఈ నేపథ్యంలో వాతావరణ పరిస్థితులకు అనుగుణంగా పంటల ఎంపికలో రైతులను ప్రోత్సహించాలని జిల్లా కలెక్టర్లను ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి (సీఎస్) సంజయ్ జాజు ఆదేశించారు. రాష్ట్రంలో ఏర్పడిన వాతావరణ పరిస్థితులపై శుక్రవారం జిల్లా కలెక్టర్లతో ఆయన వీడియో కాన్ఫరెన్స్ ద్వారా సమీక్ష నిర్వహించారు. రబీ పంటల సాగు కార్యాచరణ ప్రణాళికపై ప్రత్యేక దృష్టి పెట్టాలని వారికి స్పష్టం చేశారు. అందుకోసం జిల్లాల వారీగా పకడ్బందీగా రబీ సాగు ప్రణాళికలు రూపొందించాలని సూచించారు.నీటి లభ్యత ఆధారంగా పంటల సాగుకు ప్రణాళిక సిద్ధం చేయాలని సీఎస్ సంజయ్ జాజు తెలిపారు. అలాగే రబీకి అవసరమైన విత్తనాలను ముందుగానే సిద్ధం చేయాలని అన్నారు. కూరగాయలు, పప్పు ధాన్యాల సాగును ప్రోత్సహించాలని వివరించారు. బిందు సేద్యం, సూక్ష్మ సేద్యంపై ప్రత్యేక దృష్టి పెట్టాలని చెప్పారు. ధాన్యం కొనుగోళ్లలో రైతులకు ఇబ్బందులు లేకుండా చర్యలు తీసుకోవాలని ఆదేశించారు.భూసేకరణ సమస్యల పరిష్కారానికి ప్రాధాన్యత ఇవ్వాలని వారికి సీఎస్ సంజయ్ జాజు స్పష్టం చేశారు. ప్రభుత్వ పాఠశాలలను తరచూ తనిఖీ చేయాలని కలెక్టర్లకు స్పష్టం చేశారు. అలాగే యంగ్ ఇండియా ఇంటిగ్రేటెడ్ రెసిడెన్షియల్ స్కూల్స్ పనులు వేగవంతం చేయాలని అన్నారు. తెలంగాణ పబ్లిక్ స్కూళ్లలో పారిశుద్ధ్యానికి ప్రాధాన్యత ఇవ్వాలని వారిని కోరారు. ప్రభుత్వ ప్రాధాన్యతల అమలుపై నిరంతర పర్యవేక్షణ చేయాలని జిల్లా కలెక్టర్లకు సీఎస్ సంజయ్ జాజు సూచించారు.

ప్రతి కుటుంబానికి జీవిత బీమా భద్రత

- దేశంలోనే తొలిసారిగా తెలంగాణలో ఇందిరమ్మ కుటుంబ జీవిత బీమా పథకం
- ప్రతి కుటుంబానికి రూ.5 లక్షల జీవిత బీమా రక్షణ
- కుల, మత, వర్గ, వర్ణ, లింగ, ఆదాయ భేదాలు లేకుండా అన్ని కుటుంబాలకు వర్తింపు
- నవంబర్ 19న రాష్ట్రవ్యాప్తంగా పథకం ప్రారంభం
- గ్రామాలు, పట్టణాల్లో ప్రత్యేక నమోదు కేంద్రాలు ఏర్పాటు చేయాలి
- నవంబర్ 14 నుంచి విస్తృత అవగాహన కార్యక్రమాలు చేపట్టాలి
- అత్యంత ప్రతిష్ఠాత్మకమైన పథకం అమలులో కలెక్టర్లు ప్రత్యేక శ్రద్ధ వహించాలి
- రాష్ట్ర ఉప ముఖ్యమంత్రి, ఆర్థిక, ప్రణాళిక, విద్యుత్ శాఖల మంత్రి మల్లు భట్టి విక్రమార్క





ములుగు జిల్లా ప్రతినిధి నవంబర్ 13 (పీపుల్స్ న్యూస్)

రాష్ట్రంలోని ప్రతి కుటుంబానికి జీవిత బీమా భద్రత కల్పించాలనే లక్ష్యంతో రాష్ట్ర ప్రభుత్వం అత్యంత ప్రతిష్ఠాత్మకంగా ఇందిరమ్మ కుటుంబ జీవిత బీమా పథకాన్ని ప్రారంభించనున్నట్లు రాష్ట్ర ఉప ముఖ్యమంత్రి, ఆర్థిక, ప్రణాళిక, విద్యుత్ శాఖల మంత్రి మల్లు భట్టి విక్రమార్క తెలిపారు.శుక్రవారం హైదరాబాద్‌లోని డాక్టర్ బీఆర్ అంబేద్కర్ తెలంగాణ రాష్ట్ర సచివాలయం నుంచి రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి సంజయ్ జాజుతో కలిసి ఇందిరమ్మ కుటుంబ జీవిత బీమా పథకం విధివిధానాలు, అమలు, నమోదు ప్రక్రియ, అవగాహన కార్యక్రమాలపై అన్ని జిల్లాల కలెక్టర్లతో ఉప ముఖ్యమంత్రి వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించారు.

ఈ వీడియో కాన్ఫరెన్స్‌లో ములుగు జిల్లా సమీకృత కలెక్టరేట్‌లోని వీడియో కాన్ఫరెన్స్ హాల్ నుంచి జిల్లా కలెక్టర్ బోర్కడే హేమంత్ సహదేవరావు పాల్గొన్నారు.

ఈ సందర్భంగా రాష్ట్ర ఉప ముఖ్యమంత్రి మల్లు భట్టి విక్రమార్క మాట్లాడుతూ, రాష్ట్రంలోని ప్రతి కుటుంబానికి ఆర్థిక భరోసా, జీవిత బీమా భద్రత కల్పించేందుకు రాష్ట్ర ప్రభుత్వం ఈ పథకాన్ని రూపొందించిందని, ఇందుకు సంబంధించి రాష్ట్ర బడ్జెట్‌లో కూడా ప్రకటించినట్లు తెలిపారు.దేశంలో ఇప్పటివరకు ఏ రాష్ట్రంలోనూ లేనివిధంగా మొట్టమొదటిసారిగా తెలంగాణ రాష్ట్రంలో ఈ పథకాన్ని అమలు చేస్తున్నామని పేర్కొన్నారు. కులం, మతం, వర్ణం, వర్గం, లింగం, ఆదాయంతో సంబంధం లేకుండా రాష్ట్రంలోని అన్ని కుటుంబాలకు ఈ పథకం వర్తిస్తుందని తెలిపారు. ఈ పథకం ద్వారా ప్రతి కుటుంబానికి రూ. 5 లక్షల జీవిత బీమా భద్రత కల్పించనున్నట్లు వెల్లడించారు. తెలంగాణలోని ప్రతి కుటుంబం ఈ పథకానికి అర్హమేనని, అర్హులైన కుటుంబాలన్నింటినీ పథకం పరిధిలోకి తీసుకురావడమే ప్రభుత్వ లక్ష్యమని స్పష్టం చేశారు.

ఇప్పటివరకు అమలులో ఉన్న వివిధ బీమా పథకాలు కొన్ని వర్గాలకు, కొన్ని శాఖలకు మాత్రమే పరిమితమయ్యాయని, అందుకు భిన్నంగా రాష్ట్రంలోని ప్రతి కుటుంబానికి జీవిత బీమా భద్రత కల్పించేలా ఈ పథకాన్ని రూపొందించినట్లు తెలిపారు. దురదృష్టవశాత్తు కుటుంబ పెద్ద మరణించిన సందర్భంలో ఆ కుటుంబం ఆర్థికంగా ఇబ్బందులకు గురికాకుండా భరోసా కల్పించడమే ఈ పథకం ప్రధాన ఉద్దేశమని వివరించారు.

నవంబర్ 19న ఇందిరమ్మ కుటుంబ జీవిత బీమా పథకాన్ని రాష్ట్రవ్యాప్తంగా ఒకేసారి లాంఛనంగా ప్రారంభించనున్నట్లు తెలిపారు. ఇందుకు అవసరమైన ముందస్తు ఏర్పాట్లను జిల్లా కలెక్టర్లు పకడ్బందీగా చేపట్టాలని ఆదేశించారు.

ప్రతి కుటుంబం వివరాలను నమోదు చేయాలి

రాష్ట్ర ప్రభుత్వం నిర్వహించిన సామాజిక, ఆర్థిక సర్వే ద్వారా సేకరించిన కుటుంబాల వివరాలు, పౌరసరఫరాల శాఖ వద్ద అందుబాటులో ఉన్న రేషన్ కార్డుల సమాచారాన్ని ఆధారంగా చేసుకొని నమోదు ప్రక్రియ చేపట్టాలని సూచించారు. రేషన్ కార్డులు లేని కుటుంబాల వివరాలను కూడా సర్వే సమాచారం ఆధారంగా పరిశీలించి, పథకం పరిధిలోకి తీసుకురావాలని తెలిపారు.గ్రామీణ ప్రాంతాల్లో పంచాయతీరాజ్ శాఖ, పట్టణ ప్రాంతాల్లో మున్సిపాలిటీలు, మున్సిపల్ కార్పొరేషన్ల అధికారులు సమన్వయంతో పనిచేయాలని సూచించారు. గ్రామాలు, వార్డులు, డివిజన్లలో అవసరానికి అనుగుణంగా ప్రత్యేక నమోదు కేంద్రాలను ఏర్పాటు చేసి, కుటుంబాలన్నీ తమ వివరాలను సులభంగా నమోదు చేసుకునేలా చర్యలు చేపట్టాలన్నారు.

నమోదు కేంద్రాల్లో సంబంధిత అధికారులు అందుబాటులో ఉండి, కుటుంబాల వివరాలను పరిశీలించి బీమా దరఖాస్తులను నమోదు చేయాలని తెలిపారు. నమోదు కేంద్రాల వివరాలు, తేదీలు, సమయాలను ప్రజలకు ముందుగానే తెలియజేయాలని సూచించారు.

నామినీల ఎంపికపై కుటుంబాలకు స్పష్టమైన అవగాహన కల్పించాలి

బీమా పథకంలో నామినీల ఎంపికకు సంబంధించి కుటుంబాలకు పూర్తి స్వేచ్ఛ కల్పించినట్లు ఉప ముఖ్యమంత్రి తెలిపారు. బీమా మొత్తానికి ఒకరిని నామినీగా ఎంపిక చేసుకునే అవకాశం ఉండటంతో పాటు, ఒకరి కంటే ఎక్కువ మందిని నామినీలుగా ఎంపిక చేసుకొని తమకు నచ్చిన విధంగా బీమా మొత్తాన్ని పంపిణీ చేసుకునే అవకాశం కల్పించినట్లు వివరించారు.దరఖాస్తులను పూర్తి చేసిన అనంతరం కుటుంబ సభ్యులకు అందులోని వివరాలను పూర్తిగా చదివి వినిపించి, వారికి అర్థమయ్యేలా వివరించిన తర్వాతే సంతకాలు తీసుకోవాలని అధికారులకు సూచించారు. తాము ఏ పథకం కోసం సంతకం చేస్తున్నారో, ఎవరిని నామినీలుగా ఎంపిక చేసుకున్నారో ప్రతి కుటుంబానికి స్పష్టంగా తెలియాలని ఆదేశించారు.

ప్రతి ఇంటికీ పథకం సమాచారం చేరాలి

నవంబర్ 14 నుంచి ఇందిరమ్మ కుటుంబ జీవిత బీమా పథకంపై రాష్ట్రవ్యాప్తంగా విస్తృత అవగాహన కార్యక్రమాలను చేపట్టాలని ఉప ముఖ్యమంత్రి ఆదేశించారు. గ్రామాలు, పట్టణాలు, మున్సిపాలిటీలు, మున్సిపల్ కార్పొరేషన్ల పరిధిలోని వార్డుల్లో ప్రతి కుటుంబానికి పథకం సమాచారం చేరేలా ప్రత్యేక కార్యాచరణ రూపొందించు కోవాలన్నారు. మీడియా ద్వారా పథకం లక్ష్యాలు, ప్రయోజనాలు, నమోదు విధానం, నామినీల ఎంపిక తదితర అంశాలపై విస్తృత ప్రచారం నిర్వహించాలని సూచించారు.నవంబర్ 17, 18 తేదీల్లో గ్రామాలు, పట్టణాల్లో పథకం అమలుకు సంబంధించిన సమాచారాన్ని ప్రజలకు ముందస్తుగా తెలియజేయాలన్నారు. అవసరమైన ప్రచార సామగ్రిని అందుబాటులో ఉంచి, ప్రతి కుటుంబానికి పథకంపై పూర్తి అవగాహన కల్పించేలా చర్యలు చేపట్టాలని తెలిపారు.

పథకం అమలులో అత్యంత జాగ్రత్త వహించాలి

దేశంలోనే తొలిసారిగా ఇటువంటి పథకాన్ని అమలు చేస్తున్న నేపథ్యంలో జిల్లా కలెక్టర్లు అత్యంత జాగ్రత్తగా, బాధ్యతాయుతంగా వ్యవహరించాలని ఉప ముఖ్యమంత్రి సూచించారు. రాష్ట్ర ప్రభుత్వ అత్యంత ప్రతిష్ఠాత్మక పథకాన్ని విజయవంతం చేసేందుకు జిల్లా స్థాయి నుంచి గ్రామస్థాయి వరకు అధికార యంత్రాంగం పూర్తి నిబద్ధతతో పనిచేయాలన్నారు.పథకం విధివిధానాలు, నమోదు ప్రక్రియ, అమలును రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి సంజయ్ జాజు క్షుణ్ణంగా పర్యవేక్షిస్తారని తెలిపారు. ఆయా శాఖల అధికారులు సమన్వయంతో పనిచేస్తూ పథకం ప్రయోజనం ప్రతి కుటుంబానికి చేరేలా జిల్లా కలెక్టర్లు ప్రత్యేక దృష్టి సారించాలని ఆదేశించారు.

కుటుంబాల వివరాల నమోదులో ఖచ్చితత్వం పాటించాలి :: రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి సంజయ్ జాజు

ఈ సందర్భంగా రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి సంజయ్ జాజు మాట్లాడుతూ, కుటుంబాల జీవిత బీమా నమోదు ప్రక్రియను పూర్తిగా డిజిటలైజ్ చేసినట్లు తెలిపారు. నమోదు సమయంలో కుటుంబ సభ్యుల వివరాలు, బీమా ప్రయోజనం పొందే వారి వివరాలు, నామినీల సమాచారం ఖచ్చితంగా నమోదు చేయడం అత్యంత ముఖ్యమని అధికారులకు సూచించారు.

నవంబర్ 19 నుంచి తదుపరి 15 నుంచి 20 రోజుల వ్యవధిలో నమోదు ప్రక్రియను ప్రణాళికాబద్ధంగా ముందుకు తీసుకెళ్లాలని తెలిపారు. పథకం విధివిధానాలకు సంబంధించి ఏవైనా సందేహాలు ఉంటే సంబంధిత శాఖల ద్వారా నివృత్తి చేసుకొని, అమలులో ఎలాంటి లోటుపాట్లకు తావులేకుండా చర్యలు చేపట్టాలన్నారు.రాష్ట్ర ప్రభుత్వం అత్యంత ప్రతిష్ఠాత్మకంగా చేపడుతున్న ఈ పథకం దేశంలోనే ప్రత్యేకమైనదని, ప్రతి కుటుంబానికి జీవిత బీమా భద్రత కల్పించే ఈ కార్యక్రమాన్ని విజయవంతం చేసేందుకు అధికారులందరూ పూర్తి అంకితభావంతో పనిచేయాలని సూచించారు.ఈ కార్యక్రమంలో జిల్లా అదనపు కలెక్టర్ స్థానిక సంస్థలు ఎం. సంపత్ రావు, డీఆర్డీఓ రవీందర్, జిల్లా ముఖ్య ప్రణాళిక అధికారి, మున్సిపల్ కమిషనర్, సంబంధిత శాఖల అధికారులు తదితరులు పాల్గొన్నారు.

డిజిటల్ అరెస్ట్ మోసం కేసులో కీలక నిందితుడి అరెస్ట్

- టెలిగ్రామ్ ద్వారా చైనా సైబర్ నేరగాళ్లకు బ్యాంకు ఖాతాలు, సిమ్ కార్డుల సరఫరా.. నిందితుడి నుంచి మొబైల్ ఫోన్ స్వాధీనం
- రూ.6.60 లక్షలు కాజేసిన ముఠాతో సంబంధాలు.. గతంలోనూ రెండు కేసుల్లో అరెస్ట్



హైదరాబాద్ కమిషనరేట్ : క్రైమ్ బ్యూరో నవంబర్ 13 (పీపుల్స్ న్యూస్)

డిజిటల్ అరెస్ట్ పేరుతో ప్రజలను భయభ్రాంతులకు గురిచేస్తూ లక్షలాది రూపాయలు కాజేస్తున్న సైబర్ నేరగాళ్ల ముఠాకు సహకరిస్తున్న కీలక నిందితుడిని హైదరాబాద్ నగర సైబర్ క్రైమ్ పోలీసులు అరెస్ట్ చేశారు. టెలిగ్రామ్ వేదికగా చైనా జాతీయులతో పాటు ఇతర సైబర్ నేరగాళ్లతో సంబంధాలు ఏర్పరచుకుని, వారికి మ్యూల్ బ్యాంకు ఖాతాలు, రిజిస్టర్డ్ సిమ్ కార్డులు సమకూరుస్తున్నట్లు పోలీసుల దర్యాప్తులో వెల్లడైంది. నిందితుడి వద్ద నుంచి ఒక మొబైల్ ఫోన్‌ను పోలీసులు స్వాధీనం చేసుకున్నారు.

రూ.6.60 లక్షల డిజిటల్ అరెస్ట్ మోసం.

బెంగళూరు పోలీసులమంటూ వాట్సాప్‌లో నకిలీ పోలీసు లోగోలను ప్రదర్శించి, డిజిటల్ అరెస్ట్ పేరుతో బెదిరింపులకు పాల్పడిన సైబర్ నేరగాళ్లు ఓ మహిళ నుంచి రూ.6,60,543 కాజేశారు. నకిలీ దర్యాప్తు నివేదికలు, ఫోర్జరీ చేసిన అధికారిక పత్రాలను పంపి చట్టపరమైన చర్యలు తీసుకుంటామని భయపెట్టి ఆమె పెన్షన్ ఖాతా నుంచి నగదును బదిలీ చేయించుకున్నారు. నిరంతర బెదిరింపులు, మానసిక వేధింపుల నేపథ్యంలో బాధితురాలు 2025 సెప్టెంబర్ 8న గుండెపోటుతో మరణించినట్లు ఫిర్యాదులో పేర్కొన్నారు.

ఈ ఘటనపై బాధితురాలి కుటుంబ సభ్యులు 2025 సెప్టెంబర్ 15న ఫిర్యాదు చేయగా, హైదరాబాద్ సైబర్ క్రైమ్ పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు ప్రారంభించారు.

టెలిగ్రామ్ ద్వారా నేర ముఠాతో సంబంధాలు.

ఒడిశాలోని రూర్కెలాకు చెందిన సంబిత్ కుమార్ నాయక్ (24) ఫ్రీలాన్స్ మోడల్‌గా పనిచేస్తున్నాడు. ఆర్థిక ఇబ్బందుల కారణంగా టెలిగ్రామ్ ద్వారా సైబర్ నేరగాళ్లతో పరిచయం పెంచుకున్నాడు. కమీషన్ల ఆశతో వివిధ వ్యక్తుల నుంచి బ్యాంకు ఖాతాలు సేకరించి నేర ముఠాలకు అందించడం ప్రారంభించాడు. అనంతరం కంబోడియా నుంచి హైపే () కంపెనీ పేరుతో కార్యకలాపాలు నిర్వహిస్తున్న విరాజ్‌తో పాటు చైనా జాతీయులతో సంబంధాలు ఏర్పరచుకున్నాడు.మోసపూరిత లావాదేవీల కోసం బ్యాంకు ఖాతాలు, ఏటీఎం కార్డులు, చెక్‌బుక్‌లు, సిమ్ కార్డుల సేకరణను సమన్వయం చేసేవాడు. బ్యాంకింగ్ లావాదేవీలకు సంబంధించిన ఓటీపీలను సైతం నేరగాళ్లకు పంపిస్తూ, సైబర్ మోసాల ద్వారా వచ్చిన నగదును ఇతర ఖాతాలకు మళ్లించడంలో సహకరించినట్లు పోలీసుల విచారణలో వెల్లడైంది.

గతంలోనూ రెండు కేసుల్లో అరెస్ట్.

నిందితుడు సంబిత్ కుమార్ నాయక్‌పై గతంలోనూ సైబర్ నేరాలకు సంబంధించి కేసులు నమోదయ్యాయి. 2025 జనవరిలో పింప్రి చించ్వాడ్ సైబర్ క్రైమ్ పోలీసులు కేసు నంబర్ 05/2025లో అరెస్ట్ చేశారు. అలాగే కాలేపడల్ పోలీస్ స్టేషన్‌లో కేసు నంబర్ 46/2025లో కూడా అరెస్ట్ అయ్యాడు. సుమారు ఆరు నెలల పాటు జ్యుడీషియల్ కస్టడీలో ఉన్న అనంతరం విడుదలై తిరిగి సైబర్ నేర కార్యకలాపాలకు పాల్పడినట్లు పోలీసులు వెల్లడించారు.

దేశవ్యాప్తంగా మరో మూడు కేసులతో లింకులు.

నిందితుడికి సంబంధించిన ఐసీఐసీఐ బ్యాంకు ఖాతా ద్వారా జరిగిన అనుమానాస్పద లావాదేవీలపై దేశవ్యాప్తంగా మరో మూడు సైబర్ క్రైమ్ కేసులు నమోదైనట్లు దర్యాప్తులో గుర్తించారు. విశ్వసనీయ సమాచారం ఆధారంగా 2026 నవంబర్ 8న నిందితుడిని పోలీసులు అదుపులోకి తీసుకున్నారు. విచారణలో డబ్బు కోసం సైబర్ నేరగాళ్లకు బ్యాంకు ఖాతాలు, సిమ్ కార్డులు అందించినట్లు వెల్లడించినట్లు పోలీసులు తెలిపారు.

ఏసీపీ పర్యవేక్షణలో ఆపరేషన్.

హైదరాబాద్ నగర సైబర్ క్రైమ్ ఏసీపీ ఆర్.జి. శివ మారుతి ప్రత్యక్ష పర్యవేక్షణలో ఈ ఆపరేషన్ నిర్వహించారు. నిందితుడిని పట్టుకోవడంలో కృషి చేసిన ఇన్‌స్పెక్టర్ వై. గౌరు నాయుడు, టీమ్-1 సిబ్బందిని ఉన్నతాధికారులు అభినందించారు.ఈ వివరాలను సైబర్ క్రైమ్స్ డిప్యూటీ కమిషనర్ ఆఫ్ పోలీస్ రాహుల్ హెడ్జ్ బి.కె., ఐపీఎస్ పత్రికా ప్రకటన ద్వారా వెల్లడించారు.

కూకట్‌పల్లి కాంగ్రెస్ జేఏసీ' ఏర్పాటుపై సీనియర్ నేత పులి శివకుమార్ గౌడ్ సందేహాలు.. పార్టీ ఐక్యతకు పిలుపు

బాలానగర్ నవంబర్ 14 (పీపుల్స్ న్యూస్)

కూకట్‌పల్లి నియోజకవర్గంలో క్షేత్రస్థాయిలో పార్టీ కార్యక్రమాలు చురుగ్గా కొనసాగుతున్న తరుణంలో, కొత్తగా 'కూకట్‌పల్లి కాంగ్రెస్ జాయింట్ యాక్షన్ కమిటీ ఏర్పాటు ప్రకటనపై సీనియర్ కాంగ్రెస్ నాయకులు, బాలానగర్ డివిజన్ అధ్యక్షులు పులి శివకుమార్ గౌడ్ అభ్యంతరం వ్యక్తం చేశారు. ప్రత్యేకంగా ఇలాంటి కమిటీ ఏర్పాటు చేయాల్సిన అవసరం ఏమొచ్చిందని ఆయన ప్రశ్నించారు. నియోజకవర్గంలో పార్టీ బలోపేతం కోసం స్థానిక నాయకులు, కార్యకర్తలు ఇప్పటికే తెలంగాణ ప్రదేశ్ కాంగ్రెస్ కమిటీ నియమావళికి అనుగుణంగా పనిచేస్తున్నారని పులి శివకుమార్ గౌడ్ పేర్కొన్నారు. టీపీసీసీ ఉపాధ్యక్షులు, కూకట్ పల్లి నియోజకవర్గ ఇంచార్జ్ బండి రమేష్ మార్గదర్శకత్వంలో నియోజకవర్గ నేతలు, కార్యకర్తలు సమన్వయంతో ముందుకు సాగుతూ పార్టీకి మద్దతు కూడ గడుతున్నారని ఆయన తెలిపారు. ప్రస్తుతం స్థానిక క్యాడర్ ప్రధానంగా కాంగ్రెస్ పార్టీ ఎన్నికల హామీలను, రాష్ట్ర ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ, అభివృద్ధి కార్యక్రమాలను ప్రజల్లోకి విస్తృతంగా



తీసుకెళ్లడంపైనే దృష్టి సారించాలని ఆయన సూచించారు. ఇలాంటి సమయంలో సమాంతరంగా ఒక స్వతంత్ర జేఏసీని ఏర్పాటు చేయడం వెనుక ఉన్న ఉద్దేశాన్ని ఆయన నిలదీశారు. ప్రత్యేకంగా జేఏసీని ప్రకటించడం వల్ల ప్రజల్లో గందరగోళం ఏర్పడే ప్రమాదం ఉందని, ఇది ప్రతిపక్ష పార్టీలు కాంగ్రెస్‌పై నిరాధార ఆరోపణలు చేయడానికి అవకాశం కల్పిస్తుందని శివకుమార్ గౌడ్ ఆందోళన వ్యక్తం చేశారు. ఇటువంటి సమాంతర కార్యక్రమాలు పార్టీ క్రమశిక్షణకు భంగం కలిగించడంతో పాటు సీనియర్ నాయకత్వం మధ్య అపార్థాలకు దారితీస్తాయని అభిప్రాయపడ్డారు. కూకట్‌పల్లి కాంగ్రెస్ జేఏసీ ఏర్పాటు వెనుక ఎవరున్నారు, దీనికి ఎవరు నాయకత్వం వహిస్తున్నారో స్పష్టం చేయాలని ఆయన డిమాండ్ చేశారు.రాబోయే ఎన్నికలను దృష్టిలో ఉంచుకుని స్థానిక నాయకులు, కార్యకర్తలందరూ విభేదాలను వీడి ఒకే జెండా కింద ఐక్యంగా పనిచేయాలని, పార్టీ అభ్యున్నతికి సమష్టిగా కృషి చేయాలని పులి శివకుమార్ గౌడ్ పిలుపునిచ్చారు.

చిన్న వ్యాపారులకు కేంద్ర ప్రభుత్వం గుడ్ న్యూస్

ముద్రా రుణ పథకానికి మరో ఐదేళ్ల పొడిగింపు.. రూ.5,000 కోట్ల నిధులు కేటాయింపు!

ప్రధానమంత్రి ముద్రా యోజన కింద రుణాలకు సంబంధించి క్రెడిట్ గ్యారంటీ పథకాన్ని 2031 మార్చి 31 వరకు పొడిగిస్తూ కేంద్ర కేబినెట్ కీలక నిర్ణయం తీసుకుంది.

ముఖ్యమైన వివరాలు:

ముద్రా రుణాల కోసం రూ.5,000 కోట్ల క్రెడిట్ గ్యారంటీ నిధి.
వచ్చే ఐదేళ్లలో రూ.12.6 లక్షల కోట్ల రుణాలు అందించేందుకు అవకాశం.
అర్హులైన చిన్న వ్యాపారాలకు రూ.20 లక్షల వరకు రుణ సదుపాయం.
రుణాలకు పూచీకత్తు అవసరం లేని సదుపాయం కొనసాగింపు.
బ్యాంకులకు ఇచ్చే గ్యారంటీ ఫీజును 1 శాతం నుంచి 0.75 శాతానికి తగ్గింపు.

ముద్రా రుణాల విభాగాలు:

శిశు : రూ.50,000 వరకు.
కిశోర్ (: రూ.50,000 నుంచి రూ.5 లక్షల వరకు.
తరుణ్ (: రూ.5 లక్షల నుంచి రూ.10 లక్షల వరకు.
తరుణ్ ప్లస్ : రూ.10 లక్షల నుంచి రూ.20 లక్షల వరకు. గతంలో తరుణ్ కేటగిరీలో రుణం తీసుకుని విజయవంతంగా తిరిగి చెల్లించిన వారికి మాత్రమే అర్హత. ముఖ్య గమనిక: రూ.5,000 కోట్లు నేరుగా లబ్ధిదారుల ఖాతాల్లో జమ చేసే మొత్తం కాదు. ఇది బ్యాంకులకు,

తీన్మార్ మల్లన్నపై దాడి-బీసీ జాతిపై దాడిగా భావిస్తున్నాం.

- బీసీల ఎదుగుదలను ఓర్వలేకనే హత్యా కుట్ర.
- బీసీ సంక్షేమ సంఘం వరంగల్ ఉమ్మడి జిల్లా అధ్యక్షులు,వడ్లకొండ వేణుగోపాల్

మొగుళ్ళ పల్లి ప్రతినిధి నవంబర్ 13 (పీపుల్స్ న్యూస్)

బీసీ రాజ్యాధికార యాత్రతో రాష్ట్ర వ్యాప్తంగా బీసీలను చైతన్యం చేస్తున్న ఎమ్మెల్సీ తీన్మార్ మల్లన్న కారుపై జరిగిన లారీ దాడిని బీసీ సంక్షేమ సంఘం ఉమ్మడి వరంగల్ జిల్లా అధ్యక్షుడు వడ్లకొండ వేణుగోపాల్ గౌడ్ తీవ్రంగా ఖండించారు. శుక్రవారం ఆయన విలేకరులతో మాట్లాడుతూ...తీన్మార్ మల్లన్న కారును లారీతో ఢీకొట్టిన తీరు చూస్తే అది ప్రమాదం కాదు, పక్కా ప్రణాళికతో చేసిన హత్యాయత్నం అని స్పష్టంగా తెలుస్తోందన్నారు. అదృష్టవశాత్తు ఆ సమయంలో ఆయన కారులో లేకపోవడంతో పెను ప్రమాదం తప్పిందని, కారు నుజ్జునుజ్జు అయిన ఫోటో చూస్తేనే కుట్ర ఎంత పెద్దదో అర్థమవుతుందన్నారు. కారులో ఉన్న ముగ్గురికి తీవ్ర గాయాలయ్యాయని ని ఆవేదన వ్యక్తం చేశారు.



బీసీలు ఎదుగుతుంటే ఓర్వలేకపోతున్నారు

"రాష్ట్రంలో 56 శాతం ఉన్న బీసీలు ఇప్పుడిప్పుడే రాజకీయంగా, ఆర్థికంగా ఎదుగుతున్నారని, బీసీ రాజ్యాధికారం కోసం గ్రామ గ్రామాన తిరుగుతూ మల్లన్న బీసీలను ఏకం చేస్తున్నారని, బీసీల ఈ ఎదుగుదల, ఐక్యతను చూసి ఓర్వలేని ఆధిపత్య శక్తులే ఈ దాడికి పాల్పడ్డాయన్నారు. బీసీలు ఎప్పటికీ తమ కాళ్ల దగ్గర ఉండాలని కోరుకునే భావజాలమే ఈ కుట్ర వెనుక ఉంది" అని వడ్లకొండ వేణుగోపాల్ గౌడ్ ఆరోపించారు. గతంలో బీసీల కోసం పోరాడిన బెల్లి లలిత, మారోజు వీరన్న లాంటి నేతలను కూడా ఇదే విధంగా అంతమొందించారని, ఇప్పుడు మల్లన్న విషయంలో కూడా అదే పునరావృతం చేయాలని చూస్తున్నారా అనే అనుమానం బీసీ సమాజంలో వ్యక్తమవుతోందని ఆందోళన వ్యక్తం చేశారు.

ప్రభుత్వానికి డిమాండ్:

ఈ ఘటనను పోలీసులు సాధారణ యాక్సిడెంట్ గా కాకుండా, హత్యాయత్నం కోణంలో విచారించాలని, లారీ డ్రైవర్ వెనుక ఉన్న సూత్రధారులను బయటకు తీయాలని డిమాండ్ చేశారు. తీన్మార్ మల్లన్నకు ప్రభుత్వం తక్షణమే భద్రత కల్పించాలని, లేని పక్షంలో ఉమ్మడి రాష్ట్ర వ్యాప్తంగా ఉన్న బీసీలు పెద్ద ఎత్తున ఆందోళనచేపడతా మనివడ్లకొండ వేణుగోపాల్ గౌడ్ హెచ్చరించారు.

నాగర్‌కర్నూల్ డీఎంహెచ్ఓను కలిసిన ఆర్టీఐ రాష్ట్ర కార్యదర్శి రఫీక్ అలీ

నాగర్‌కర్నూల్: జిల్లాలోని ప్రభుత్వ మరియు ప్రైవేట్ ఆసుపత్రులలో ప్రజలకు మెరుగైన వైద్య సేవలు అందించాలని కోరుతూ ఆర్టీఐ (సమాచార హక్కు చట్టం) రాష్ట్ర కార్యదర్శి కె.ఎం. రఫీక్ అలీ గారు ఈ రోజు జిల్లా వైద్య మరియు ఆరోగ్య శాఖాధికారి (ణవీనూ) డాక్టర్ కృష్ణ గారిని మర్యాదపూర్వకంగా కలిశారు.ఈ సందర్భంగా రఫీక్ అలీ గారు జిల్లాలోని వైద్య సదుపాయాలపై పలు కీలక అంశాలను డీఎంహెచ్ఓ దృష్టికి తీసుకెళ్లారు:

మెరుగైన వైద్యం: జిల్లాలోని ప్రతి ఆసుపత్రికి వచ్చే రోగులకు నాణ్యమైన, మెరుగైన చికిత్స అందేలా చర్యలు తీసుకోవాలని కోరారు. ఆర్టీఐ బోర్డుల ఏర్పాటు: సమాచార హక్కు చట్టం (=×) నిబంధనల ప్రకారం, జిల్లాలోని ప్రతి ఆసుపత్రిలో ప్రజలకు స్పష్టంగా కనిపించే విధంగా తప్పనిసరిగా ఆర్టీఐ సమాచార బోర్డులను ఏర్పాటు చేయాలని విజ్ఞప్తి చేశారు.దీనిపై డీఎంహెచ్ఓ డాక్టర్ కృష్ణ గారు సానుకూలంగా స్పందించి, ఆసుపత్రులలో మెరుగైన వైద్యం అందేలా మరియు ఆర్టీఐ బోర్డుల ఏర్పాటుపై తగిన చర్యలు తీసుకుంటామని హామీ ఇచ్చారు



గుంటూరులో డాక్టర్ బి.ఆర్. అంబేద్కర్ భవన్‌కు మరో రూ.4 కోట్ల నిధులు మంజూరు!

గుంటూరు : అర్బన్‌లోని డాక్టర్ బి.ఆర్. అంబేద్కర్ భవన్ కమ్ స్టడీ సర్కిల్ భవనంలో రెండో అంతస్తు (G+2) నిర్మాణానికి ప్రభుత్వం రూ.4 కోట్ల నిధులను మంజూరు చేస్తూ ఉత్తర్వులు జారీ చేసింది. ఈ నిధులతో ప్రత్యేకంగా లైబ్రరీ హాల్‌తో పాటు అవసరమైన అనుబంధ సౌకర్యాలను నిర్మించనున్నారు.,

అత్యాచార యత్నం, దోపిడీ కేసులో ముగ్గురికి 20 ఏళ్ల జైలు శిక్ష

- పదేళ్ల క్రితం జరిగిన నేరానికి కోర్టులో శిక్ష..
- బాధితురాలికి రూ.3 లక్షల పరిహారం
- ఎల్.బి. నగర్ సెషన్స్ కోర్టు కీలక తీర్పు..
- నిందితులకు జరిమానా కూడా విధింపు

హైదరాబాద్ కమిషనరేట్ : క్రైమ్ బ్యూరో నవంబర్ 13 (పీపుల్స్ న్యూస్)

దోపిడీతో పాటు మహిళపై సామూహిక అత్యాచార యత్నానికి పాల్పడిన ముగ్గురు నిందితులకు ఎల్.బి. నగర్ సెషన్స్ కోర్టు 20 సంవత్సరాల కఠిన కారాగార శిక్ష విధించింది. పదేళ్ల క్రితం రాజేంద్రనగర్ పోలీస్ స్టేషన్ పరిధిలో చోటుచేసుకున్న ఈ ఘటనపై సుదీర్ఘ విచారణ అనంతరం నేరం రుజువు కావడంతో 13వ అదనపు జిల్లా, సెషన్స్ న్యాయమూర్తి ఎం. వాణి నవంబర్ 13న తీర్పు వెలువరించారు. అంతేకాకుండా బాధితురాలికి రూ. 3 లక్షల పరిహారం చెల్లించాలని న్యాయస్థానం ఆదేశించింది.

నిర్మానుష్య ప్రాంతంలో దాడి.. అత్యాచార యత్నం.

2016 అక్టోబర్ 29న సాయంత్రం సుమారు 7 గంటల సమయంలో బాధితురాలు తన సహోద్యోగితో కలిసి సన్‌సిటీలో కూలీ పని ముగించుకుని ఇంటికి తిరిగి వెళ్తున్నారు. ఈ క్రమంలో ఉప్పరపల్లిలోని పరమారెడ్డి హిల్స్ వెనుక ఉన్న నిర్మానుష్య ప్రాంతానికి చేరుకోగానే మోటార్ సైకిల్‌పై వచ్చిన ముగ్గురు వ్యక్తులు వారిని అడ్డగించారు.మొదట బాధితురాలి సహోద్యోగిపై దాడి చేసి అతని వద్ద ఉన్న రూ.1,500 నగదును దోచుకున్నారు. అనంతరం ఇద్దరు నిందితులు బాధితురాలిపై దాడి చేసి సమీపంలోని పొదల్లోకి లాక్కెళ్లి అత్యాచారానికి



యత్నించారు. బాధితురాలి కేకలు విన్న స్థానికులు వెంటనే అక్కడికి చేరుకుని ఆమెను రక్షించారు. స్థానికులను గమనించిన నిందితులు తమ మోటార్ సైకిల్‌ను అక్కడే వదిలి పరారయ్యారు.

సాంకేతిక ఆధారాలతో నిందితుల అరెస్ట్.

బాధితురాలి ఫిర్యాదు మేరకు 2016 అక్టోబర్ 30న రాజేంద్రనగర్ పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు. అప్పటి ఇన్‌స్పెక్టర్ వి. ఉమేందర్ సాంకేతిక ఆధారాలను సేకరించి, దర్యాప్తును వేగవంతం చేశారు. ఘటన జరిగిన రెండు రోజులకే, నవంబర్ 1న ముగ్గురు నిందితులను అరెస్ట్ చేసి రిమాండ్‌కు తరలించారు. అనంతరం పక్కా ఆధారాలతో న్యాయస్థానంలో ఛార్జిషీట్ దాఖలు చేశారు.

దోషులుగా తేలిన ముగ్గురు నిందితులు

ఈ కేసులో అబ్దుల్ జాహెద్ (30), మహమ్మద్ జహూర్ (24), మహమ్మద్ నయీమ్ (28)లను న్యాయస్థానం దోషులుగా నిర్ధారించింది.
కోర్టు విధించిన శిక్షలు ఇవే..
- ఐపీసీ సెక్షన్ 394 కింద ముగ్గురికి 10 సంవత్సరాల జైలు శిక్ష, రూ.1,000 జరిమానా.
- ఐపీసీ సెక్షన్ 376-ణ కింద 20 సంవత్సరాల కఠిన కారాగార శిక్ష, రూ.5,000 జరిమానా.
- జరిమానా చెల్లించని పక్షంలో అదనంగా మూడు నెలల సాధారణ జైలు శిక్ష.
- బాధితురాలికి రూ.3 లక్షల పరిహారం చెల్లించాలని కోర్టు ఆదేశం.

పోలీసు, న్యాయవాదుల బృందానికి అభినందనలు.

ఈ కేసులో సమర్థవంతంగా వాదనలు వినిపించి నిందితులకు శిక్ష పడేలా కృషి చేసిన అదనపు పబ్లిక్ ప్రాసిక్యూటర్ పి. మంజులా దేవిని, అప్పటి ఇన్‌స్పెక్టర్ వి. ఉమేందర్‌ను, ప్రస్తుత రాజేంద్రనగర్ ఇన్‌స్పెక్టర్ ఆర్. వెంకటేష్‌ను ఉన్నతాధికారులు అభినందించారు.అలాగే కోర్టు డ్యూటీ ఆఫీసర్ మహమ్మద్ ఇబ్రహీం (రాజ 9747), సమన్స్ అధికారి వై. నర్సింలు (రాజ 5905), లైజన్ ఆఫీసర్ వై. సాంబయ్య (ఎజ 6528, జజూ హైదరాబాద్) సేవలను డిప్యూటీ కమిషనర్ ఆఫ్ పోలీస్, రాజేంద్రనగర్ జోన్ ప్రత్యేకంగా ప్రశంసించారు.

అనకాపల్లిలో సెయింట్ గోబెన్ ఫ్లోట్ గ్లాస్ తయారీ ప్లాంట్

సీఎం చంద్రబాబుతో సెయింట్ గోబెన్ సీఈఓ శ్రీధర్ సమావేశం



విశాఖపట్నం, నవంబరు 13: అనకాపల్లి జిల్లా అచ్యుతాపురం వద్ద ఫ్లోట్ గ్లాస్ ప్లాంట్ ఏర్పాటుకు ప్రముఖ ప్రీమియం గ్లాస్ తయారీ సంస్థ సెయింట్ గోబెన్ సిద్ధమైంది. రూ.1750 కోట్ల పెట్టుబడితో ఈ ప్లాంట్ ఏర్పాటు చేయనున్నట్టు ఆ సంస్థ సీనియర్ వైస్ ప్రెసిడెంట్, సీఈఓ ఎన్.శ్రీధర్ ముఖ్యమంత్రికి తెలిపారు. 400 మందికి ఉద్యోగాలను కూడా కల్పించనున్నట్టు వివరించారు. విశాఖ భాగస్వామ్య సదస్సులో రెండో రోజు ఆయన ముఖ్యమంత్రితో ప్రత్యేకంగా సమావేశం అయ్యారు. ప్రస్తుతం తమకు ఏపీలోని తడ, విశాఖపట్నం, కావలిలో తయారీ యూనిట్లు ఉన్నాయని సెయింట్ గోబెన్ సీఈఓ ముఖ్యమంత్రికి వివరించారు. భవిష్యత్తులో ప్లాస్టర్ బోర్డ్, జిప్సమ్ సిస్టమ్స్, ఇన్సులేషన్ రంగాల్లో పెద్ద ఎత్తున పెట్టుబడులు పెట్టేందుకు ప్రణాళికలు ఉన్నట్టు తెలిపారు. దీనిపై సీఎం చంద్రబాబు స్పందిస్తూ ఆంధ్రప్రదేశ్ లో ఉన్న వనరులను సద్వినియోగం చేసుకోవాలని.. సంస్థకు పూర్తి స్థాయిలో సహకారం అందిస్తామని అన్నారు. విశాఖపట్నంలో గ్లోబల్ కేపబిలిటీ సెంటర్ ఏర్పాటుపై ఆలోచన చేయాలని సీఎం సూచించారు. ఐఐటీ తిరుపతితో కలిసి నిర్మాణ రంగంలోని ఉత్పత్తులపై పరిశోధనలకు ఏపీని కేంద్రంగా ఎంచుకుని పనిచేయాలని సెయింట్ గోబెన్ సంస్థను ఆహ్వానించారు. ప్రస్తుతం రాజధాని అమరావతి నిర్మాణంలోనూ సెయింట్ గోబెన్ సేవలు అందించేందుకు ముందుకు రావాలని ముఖ్యమంత్రి కోరారు. రాష్ట్రంలో పెట్టుబడులకు రక్షణ కల్పించేలా చట్టం తీసుకువచ్చే అంశం పారిశ్రామిక వేత్తల్లో విశ్వాసం కల్పించిందని సెయింట్ గోబెన్ సంస్థ సీఈఓ ముఖ్యమంత్రికి తెలిపారు. రాష్ట్ర అభివృద్ధిపై విజన్ ప్రణాళికల ప్రజెంటేషన్ అద్భుతంగా ఉందని అన్నారు. తెనాలిలో ఓ స్కిల్ డెవలప్మెంట్ సెంటర్ ను సెయింట్ గోబెన్ ఏర్పాటు చేయనుందని వెల్లడించారు.

ఆటో కార్మికులకు ప్రభుత్వం గుడ్‌న్యూస్- వారికోసం ప్రత్యేకంగా ఇందిరమ్మ ఇళ్లు

హైదరాబాద్:ఇందిరమ్మ ఇళ్ల పథకాన్ని కాంగ్రెస్ ప్రభుత్వం తమ ప్రాధాన్యత అంశంగా ఇప్పటికే ప్రకటన చేసింది. ఇందులో భాగంగా అర్హులందరికీ ఇళ్లు మంజూరు చేస్తామని చెబుతోంది. ఇప్పటికే రాష్ట్రవ్యాప్తంగా అనేక ప్రాంతాల్లో ఇందిరమ్మ ఇళ్లను నిర్మించారు. ఇతర జిల్లాలతోపాటు హైదరాబాద్?లోనూ అల్పాదాయ వర్గాల వారికి అందించేందుకు వీలుగా ప్రభుత్వం ఇళ్లను నిర్మిస్తోంది. క్యూర్ పరిధిలో ఇందిరమ్మ టవర్లుగా నిర్మాణం చేపడుతోంది. లాటరీ పద్ధతిలో లబ్ధిదారులను ఎంపిక చేస్తోంది. ఇప్పటికే కొందరికి ఇళ్ల కేటాయింపులను పూర్తిచేసింది.ఆటో కార్మికులకు శుభవార్తతాజాగా తెలంగాణ ప్రభుత్వం మరో కీలక నిర్ణయం తీసుకుంది. ఇప్పటికే అనేక వర్గాలను దృష్టిలో పెట్టుకొని ఇళ్ల నిర్మాణం చేపడుతున్న రేవంత్?రెడ్డి సర్కార్?, హైదరాబాద్ కోర్ అర్బన్ పరిధిలో ఆటో కార్మికులకు ప్రత్యేకంగా ఇందిరమ్మ ఇళ్ల టవర్లు నిర్మించాలని



నిర్ణయం తీసుకుంది. నగర పరిధిలో నాలుగు చోట్ల నిర్మాణాలు చేపట్టాలని భావిస్తోంది.రూ.220 కోట్ల రూపాయలతోక్యూర్? పరిధిలో నాలుగు ప్రాంతాల్లో రూ.220 కోట్లతో ఆటోనగర్ కాలనీలు నిర్మించేందుకు ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేసింది. బండ్లగూడ, గంధంగూడ, పేట్?బషీర్ బాద్, జల్?పల్లి లక్ష్మీగూడలో హౌసింగ్ బోర్డ్ ఆధ్వర్యంలో ఆటోనగర్ కాలనీలను నిర్మాణం చేయనున్నారు. ఒక్కో ప్రాంతంలో 500 చొప్పున 2 వేల ఎల్ఐజీ (అల్పాదాయ వర్గాలు) ఫ్లాట్లను నిర్మిస్తారు.ఇప్పటికే క్యూర్ పరిధిలో ఇందిరమ్మ ఎల్?ఐజీ పేరుతో టవర్లను ప్రభుత్వం నిర్మిస్తోంది. ఆ పథకం విధివిధానాలు, అర్హతలు, కేటాయింపు విధానం ఆటోనగర్ కాలనీలకు వర్తిస్తుందని జీవోలో ప్రభుత్వం స్పష్టం చేసింది. మరోవైపు జిల్లాలోనూ ఇందిరమ్మ టవర్లను ఏర్పాటు చేయాలని ప్రభుత్వం ఇటీవల నిర్ణయం తీసుకుంది. లబ్ధిదారుల ఎంపిక ప్రక్రియను ప్రభుత్వం ఇప్పటికే ప్రారంభించిందిాంతాల్లో ఇందిరమ్మ టవర్లునిజామాబాద్, నల్గొండ, మహబూబ్‌నగర్, వరంగల్, హనుమకొండలో నిర్మించాలనే నిర్ణయం తీసుకుంది.

కేంద్రలలో ధాన్యం బస్తాలు లారీలు రాక ఇబ్బందులు



మెదక్ జిల్లా బ్యూరో ,నవంబర్ 13

రైతులు ధాన్యం పండించడం ఎంత కష్టమో తరలించడం అంత కంటే కష్టంగా మారింది. నిజాంపేట మండలం నంద గోకుల్ గ్రామంలో ఐకెపి ఆధ్వర్యంలో ధాన్యం కొనుగోలు కేంద్రం ప్రారంభించి వారం రోజులు గడుస్తుంది. కొనుగోలు సజవుగా నిర్వహిస్తున్నప్పటికీ, లారీలు కేంద్రానికి రావడం లేదని నిర్వాహకులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. కొనుగోలు ప్రారంభమైనప్పటీ నుంచి ఒక్క లారీ వచ్చిందని, ధాన్యం బస్తాలు సుమారు 1000 నుండి 1500 వరకు కొనుగోలు కేంద్రంలో ఉన్నాయని, నిర్వాహకులు, సంబంధిత అధికారులు వెంటనే స్పందించి, లారీల కొరత లేకుండా చర్యలు తీసుకోవాలని వేడుకుంటున్నారు.

నిరుపేద విద్యార్థిని ఉన్నత చదువులకు రత్నగిరి ఫౌండేషన్ భరోసా.

వార్డు కౌన్సిలర్ చొరవతో విద్యార్థినికి ఉచితంగా ల్యాప్‌టాప్ అందజేత.



రత్నగిరి: ప్రస్తుత సాంకేతిక యుగంలో ఉన్నత విద్యను అభ్యసించేందుకు అవసరమైన సాంకేతిక సదుపాయాలను నిరుపేద విద్యార్థులకు అందించాలనే లక్ష్యంతో రత్నగిరి ఫౌండేషన్ ముందడుగు వేసింది...ఉన్నత చదువులు కొనసాగించేందుకు ల్యాప్‌టాప్ అవసరమున్న నిరుపేద విద్యార్థిని పరిస్థితిని వార్డు కౌన్సిలర్ చొరవతో రత్నగిరి ఫౌండేషన్ మేనేజింగ్ ట్రస్టీ జూపల్లి అరుణ్ గారి దృష్టికి తీసుకెళ్లగా,వెంటనే స్పందించిన ఆయన విద్యార్థినికి అవసరమైన ల్యాప్‌టాప్‌ను నేడు ఫౌండేషన్ కార్యాలయంలో కన్వీనర్ కేతూరి ధర్మ తేజ 19 వార్డు కౌన్సిలర్ లహరి వేణుగోపాల్ గౌడ్ సమక్షంలో విద్యార్థిని రంగినేని స్నేహ కు అందజేశారు..ఆర్థిక ఇబ్బందులు విద్యకు అడ్డంకి కాకూడదనే సంకల్పంతో విద్యార్థుల భవిష్యత్తుకు అండగా నిలుస్తున్న రత్నగిరి ఫౌండేషన్ సేవలను పలువురు అభినందించారు,ఈ కార్యక్రమంలో వార్డు నాయకులు సీఆర్పీఎఫ్ రమేష్,రామ్మోహన్, వెంకటేష్ యాదవ్,నరేష్,నాగరాజు,తులసి గౌడ్ తదితరులు పాల్గొన్నారు..

ఇందిరమ్మ ఇళ్ల లబ్ది దారులు గృహప్రవేశంజ



మెదక్ జిల్లా బ్యూరో,నవంబర్ 13

నిజాంపేట మండల పరిధిలోని చల్మెడ గ్రామంలో గ్రామానికి చెందిన పూసల చంద్రకళ ,నర్సింలు, లకు చెందిన ఇందిరమ్మ ఇల్లు గృహప్రవేశాన్ని సర్పంచ్ బొమ్మన మల్లేశం, తాహసిల్దార్ శ్రీనివాస్ ల ఆధ్వర్యంలో చేపట్టారు ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం ఇల్లు లేని నిరుపేదలకు ఇళ్లను అందించి వారి సొంతింటి కలను నిజం చేసిన సీఎం రేవంత్ రెడ్డి స్థానిక ఎమ్మెల్యే మైనంపల్లి రోహిత్ రావు కు కృతజ్ఞతలు తెలియజేశారు. ఈ కార్యక్రమంలో ఇంచార్జ్ ఎంపీడీవో ముజాహిద్,మండల వ్యవసాయ అధికారి సోమలింగారెడ్డి, ఏపీఓ రజినీకాంత్ రెడ్డి, ఉప సర్పంచ్ మహేందర్, ఇరిగేషన్ అధికారి మహారాజ్, వడ్ల తిరుపతి, వార్డు సభ్యులు పాల్గొన్నారు.

మాదకద్రవ్యాల నిర్మూలనకై చర్యలు

మెదక్ జిల్లా బ్యూరో , నవంబర్ 13



నిజాంపేట మండల కేంద్రంలోని శ్రీ శంకర హై స్కూల్, మంజీర స్కూల్ లలో శుక్రవారం ఎస్సై రాజేష్ ఆదేశాను సారం గంజాయి మాదగద్రవ్యాల నిర్మూలనకై డాగ్ స్కాడ్ బృందంతో తనిఖీలు చేపట్టారు ఈ సందర్భంగా హెడ్ కానిస్టేబుల్ మురళీధర్ మాట్లాడుతూ యువత మత్తు పదార్థాలకు ఆకర్షితులు కాకుండా ప్రతి ఒక్కరూ గంజాయి మాదకద్రవ్యాల అనర్థాలపై అవగాహన కలిగి ఉండాలని సూచించారు. వాటి వినియోగం, అక్రమ రవాణా కు పాల్పడితే పోలీసులకు సమాచారం అందించాలన్నారు. ఈ కార్యక్రమంలో డాగ్ స్కాడ్ బృందం, కానిస్టేబుల్ రమేష్ ఉన్నారు

హైదరాబాద్ పోలీస్ కమిషనర్‌గా మహేష్ భగవత్ బాధ్యతల స్వీకారం

- శాంతిభద్రతలు, మహిళల భద్రత, సైబర్ నేరాల నియంత్రణకు పెద్దపీట
- అవినీతిపై జీరో టాలరెన్స్.. సివిల్ సెటిల్‌మెంట్లకు నో
- నేరస్తులపై ఉక్కుపాదం.. డ్రగ్స్ ముఠాలపై పీడీ యాక్ట్ ప్రయోగం
- రోడ్డు భద్రతకు ప్రాధాన్యం.. ప్రతి పోలీస్ స్టేషన్‌ను సందర్శించి సమస్యలపై అధ్యయనం







హైదరాబాద్ కమిషనరేట్ : క్రైమ్ బ్యూరో నవంబర్ 13 (పీపుల్స్ న్యూస్)

హైదరాబాద్ నగర నూతన పోలీస్ కమిషనర్‌గా డాక్టర్ మహేష్ మురళీధర్ భగవత్, ఐపీఎస్ బాధ్యతలు స్వీకరించారు. శుక్రవారం ఉదయం 11 గంటలకు బంజారాహిల్స్‌లోని తెలంగాణ ఇంటిగ్రేటెడ్ కమాండ్ అండ్ కంట్రోల్ సెంటర్ (టీజీఐసీసీసీ)లో ఆయన అధికారికంగా బాధ్యతలు చేపట్టారు. అనంతరం నిర్వహించిన విలేకరుల సమావేశంలో నగర పోలీసింగ్‌కు సంబంధించి తన ప్రాధాన్యతలు, భవిష్యత్ కార్యాచరణను వెల్లడించారు.

సేఫ్ సిటీగా హైదరాబాద్.. శాంతిభద్రతలే తొలి ప్రాధాన్యం.

హైదరాబాద్ నగర పోలీస్ కమిషనర్‌గా మళ్లీ సేవ చేసే అవకాశం కల్పించిన ముఖ్యమంత్రి, ఉప ముఖ్యమంత్రి, మంత్రివర్గ సభ్యులు, డీజీపీ, సీనియర్ అధికారులకు మహేష్ భగవత్ కృతజ్ఞతలు తెలిపారు. హైదరాబాద్‌లో గతంలో వివిధ హోదాల్లో పనిచేసిన అనుభవం తనకు ఉందని, ఇది నగరంలో మూడోసారి సేవ చేసే అవకాశమని పేర్కొన్నారు. నగర పరిధి విస్తరించడం, కొత్త జోన్లు చేరడం, సిబ్బంది కొరత వంటి సవాళ్లను అధిగమించేందుకు చర్యలు తీసుకుంటామన్నారు. శాంతిభద్రతల పరిరక్షణ, మహిళల భద్రత, సైబర్ నేరాల నియంత్రణ తమ ప్రధాన ప్రాధాన్యతలని స్పష్టం చేశారు. అనుభవజ్ఞులైన అధికారుల బృందంతో సమన్వయంగా పనిచేసి హైదరాబాద్‌ను సురక్షిత నగరంగా తీర్చిదిద్దుతామని తెలిపారు. నగరంలో శాంతిభద్రతలు పటిష్టంగా ఉంటేనే పెట్టుబడులు పెరుగుతాయని, ప్రతి పౌరుడికి భద్రతాభావం కల్పించడమే పోలీస్ శాఖ లక్ష్యమన్నారు.

నేరగాళ్లపై ప్రత్యేక నిఘా.. జైల్ రిలీజ్ వాచ్.

ఆర్గనైజ్డ్ క్రైమ్ గ్యాంగులు, గ్రూపు తగాదాలు, ప్రతీకార దాడులను అరికట్టేందుకు ప్రత్యేక కార్యాచరణ చేపడతామని వెల్లడించారు. జైళ్ల నుంచి విడుదలయ్యే నేరస్తుల వివరాలను టీ-స్పార్క్, సీసీటీఎన్ఎస్ వ్యవస్థలతో అనుసంధానించి 'జైల్ రిలీజ్ వాచ్' ద్వారా నిరంతర నిఘా ఉంచుతామన్నారు. అవసరమైన వారిపై బైండోవర్ చర్యలు, ఆర్థిక పూచీకత్తు, రౌడీషీట్ల నమోదు వంటి చర్యలు తీసుకుంటామని తెలిపారు.తీవ్రమైన నేరాల్లో నిందితులను తక్షణమే అరెస్టు చేస్తామని, తొలిసారి నేరాలకు పాల్పడినవారు తిరిగి నేరాల బాట పట్టకుండా చర్యలు తీసుకుంటామన్నారు. తరచూ నేరాలకు పాల్పడే వారితో పాటు వాణిజ్య పరిమాణంలో డ్రగ్స్ కేసుల్లో పట్టుబడిన నిందితులపై పీడీ యాక్ట్ ప్రయోగిస్తామని స్పష్టం చేశారు.

డ్రగ్స్ కేసుల్లో కఠిన చర్యలు.. ప్రత్యేక ట్రయల్ మానిటరింగ్.

డ్రగ్స్ నియంత్రణకు ఈగల్ విభాగం ద్వారా దర్యాప్తు నాణ్యతను పెంచుతామని తెలిపారు. న్యాయాధికారుల సమన్వయంతో డ్రగ్స్ కేసులను ఫాస్ట్‌ట్రాక్ కోర్టులకు బదిలీ చేయించేందుకు కృషి చేస్తామని, పెండింగ్ కేసుల్లో నిందితులకు శిక్షలు పడేలా ప్రత్యేకంగా ట్రయల్ మానిటరింగ్ చేపడతామన్నారు. ఆర్గనైజ్డ్ క్రైమ్ నియంత్రణకు భారతీయ న్యాయ సంహితలోని నూతన నిబంధనలను సమర్థవంతంగా వినియోగిస్తామని పేర్కొన్నారు.

పోలీసులు రోడ్లపై ఉండాలి.. పెట్రోలింగ్ పటిష్టం చేయాలి.

ముందుగా డీసీపీలు, ఏసీపీలతో సమావేశమై నగరంలోని ప్రతి పోలీస్ స్టేషన్‌ను సందర్శించి స్థానిక సమస్యలను తెలుసుకుంటానని కమిషనర్ తెలిపారు. బేసిక్ పోలీసింగ్‌ను బలోపేతం చేయడంపై ప్రత్యేక దృష్టి సారిస్తామన్నారు. సాయంత్రం వేళల్లో నేరాలు ఎక్కువగా జరిగే అవకాశమున్నందున పోలీసులు స్టేషన్లకే పరిమితం కాకుండా రోడ్లపైకి వచ్చి పెట్రోలింగ్ నిర్వహించాలని ఆదేశిస్తామన్నారు. రాత్రి పెట్రోలింగ్‌ను కచ్చితంగా అమలు చేసి, మరుసటి రోజు దాని పనితీరుపై సమీక్ష నిర్వహిస్తామని చెప్పారు.ప్రకృతి వైపరీత్యాలు, అత్యవసర పరిస్థితుల్లో ట్రాఫిక్ పోలీసులతో పాటు లా అండ్ ఆర్డర్ సిబ్బంది కూడా ప్రజలకు సహాయపడాలని సూచించారు.

అవినీతిపై జీరో టాలరెన్స్.. అక్రమ వసూళ్లకు పాల్పడితే క్రిమినల్ కేసులు.

పోలీస్ శాఖలో అవినీతిని ఏమాత్రం సహించబోమని మహేష్ భగవత్ స్పష్టం చేశారు. సివిల్ వివాదాల్లో పోలీసులు జోక్యం చేసుకుని సెటిల్‌మెంట్లు చేయడాన్ని అనుమతించబోమని తేల్చిచెప్పారు. పోలీసులు అక్రమ వసూళ్లకు పాల్పడితే శాఖాపరమైన చర్యలతో పాటు క్రిమినల్ కేసులు కూడా నమోదు చేస్తామని హెచ్చరించారు.భూముల విలువ పెరగడంతో భూ వివాదాలు, వాటి నేపథ్యంలో దాడులు పెరుగుతున్నాయని పేర్కొన్నారు. సివిల్ వివాదాలకు క్రిమినల్ రంగు పులిమి ఫిర్యాదులు చేసే అంశాల్లో చట్టపరమైన సలహాలు తీసుకుంటూ పారదర్శకంగా వ్యవహరిస్తామని తెలిపారు. నకిలీ భూ పత్రాలు, మరణ ధృవీకరణ పత్రాల సృష్టి, కిరాయి హత్యలు, అంతర్రాష్ట్ర నేర ముఠాలు, ఏటీఎం దొంగతనాలు, ఇంటి పనివారి ద్వారా జరిగే నేరాలపై కఠిన చర్యలు తీసుకుంటామని వెల్లడించారు.

రోడ్డు ప్రమాదాల నివారణకు ప్రత్యేక చర్యలు.

రోడ్డు భద్రతకు అత్యధిక ప్రాధాన్యత ఇస్తామని కమిషనర్ తెలిపారు. దేశంలో ఏటా సుమారు 1.80 లక్షల మంది, తెలంగాణలో దాదాపు 8 వేల మంది రోడ్డు ప్రమాదాల్లో ప్రాణాలు కోల్పోతున్నారని పేర్కొన్నారు. ప్రమాదం జరిగిన వెంటనే గోల్డెన్ అవర్‌లో స్పందించి బాధితుల ప్రాణాలను కాపాడటమే ప్రధాన లక్ష్యమన్నారు.నగర ట్రాఫిక్ సమస్యల పరిష్కారానికి జాయింట్ సీపీ (ట్రాఫిక్) ఆధ్వర్యంలోని విభాగాలతో పాటు నూతనంగా ఏర్పాటైన టీ-మార్స్ (ు-హీూ=ూ) విభాగం కీలక పాత్ర పోషిస్తుందని తెలిపారు. పెండింగ్ ఈ-చలాన్లు ఉన్న వాహనదారులకు కౌన్సెలింగ్ ఇవ్వడంతో పాటు ట్రాఫిక్ నిబంధనలను కఠినంగా అమలు చేసి జరిమానాలు వసూలు చేస్తామని చెప్పారు.

ప్రజలకు అందుబాటులో పోలీసింగ్.. 112 కాల్స్‌కు తక్షణ స్పందన.

చట్టాన్ని గౌరవించే పౌరులకు స్నేహపూర్వక పోలీసింగ్ అందిస్తామని, గత కమిషనర్లు సి.వి. ఆనంద్, వి.సి. సజ్జనార్ ప్రారంభించిన ప్రజాహిత, సంక్షేమ కార్యక్రమాలను కొనసాగిస్తామని తెలిపారు. హైదరాబాద్ సిటీ సెక్యూరిటీ కౌన్సిల్ వంటి వేదికల ద్వారా కమ్యూనిటీ పోలీసింగ్‌ను మరింత బలోపేతం చేస్తామన్నారు.డయల్ 112, డయల్ 100కు వచ్చే ఫిర్యాదులపై పెట్రోల్ మొబైల్ వాహనాలు తక్షణమే స్పందించేలా చర్యలు తీసుకుంటామని, పోలీస్ స్టేషన్లలో ఫిర్యాదులపై వెంటనే కేసులు నమోదు చేయడానికి ప్రాధాన్యత ఇస్తామని స్పష్టం చేశారు.ఈ కార్యక్రమంలో అడిషనల్ సీపీలు ఎం. శ్రీనివాసులు, తఫ్సీర్ ఇక్బాల్, జాయింట్ సీపీలు డి. జోయల్ డేవిస్, ఎస్.ఎం. విజయ్ కుమార్‌తో పాటు పలువురు సీనియర్ పోలీస్ అధికారులు పాల్గొన్నారు.బాధ్యతలు స్వీకరించిన అనంతరం అన్ని జోన్ల డీసీపీలు, లా అండ్ ఆర్డర్, ట్రాఫిక్, టాస్క్‌ఫోర్స్, ఇతర ప్రత్యేక విభాగాల అధికారులతో సమావేశమైన కమిషనర్ నగరంలోని ప్రస్తుత సమస్యలను సమీక్షించి, భవిష్యత్ కార్యాచరణపై దిశానిర్దేశం చేశారు.

పాఠశాల భూమి పరిరక్షణకు జేఏసీ సమరశంఖం!

- ప్రగతినగర్‌లో భారీ ర్యాలీ.. 1.06 ఎకరాల స్థలాన్ని కాపాడాలని డిమాండ్
- పాఠశాల భూమిని ప్రభుత్వం అధికారికంగా నోటిఫై చేయాలి.. ఆక్రమణ ఆరోపణలపై సమగ్ర విచారణ జరపాలి



కుత్బుల్లాపూర్, నవంబర్ 13 (పీపుల్స్ న్యూస్)

ప్రభుత్వ పాఠశాల భూమి పరిరక్షణ కోసం విద్యార్థులు, తల్లిదండ్రులు, స్థానిక ప్రజలు ఒక్కటయ్యారు. ప్రగతినగర్ జెడ్పీ ప్రభుత్వ ఉన్నత పాఠశాలకు చెందిన 1.06 ఎకరాల స్థలాన్ని కాపాడాలనే డిమాండ్‌తో జడ్.పి.హెచ్.ఎస్ -- ప్రగతి నగర్ జేఏసీ ఆధ్వర్యంలో శుక్రవారం భారీ ర్యాలీ నిర్వహించారు. పాఠశాల భూమిని ప్రభుత్వం అధికారికంగా నోటిఫై చేసి, భవిష్యత్తులో ఎలాంటి ఆక్రమణలకు తావులేకుండా చర్యలు తీసుకోవాలని నాయకులు డిమాండ్ చేశారు.శుక్రవారం మధ్యాహ్నం 3 గంటలకు ప్రభుత్వ పాఠశాల నుంచి ప్రారంభమైన ర్యాలీ ఆల్విన్ చౌరస్తా మీదుగా వాసవి లేఅవుట్ వరకు కొనసాగింది. ఈ ర్యాలీలో విద్యార్థులు, వారి తల్లిదండ్రులు, జేఏసీ నాయకులు, స్థానిక ప్రజలు పెద్ద సంఖ్యలో పాల్గొని పాఠశాల భూమి పరిరక్షణకు మద్దతుగా నినాదాలు చేశారు.

1.06 ఎకరాల భూమికి రక్షణ ఏదీ?

ప్రభుత్వ పాఠశాలకు చెందిన 1.06 ఎకరాల స్థలాన్ని పూర్తిస్థాయిలో పరిరక్షించాలని, భూమిని ప్రభుత్వం అధికారికంగా నోటిఫై చేయాలని జేఏసీ నాయకులు డిమాండ్ చేశారు. పాఠశాల అభివృద్ధికి అవసరమైన నిధులు కేటాయించడంతో పాటు విద్యార్థులకు మెరుగైన మౌలిక సదుపాయాలు కల్పించాలని కోరారు. పాఠశాల స్థలంపై వస్తున్న ఆక్రమణ ఆరోపణలపై సమగ్ర విచారణ జరిపించి, ప్రభుత్వ భూమికి స్పష్టమైన రక్షణ కల్పించాలని అధికారులను కోరారు.

పాఠశాల భూమి రక్షణకు బాధ్యత తీసుకుంటాం: భూపతిరెడ్డి

ఈ ర్యాలీకి సంఘీభావం తెలిపిన కాంగ్రెస్ పార్టీ మాజీ జనరల్ సెక్రటరీ భూపతిరెడ్డి మాట్లాడుతూ పాఠశాల స్థలాన్ని కాపాడేందుకు తాము బాధ్యత తీసుకుంటామని హామీ ఇచ్చారు. ప్రభుత్వ పాఠశాల భూమి పరిరక్షణలో ప్రజలు, విద్యార్థులు, తల్లిదండ్రుల పోరాటానికి మద్దతుగా ఉంటామని తెలిపారు.

డీఈఓ తీరుపై విద్యార్థులు, తల్లిదండ్రుల అసంతృప్తి.

కార్యక్రమం చివరలో డీఈఓ వ్యవహరించిన తీరుపై విద్యార్థులు, తల్లిదండ్రులు, జేఏసీ నాయకులు తీవ్ర అసంతృప్తి, మనస్తాపం వ్యక్తం చేశారు. పాఠశాల స్థలాన్ని పరిరక్షించాల్సిన విద్యాశాఖ అధికారులు ఈ అంశంపై తగిన శ్రద్ధ చూపకపోవడం విచారకరమని జేఏసీ నాయకులు పేర్కొన్నారు.

భూమికి అధికారిక రక్షణ కల్పించే వరకు పోరాటం ఆగదు!

ప్రభుత్వ పాఠశాల స్థలాన్ని అధికారికంగా నోటిఫై చేసి, పూర్తి స్థాయిలో పరిరక్షించే వరకు తమ పోరాటాన్ని కొనసాగిస్తామని జేఏసీ నాయకులు స్పష్టం చేశారు. విద్యార్థుల భవిష్యత్తుకు సంబంధించిన పాఠశాల భూమి విషయంలో ప్రభుత్వం, విద్యాశాఖ అధికారులు తక్షణమే స్పందించి తగిన చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు.ఈ కార్యక్రమంలో జడ్.పి.హెచ్.ఎస్ ప్రగతి నగర్ జేఏసీ నాయకులు, విద్యార్థులు, తల్లిదండ్రులు, స్థానిక ప్రజలు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

సంపాదకీయం



ప్రజలకు ముప్పుగా మారనున్న

సియాంగ్ ప్రాజెక్టు!

- అభివృద్ధి పేరుతో ఆదివాసీల నిర్వాసితం.. పర్యావరణానికి పెను ప్రమాదం

అభివృద్ధి అనేది ప్రజల జీవన ప్రమాణాలను మెరుగుపరచాలి. వారి ఆర్థిక, సామాజిక స్థితిగతులను బలోపేతం చేయాలి. కానీ అభివృద్ధి పేరుతో తరతరాలుగా ఒక ప్రాంతంలో నివసిస్తున్న ప్రజలను వారి నివాసాల నుంచి బలవంతంగా తరలించడం, ప్రకృతి వనరులను ధ్వంసం చేయడం, పర్యావరణ సమతుల్యతను దెబ్బతీయడం ఎంతవరకు సమంజసం? ప్రస్తుతం అరుణాచల్‌ప్రదేశ్‌లో నిర్మించ తలపెట్టిన సియాంగ్ అప్పర్ మల్టీపర్పస్ ప్రాజెక్టు చుట్టూ నెలకొన్న వివాదం ఇలాంటి అనేక ప్రశ్నలను లేవనెత్తుతోంది. దేశంలోనే అతిపెద్ద బహుళార్థ సాధక జలవిద్యుత్ ప్రాజెక్టుగా ప్రతిపాదించిన ఈ నిర్మాణం వల్ల వేలాది మంది ఆదివాసీల జీవనాధారాలు దెబ్బతినడంతో పాటు పర్యావరణానికి తీవ్ర ముప్పు వాటిల్లే ప్రమాదం ఉందనే ఆందోళనలు వ్యక్తమవుతున్నాయి.అరుణాచల్‌ప్రదేశ్‌లోని సియాంగ్ నదిపై నిర్మించ తలపెట్టిన ఈ భారీ ప్రాజెక్టుకు వ్యతిరేకంగా స్థానిక ఆదివాసీ ప్రజలు అనేక సంవత్సరాలుగా ఉద్యమిస్తున్నారు. ఆది, గాలో, నియిషి, ఇడు, మిష్మి తదితర తెగలకు చెందిన ప్రజలు ఈ ప్రాంతంలో ఎక్కువగా నివసిస్తున్నారు. సియాంగ్ ఇండిజినియస్ ఫార్మర్స్ ఫోరం, ఆది బానీ కేబాంగ్ యునైటెడ్, ఆది గాలో వెల్ఫేర్ సొసైటీ, విద్యార్థి సంఘాలు, స్థానిక ప్రజా సంఘాలు ఈ ప్రాజెక్టును తీవ్రంగా వ్యతిరేకిస్తున్నాయి. ప్రాజెక్టు నిర్మాణం వల్ల సుమారు 1.25 లక్షల నుంచి 1.50 లక్షల మంది ఆదివాసీలు నిర్వాసితులయ్యే ప్రమాదం ఉందని అంచనాలు చెబుతున్నాయి. 27 గ్రామాలు నేరుగా ముంపునకు గురికాగా, మరో 56 గ్రామాలపై ప్రభావం పడే అవకాశం ఉంది. అప్పర్ సియాంగ్ జిల్లా కేంద్రం యింగ్‌కియాంగ్ కూడా ముంపు ప్రమాదాన్ని ఎదుర్కొంటుందని స్థానికులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు.ఒక ప్రాంతం అంటే కేవలం భూమి, ఇళ్లు, చెట్లు మాత్రమే కాదు. అక్కడి ప్రజల చరిత్ర, సంస్కృతి, సంప్రదాయాలు, ఆచారాలు, జీవన విధానం, నమ్మకాలు అన్నీ ఆ నేలతో ముడిపడి ఉంటాయి. తరతరాలుగా నివసిస్తున్న ఆదివాసీలకు అడవులు, నదులు, కొండలు కేవలం ప్రకృతి వనరులు కావు. అవే వారి జీవనాధారాలు, ఆహార భద్రతకు ఆధారాలు, సాంస్కృతిక వారసత్వానికి ప్రతీకలు. వ్యవసాయ భూములు, పండ్ల తోటలు, అడవులపై ఆధారపడిన జీవన విధానం ఒక్కసారిగా మారిపోతే ఆ ప్రజలు ఎదుర్కొనే సమస్యలు అనేకం. పరిహారం పేరుతో కొంత డబ్బు అందించినంత మాత్రాన వారి తరతరాల అనుబంధాన్ని తిరిగి తీసుకురాలేం. పునరావాసం కల్పించినా పాత జీవన విధానాన్ని పునరుద్ధరించడం అంత సులభం కాదు.సియాంగ్ ప్రాజెక్టు ప్రతిపాదన 2008 ప్రాంతంలోనే తెరపైకి వచ్చింది. అప్పటి నుంచి వివిధ దశల్లో ఈ ప్రాజెక్టు నిర్మాణంపై చర్చలు కొనసాగుతున్నాయి. అనంతరం 11,200 మెగావాట్ల విద్యుత్ ఉత్పత్తి సామర్థ్యంతో దేశంలోనే అతిపెద్ద బహుళార్థ సాధక జలవిద్యుత్ ప్రాజెక్టుగా రూపుదిద్దుకుంది. అయితే 2017 నుంచి స్థానిక ప్రజలు పెద్ద ఎత్తున నిరసనలు ప్రారంభించారు. ప్రాజెక్టుకు సంబంధించిన సర్వేలను కూడా అడ్డుకున్నారు. ప్రజల ఆందోళనల నేపథ్యంలో కొంతకాలం నిర్మాణ ప్రక్రియ నిలిచిపోయినప్పటికీ, ప్రభుత్వం ప్రాజెక్టును పూర్తిగా విరమించుకోలేదు.ఈ ప్రాజెక్టు విషయంలో చైనా అంశాన్ని కూడా కేంద్ర ప్రభుత్వం ప్రస్తావిస్తోంది. టిబెట్ ప్రాంతంలో యార్లుంగ్ సాంగ్‌పోగా పిలిచే నది భారతదేశంలోకి ప్రవేశించిన తర్వాత సియాంగ్‌గా మారుతుంది. 2020లో చైనా ప్రభుత్వం ఈ నదిపై మెడోగ్ ప్రాంతంలో సుమారు 60 వేల మెగావాట్ల భారీ జలవిద్యుత్ ప్రాజెక్టును నిర్మించాలనే ప్రతిపాదన తీసుకురావడంతో భారతదేశంలోనూ ఆందోళనలు మొదలయ్యాయి. చైనా నిర్మించే ప్రాజెక్టు వల్ల భవిష్యత్తులో నీటి ప్రవాహంపై ప్రభావం పడవచ్చని, వరదల ప్రమాదం ఏర్పడవచ్చని భద్రతాపరమైన అంశాలు తెరపైకి వచ్చాయి. ఈ నేపథ్యంలో సియాంగ్‌పై భారీ ప్రాజెక్టు నిర్మాణాన్ని కేంద్రం మరోసారి వేగవంతం చేయాలని భావిస్తోంది. అయితే జాతీయ భద్రత పేరుతో స్థానిక ప్రజల హక్కులు, పర్యావరణ పరిరక్షణ అంశాలను విస్మరించడం సరికాదు.2022 ఏప్రిల్‌లో కేంద్ర ప్రభుత్వం నేషనల్ హైడ్రో ఎలక్ట్రిక్ పవర్ కార్పొరేషన్ ద్వారా ప్రాజెక్టుకు సంబంధించిన సాంకేతిక, ఆర్థిక, సామాజిక సాధ్యాసాధ్యాలను పరిశీలించేందుకు సర్వే చేపట్టింది. ఈ సర్వే ప్రక్రియలో పారదర్శకత లేదని స్థానిక ప్రజలు ఆరోపిస్తున్నారు. సర్వే ప్రాంతాల్లో కేంద్ర సాయుధ బలగాలను పెద్ద సంఖ్యలో మోహరించడం, ప్రజలపై ఒత్తిడి తెచ్చి అవగాహన ఒప్పందాలు చేసుకోవడం వంటి పరిణామాలు అనుమానాలకు తావిచ్చాయి. అభివృద్ధి ప్రాజెక్టుల విషయంలో స్థానిక ప్రజల అభిప్రాయాలను తెలుసుకోవడం, వారి అంగీకారాన్ని పొందడం ప్రజాస్వామ్య ప్రభుత్వాల బాధ్యత. కానీ ప్రజల నిరసనలను పట్టించుకోకుండా, బలగాలను మోహరించి సర్వేలు నిర్వహించడం ప్రజల్లో ప్రభుత్వంపై మరింత వ్యతిరేకతను పెంచుతుంది.ఇటీవల ఈ వ్యతిరేకత తీవ్రరూపం దాల్చింది. అక్టోబర్ 23న ప్రాజెక్టు వ్యతిరేక సంఘాలు అరుణాచల్‌ప్రదేశ్‌లో 12 గంటల బంద్‌కు పిలుపునిచ్చాయి. ఈస్ట్ సియాంగ్ జిల్లాలోని పాసీఘాట్‌లో ఆందోళనలు హింసాత్మకంగా మారాయి. ఎన్‌హెచ్‌పీసీ కార్యాలయం, పోలీస్ స్టేషన్, ప్రజాప్రతినిధుల నివాసాలపై దాడులు, నిప్పంటించిన ఘటనలు చోటుచేసుకున్నట్లు పోలీసులు తెలిపారు. అయితే ప్రశాంతంగా నిరసనలు నిర్వహిస్తున్న తమ ఉద్యమంలోకి గుర్తుతెలియని వ్యక్తులు చొరబడి విధ్వంసానికి పాల్పడ్డారని, ఆ ఘటనలను సాకుగా చూపి తమ ఉద్యమాన్ని అణచివేస్తున్నారని నిరసనకారులు ఆరోపిస్తున్నారు. ఈ పరిణామాలపై సమగ్ర విచారణ జరిపి వాస్తవాలను వెలుగులోకి తేవాలి. ప్రజల నిరసనలకు హింసను జోడించడం సమస్యను మరింత జటిలం చేస్తుంది.అక్టోబర్ 31న ఢిల్లీలోని అరుణాచల్ భవన్ ఎదుట యూత్ ఫర్ చేంజ్ తదితర సంస్థలు నిర్వహించిన నిరసనల సందర్భంగా పోలీసులు బలప్రయోగానికి దిగారని, మహిళలపై దాడులు జరిగాయని ఆరోపణలు వచ్చాయి. నవంబర్ 2న 36 గంటల బంద్ కూడా నిర్వహించారు. మరోవైపు ఉద్యమకారులపై చట్టవ్యతిరేక కార్యకలాపాల నిరోధక చట్టం (ఉపా) కింద కేసులు నమోదు చేయడం, అరెస్టులు చేయడం వంటి చర్యలు స్థానిక ప్రజల్లో ఆగ్రహాన్ని పెంచుతున్నాయి. నిరసనకారులపై కేసులు పెట్టడం, వారిని నిర్బంధించడం ద్వారా సమస్యకు పరిష్కారం లభించదు. ప్రజల అభ్యంతరాలను వినడం, వారి సమస్యలకు సమాధానాలు ఇవ్వడం ద్వారానే విశ్వాసాన్ని తిరిగి పొందగలుగుతారు.అత్యంత ఆందోళన కలిగించే అంశం ఈ ప్రాంత పర్యావరణ పరిస్థితులు. సియాంగ్ నదీ పరివాహక ప్రాంతం తూర్పు హిమాలయాల్లోని అత్యంత సున్నితమైన జీవవైవిధ్య ప్రాంతాల్లో ఒకటి. విస్తారమైన అడవులు, అరుదైన వృక్షజాలం, జంతుజాలం, అనేక నదీ వ్యవస్థలు ఈ ప్రాంతంలో ఉన్నాయి. ఈ ప్రాంతం భూకంపాలకు కూడా అత్యంత సున్నితమైనది. హిమాలయాల్లో మంచు కరగడం, కొండచరియలు విరిగిపడటం, ఆకస్మిక వరదలు సంభవించడం వంటి ప్రకృతి వైపరీత్యాల ముప్పు కూడా ఉంది. ఇలాంటి ప్రాంతంలో భారీ జలాశయాన్ని నిర్మించడం వల్ల భవిష్యత్తులో ఎలాంటి పరిణామాలు ఎదురవుతాయో శాస్త్రీయంగా అంచనా వేయాలి. కేవలం విద్యుత్ ఉత్పత్తి సామర్థ్యం, ప్రాజెక్టు ద్వారా వచ్చే ఆదాయం ఆధారంగా నిర్ణయాలు తీసుకోవడం ప్రమాదకరం.

ఎరువుల సబ్సిడీ సద్వినియోగం కావాలి!

- అక్రమ మళ్లింపునకు అడ్డుకట్ట వేయాలి.. నిజమైన రైతులకే ప్రభుత్వ ప్రయోజనాలు అందాలి

దేశ ఆర్థిక వ్యవస్థకు వ్యవసాయ రంగం వెన్నెముక వంటిది. కోట్లాది మంది రైతులు, వ్యవసాయ కూలీల జీవనాధారం వ్యవసాయంపైనే ఆధారపడి ఉంది. అలాంటి కీలక రంగాన్ని ఆదుకోవాల్సిన బాధ్యత కేంద్ర ప్రభుత్వంపై ఉంది. రైతులకు పెట్టుబడి భారం తగ్గించడం, సాగు ఖర్చులను నియంత్రించడం, పంట దిగుబడులను పెంచేందుకు అవసరమైన సహకారం అందించడం ప్రభుత్వాల ప్రధాన బాధ్యతలు. ఈ క్రమంలో ఎరువులపై కేంద్ర ప్రభుత్వం అందిస్తున్న సబ్సిడీ ఎంతో కీలకమైనది. అయితే ప్రజాధనంతో అందిస్తున్న ఈ సబ్సిడీ నిజమైన రైతులకు చేరకుండా మధ్యలోనే పక్కదారి పడితే ఆశించిన ప్రయోజనం నెరవేరదు. అందుకే ఎరువుల సబ్సిడీ పెంపుతో పాటు దాని పంపిణీ, వినియోగంపై కూడా ప్రభుత్వం ప్రత్యేక దృష్టి సారించాలి.2011 నాటి జనాభా లెక్కల ప్రకారం దేశంలో దాదాపు 11.38 కోట్ల మంది రైతులు, 14.48 కోట్ల మంది వ్యవసాయ కూలీలు ఉన్నారు. ఇంత పెద్ద జనాభా వ్యవసాయ రంగంపై ఆధారపడి జీవిస్తున్న నేపథ్యంలో రైతుల సంక్షేమం దేశానికి అత్యంత ప్రాధాన్య అంశం కావాలి. గతంలో కేంద్ర ప్రభుత్వం తీసుకొచ్చిన వ్యవసాయ చట్టాలపై దేశవ్యాప్తంగా రైతులు పెద్ద ఎత్తున ఉద్యమించిన విషయం తెలిసిందే. వ్యవసాయ రంగంలో సబ్సిడీల కోత వంటి కఠిన నిర్ణయాలు తీసుకోవడం కంటే రైతులకు మరింత సహకారం అందించాల్సిన అవసరం ఉందనే విషయాన్ని ఆ ఉద్యమాలు స్పష్టం చేశాయి. మరోవైపు వ్యవసాయ రంగం కీలక ఓటు బ్యాంకుగా ఉండటంతో ఎన్నికల ముందు రైతులపై ఎరువుల ధరల భారం పడకుండా చూడాలనే రాజకీయ ఒత్తిళ్లు కూడా ప్రభుత్వ నిర్ణయాలపై ప్రభావం చూపుతున్నాయని విశ్లేషణలు వినిపిస్తున్నాయి. అయితే సబ్సిడీ పెంపు వెనుక రాజకీయ కారణాలున్నాయా, ఆర్థిక అవసరాలున్నాయా అన్నది పక్కనపెడితే రైతులకు ప్రయోజనం కలగడం ముఖ్యం.ప్రస్తుతం అంతర్జాతీయ మార్కెట్‌లో ఎరువుల ధరలు తీవ్ర ఒడిదుడుకులకు గురవుతున్నాయి. రష్యా–ఉక్రెయిన్ యుద్ధం, పశ్చిమాసియా సంక్షోభం వంటి పరిణామాలు ఎరువుల సరఫరా, ధరలపై ప్రభావం చూపుతున్నాయి. దిగుమతులపై ఆధారపడే పరిస్థితుల్లో అంతర్జాతీయ ధరలు పెరిగితే దేశీయంగా రైతులపై కూడా ఆ భారం పడే ప్రమాదం ఉంది. దీనిని నివారించేందుకు కేంద్ర ప్రభుత్వం సబ్సిడీ కేటాయింపులను పెంచుతున్నట్లు చెబుతోంది. డీఏపీ 50 కిలోల బస్తా ధరను రూ.1,350 వద్ద స్థిరంగా ఉంచేందుకు ప్రయత్నించడం కూడా రైతులకు కొంత ఊరటనిచ్చే నిర్ణయం.2026–27 రబీ సీజన్‌కు ఎరువుల సబ్సిడీ కోసం కేంద్ర ప్రభుత్వం రూ.62,370 కోట్లు కేటాయించింది. గత 2025–26 రబీ సీజన్‌లో కేటాయించిన రూ.37,952.29 కోట్లతో పోలిస్తే తాజా కేటాయింపులు ఏకంగా 64 శాతం అధికం కావడం గమనార్హం. ఈ సబ్సిడీ సదుపాయం 2027 మార్చి 31 వరకు కొనసాగనుంది. తాజా పెంపుతో దేశంలో మొత్తం ఎరువుల సబ్సిడీ వ్యయం రూ.3 లక్షల కోట్లు దాటే అవకాశం ఉందని అంచనాలు వెలువడుతున్నాయి. ఇంత భారీ మొత్తంలో ప్రజాధనం ఖర్చు చేస్తున్నప్పుడు దాని ఫలితం రైతుల జీవితాల్లో కనిపించాలి. సబ్సిడీ పెరిగిందనే గణాంకాలకే పరిమితం కాకుండా రైతుల సాగు ఖర్చులు ఎంత



తగ్గాయి? ఎరువుల కొరత ఎంతవరకు నివారించగలిగారు? రైతులకు సరైన సమయంలో అవసరమైన ఎరువులు అందుతున్నాయా? అనే అంశాలపై ప్రభుత్వం సమీక్షించాలి.ఇక్కడ ప్రధానంగా ప్రస్తావించాల్సిన సమస్య ఎరువుల అక్రమ మళ్లింపు. రైతులకు తక్కువ ధరకు అందించాల్సిన యూరియా, ఇతర ఎరువులను కొందరు అక్రమార్కులు పారిశ్రామిక అవసరాలకు తరలించడం, సరిహద్దులు దాటి విక్రయించడం వంటి పరిణామాలు చాలాకాలంగా ఆందోళన కలిగిస్తున్నాయి. దేశంలో రైతులకు 45 కిలోల యూరియా బస్తా సుమారు రూ.265కే అందుబాటులో ఉండగా, అంతర్జాతీయ మార్కెట్ ధరలు, రవాణా ఖర్చులు కలిపి దిగుమతి చేసుకునే యూరియా ధర సుమారు రూ.1,674గా ఉంది. అంటే రెండు ధరల మధ్య దాదాపు రూ.1,409 వ్యత్యాసం ఉంది. ఇంత భారీ ధరల తేడా ఉండటంతో సబ్సిడీ ఎరువులను అక్రమంగా కొనుగోలు చేసి ఇతర అవసరాలకు మళ్లించే అవకాశం ఏర్పడుతోంది. ఫలితంగా ప్రభుత్వ ఖజానాపై అదనపు భారం పడటమే కాకుండా, నిజమైన రైతులకు ఎరువుల కొరత ఏర్పడుతోంది.ఈ అక్రమాలకు అడ్డుకట్ట వేసేందుకు కేంద్ర ప్రభుత్వం ఎరువుల అమ్మకాల వ్యవస్థలో డిజిటల్ ధ్రువీకరణ విధానాన్ని ప్రవేశపెట్టడం మంచి పరిణామం. 2026 ఖరీఫ్ సీజన్‌లో ఎంపిక చేసిన సరిహద్దు జిల్లాల్లో ఎరువుల అమ్మకాలు 37.56 శాతం తగ్గినట్లు వచ్చిన నివేదికలు ఈ విధానం ప్రభావాన్ని సూచిస్తున్నాయి. రైతుల డిజిటల్ గుర్తింపు, భూమి వివరాలు, సాగు చేస్తున్న పంటల ఆధారంగా ఎరువుల విక్రయాలను పర్యవేక్షించడం ద్వారా అక్రమ కొనుగోళ్లను నియంత్రించే అవకాశం ఉంది. గతంలో సబ్సిడీ ఎరువులు ఎంత పెద్ద మొత్తంలో దుర్వినియోగం అయ్యాయో ఈ గణాంకాలు పరోక్షంగా తెలియజేస్తున్నాయి. అయితే డిజిటల్ విధానాన్ని అమలు చేస్తున్నప్పుడు నిజమైన రైతులకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా చూడాలి.ముఖ్యంగా కౌలు రైతుల సమస్యను ప్రభుత్వం విస్మరించకూడదు. భూమి సొంతంగా లేని వేలాది మంది రైతులు ఇతరుల భూములను కౌలుకు తీసుకుని సాగు చేస్తున్నారు. పంట పెట్టుబడులు పెట్టేది, సాగు ఖర్చులు భరించేది, ప్రకృతి వైపరీత్యాల వల్ల నష్టపోయేది వారే. అలాంటప్పుడు భూమి యాజమాన్య పత్రాలు లేవనే కారణంతో వారికి ఎరువులు, విత్తనాలు, ఇతర ప్రభుత్వ సహాయాన్ని నిరాకరించడం అన్యాయం. ఎరువుల సబ్సిడీ పొందేందుకు భూమి యజమానులకే ప్రాధాన్యం ఇస్తే అసలు సాగుదారులు నష్టపోతారు. అందువల్ల భూమి ఎవరి పేరుపై ఉందన్న దానికంటే వాస్తవంగా సాగు చేస్తున్నది ఎవరు అనే అంశానికి ప్రభుత్వం ప్రాధాన్యం ఇవ్వాలి. కౌలు రైతులకు కూడా సులభమైన గుర్తింపు విధానాన్ని రూపొందించి ప్రభుత్వ ప్రయోజనాలు అందించాలి.మరో ముఖ్యమైన అంశం రసాయన ఎరువుల అధిక వినియోగం. పంట దిగుబడులు పెంచుకోవాలనే ఉద్దేశంతో రైతులు అవసరానికి మించి యూరియా, ఇతర రసాయన ఎరువులను వినియోగిస్తున్నారు. దీనివల్ల నేలలో పోషకాల సమతుల్యత దెబ్బతినడంతో పాటు భూసారం తగ్గే ప్రమాదం ఉంది. దీర్ఘకాలంలో వ్యవసాయ ఉత్పాదకతపై ప్రతికూల ప్రభావం పడుతుంది. అందువల్ల కేవలం ఎరువుల సరఫరా, సబ్సిడీ పెంపుపైనే కాకుండా నేల స్వభావం, పంట అవసరాలకు అనుగుణంగా సమతుల్య ఎరువుల వినియోగంపై రైతులకు అవగాహన కల్పించాలి. సేంద్రియ ఎరువులు, జీవ ఎరువుల వినియోగాన్ని ప్రోత్సహించాలి. వివిధ పోషకాలతో కూడిన ఎరువుల వినియోగానికి ప్రోత్సాహకాలు అందించాలి.డిజిటల్ సాంకేతికతను కేవలం ఎరువుల అమ్మకాల లెక్కలు నమోదు చేయడానికి మాత్రమే కాకుండా మొత్తం సబ్సిడీ విధానాన్ని పారదర్శకంగా మార్చేందుకు వినియోగించాలి. ఎక్కడ ఎంత ఎరువు విక్రయిస్తున్నారు? ఎంతమంది రైతులు కొనుగోలు చేస్తున్నారు? ఏ పంటకు ఎంత మేర అవసరం ఉంది? అనే వివరాలను ఎప్పటికప్పుడు విశ్లేషించాలి. అక్రమ నిల్వలు, కృత్రిమ కొరత సృష్టించడం, అధిక ధరలకు విక్రయించడం వంటి చర్యలకు పాల్పడేవారిపై కఠిన చర్యలు తీసుకోవాలి. ఎరువుల సరఫరా వ్యవస్థలో మధ్యవర్తుల జోక్యాన్ని తగ్గించి రైతులకు నేరుగా ప్రయోజనం చేకూరేలా చర్యలు చేపట్టాలి.అదేవిధంగా సబ్సిడీ వ్యయాన్ని తగ్గించడమే ప్రభుత్వ లక్ష్యంగా ఉండకూడదు. రైతుల అవసరాలను దృష్టిలో ఉంచుకొని ఎరువుల ధరల విధానాన్ని హేతుబద్ధంగా రూపొందించాలి. ప్రత్యక్ష నగదు బదిలీ విధానాన్ని అమలు చేసే విషయంలోనూ రైతులకు ఎలాంటి ఆర్థిక ఇబ్బందులు కలగకుండా జాగ్రత్తలు తీసుకోవాలి. సబ్సిడీ తగ్గింపు పేరుతో ఒక్కసారిగా ఎరువుల ధరలను పెంచితే ఇప్పటికే అప్పులు, పెట్టుబడి భారంతో ఇబ్బందులు పడుతున్న రైతుల పరిస్థితి మరింత దిగజారుతుంది. కాబట్టి ఏ విధాన మార్పు చేపట్టినా రైతుల ఆదాయం, సాగు ఖర్చులు, పంటల పరిస్థితులను పరిగణనలోకి తీసుకోవాలి.ఎరువుల సబ్సిడీపై ప్రభుత్వం ఖర్చు చేస్తున్న భారీ మొత్తంలో అక్రమ మళ్లింపులను అరికట్టడం ద్వారా ఆదా అయ్యే ప్రజాధనాన్ని వ్యవసాయ మౌలిక సదుపాయాలు, సాగునీటి వనరులు, గిడ్డంగులు, పంట నిల్వ కేంద్రాలు, రవాణా సదుపాయాల అభివృద్ధికి వినియోగించవచ్చు. తద్వారా రైతులకు తక్షణ ప్రయోజనంతో పాటు దీర్ఘకాలికంగా వ్యవసాయ రంగం బలోపేతమవుతుంది. పంటలకు గిట్టుబాటు ధరలు, నాణ్యమైన విత్తనాలు, సమయానికి ఎరువుల సరఫరా, సాగునీటి సదుపాయాలు కల్పించినప్పుడే రైతుల ఆదాయం పెరుగుతుంది.మొత్తంగా చూస్తే ఎరువుల సబ్సిడీ పెంపు రైతులకు ఊరటనిచ్చే నిర్ణయమే అయినప్పటికీ, దాని అమలులో పారదర్శకత అత్యంత కీలకం. ప్రభుత్వ ఖజానా నుంచి ఖర్చవుతున్న ప్రతి రూపాయి నిజమైన రైతుకు ఉపయోగపడాలి. అక్రమార్కుల చేతుల్లోకి సబ్సిడీ వెళ్లకుండా కఠిన పర్యవేక్షణ ఉండాలి. కౌలు రైతులకు సమాన హక్కులు కల్పించాలి. అవసరానికి మించి రసాయన ఎరువుల వినియోగాన్ని నియంత్రించాలి. రైతుల సంక్షేమం, ప్రభుత్వ ఆర్థిక క్రమశిక్షణ రెండింటినీ సమన్వయం చేసుకుంటూ ఎరువుల విధానాన్ని రూపొందించాలి. అప్పుడే ఎరువుల సబ్సిడీకి అసలైన అర్థం, సార్థకత చేకూరుతాయి.

భారత్ సమ్మిట్‌తో ప్రపంచ వేదికపై

తెలంగాణకు గుర్తింపు

- అంతర్జాతీయ సదస్సుల ద్వారా పెట్టుబడుల ఆకర్షణ.. ప్రజలకు అభివృద్ధి ఫలాలు అందాలి

ప్రపంచ దేశాల దృష్టిని తెలంగాణ వైపు ఆకర్షించేందుకు హైదరాబాద్ వేదికగా నిర్వహిస్తున్న భారత్ సమ్మిట్–2026 రాష్ట్రానికి అంతర్జాతీయ గుర్తింపు తీసుకురావడానికి కీలక అవకాశంగా నిలుస్తోంది. ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి నాయకత్వంలోని రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్ఠాత్మకంగా నిర్వహిస్తున్న ఈ సదస్సుకు సుమారు 70 దేశాల నుంచి వెయ్యి మందికి పైగా ప్రతినిధులు హాజరవుతున్నారు. నవంబర్ 13, 14 తేదీల్లో జరిగే ఈ సమావేశాల్లో ప్రపంచ రాజకీయాలు, ప్రజాస్వామ్యం, ఆర్థిక విధానాలు, యువత భవిష్యత్తు, సాంకేతిక అభివృద్ధి తదితర అంశాలపై చర్చించనున్నారు. అంతర్జాతీయ స్థాయిలో తెలంగాణ సామర్థ్యాన్ని పరిచయం చేయడానికి ఈ వేదిక దోహదపడనుంది.రాష్ట్ర విభజన అనంతరం తెలంగాణ అనేక రంగాల్లో అభివృద్ధి సాధిస్తోంది. ముఖ్యంగా హైదరాబాద్ ఐటీ, ఔషధ, వైద్య, జీవసాంకేతిక రంగాల్లో అంతర్జాతీయ గుర్తింపు పొందింది. అనేక



విదేశీ సంస్థలు హైదరాబాద్‌లో పెట్టుబడులు పెట్టేందుకు ఆసక్తి చూపుతున్నాయి. ఈ నేపథ్యంలో అంతర్జాతీయ ప్రతినిధులతో సమావేశాలు నిర్వహించడం, వివిధ దేశాలతో సంబంధాలు బలోపేతం చేసుకోవడం రాష్ట్రానికి ప్రయోజనకరంగా ఉంటుంది. పెట్టుబడులు, సాంకేతిక పరిజ్ఞానం, పరిశ్రమల విస్తరణకు కొత్త అవకాశాలు ఏర్పడవచ్చు.భారత్ సమ్మిట్‌లో ప్రజాస్వామ్య విలువలు, అహింస, సామాజిక న్యాయం, సమానత్వం, సమాఖ్య స్ఫూర్తి వంటి అంశాలకు ప్రాధాన్యత ఇవ్వడం విశేషం. ప్రపంచవ్యాప్తంగా రాజకీయ, ఆర్థిక పరిణామాలు వేగంగా మారుతున్న నేపథ్యంలో ప్రజాస్వామ్య వ్యవస్థల పరిరక్షణపై చర్చలు జరగడం అవసరం. అధికార పక్షంతో పాటు ప్రతిపక్షాలకు కూడా ప్రజాస్వామ్యంలో సమాన ప్రాధాన్యత ఉండాలి. భిన్నాభిప్రాయాలను గౌరవించడం, ప్రజల హక్కులను కాపాడటం, ఎన్నికల ప్రక్రియలో పారదర్శకత పాటించడం వంటి అంశాలు ప్రజాస్వామ్య బలోపేతానికి దోహదపడతాయి.ఈ సదస్సు ద్వారా తెలంగాణ ప్రభుత్వం అంతర్జాతీయ పెట్టుబడులను ఆకర్షించేందుకు ప్రయత్నిస్తోంది. ఐటీ, ఫార్మా, బయోటెక్నాలజీ, తయారీ, పునరుత్పాదక ఇంధన రంగాల్లో విదేశీ సంస్థలతో భాగస్వామ్యాలు పెరిగితే రాష్ట్ర ఆర్థిక వ్యవస్థకు మేలు జరుగుతుంది. కొత్త పరిశ్రమలు ఏర్పాటైతే యువతకు ఉద్యోగ అవకాశాలు లభిస్తాయి. స్థానిక విద్యార్థులకు ఆధునిక సాంకేతిక పరిజ్ఞానంపై శిక్షణ, నైపుణ్యాభివృద్ధికి అవకాశాలు పెరుగుతాయి. అయితే పెట్టుబడుల ఫలితాలు కేవలం హైదరాబాద్‌కే పరిమితం కాకుండా రాష్ట్రంలోని అన్ని జిల్లాలకు విస్తరించాలి.

అవినీతి ఇంజినీర్‌పై ఏసీబీ కొరడా!

- నీటిపారుదల శాఖ డిప్యూటీ ఎగ్జిక్యూటివ్ ఇంజినీర్‌పై ఆదాయానికి మించిన ఆస్తుల కేసు నమోదు
- రూ.7.32 కోట్లకు పైగా ఆస్తులు గుర్తింపు.. 25 ఎకరాల వ్యవసాయ భూమి, విల్లా, ఫ్లాట్లు, వాహనాలు స్వాధీనం చేసుకున్నట్లు వెల్లడి





హైదరాబాద్, క్రైమ్ బ్యూరో నవంబర్ 13 (పీపుల్స్ న్యూస్)
అవినీతి అధికారుల అక్రమ ఆస్తులపై తెలంగాణ అవినీతి నిరోధక శాఖ (ఏసీబీ) మరోసారి కొరడా ఝుళిపించింది. నాగర్‌కర్నూల్ జిల్లాలో నీటిపారుదల, ఆయకట్టు అభివృద్ధి శాఖలో డిప్యూటీ ఎగ్జిక్యూటివ్ ఇంజినీర్‌గా పనిచేస్తున్న రాగిరి సత్యనారాయణపై ఆదాయానికి మించిన ఆస్తుల కేసు నమోదు చేసింది. ఆయన తనకు తెలిసిన ఆదాయ వనరులకు మించి అక్రమ మార్గాల్లో ఆస్తులు కూడబెట్టినట్లు ఆరోపిస్తూ కేసు నమోదు చేసి సోదాలు నిర్వహించింది.

ఒకేరోజు తొమ్మిది ప్రాంతాల్లో సోదాలు.
2026 నవంబర్ 12న అధికారి నివాసంతో పాటు ఆయన బంధువులు, స్నేహితులు, బినామీలు, ఇతర అనుచరులకు సంబంధించిన మరో తొమ్మిది ప్రాంతాల్లో ఏసీబీ అధికారులు ఏకకాలంలో తనిఖీలు నిర్వహించారు. ఈ సోదాల్లో భారీగా స్థిర, చరాస్తులకు సంబంధించిన పత్రాలు, బంగారు ఆభరణాలు, వెండి వస్తువులు, వాహనాలను గుర్తించారు.

విల్లా నుంచి వ్యవసాయ భూముల వరకు..
ఏసీబీ ప్రకటన ప్రకారం సోదాల్లో గుర్తించిన ఆస్తుల వివరాలు ఇలా ఉన్నాయి.
- తుక్కుగూడలో 342 చదరపు గజాల స్థలంలో నిర్మించిన 5,200 చదరపు అడుగుల విస్తీర్ణం కలిగిన మూడు అంతస్తుల విల్లా.
- కర్మన్‌ఘాట్‌లోని విలాసవంతమైన నివాస సముదాయంలో మూడు పడక గదుల ఫ్లాట్.
- నాగోల్ రాక్‌టౌన్‌లో రెండు పడక గదుల ఫ్లాట్.
- వనపర్తి జిల్లా షాపూర్ గ్రామంలో 25 ఎకరాల వ్యవసాయ భూమి.
- నాగర్‌కర్నూల్‌లో తొమ్మిది ఖాళీ స్థలాలు.
- షాపూర్ గ్రామంలో ఒక వ్యవసాయ క్షేత్ర గృహం.

50 తులాల బంగారం.. 2.8 కిలోల వెండి.
సోదాల్లో సుమారు 50 తులాల బంగారు ఆభరణాలు, 2.8 కిలోల వెండి వస్తువులను గుర్తించారు. వీటితో పాటు ఐదు వాహనాలను కూడా గుర్తించారు. వాటిలో మహీంద్రా ఎక్స్‌యూవీ 7ఎక్స్‌ఓ, మహీంద్రా టీయూవీ 300, మారుతి సెలెరియో, హ్యుందాయ్ శాంత్రో, బొలెరో వాహనాలు ఉన్నాయి.

రూ.7.32 కోట్లకు పైగా ఆస్తులు.
ఏసీబీ అధికారులు గుర్తించిన ఆస్తుల డాక్యుమెంట్ విలువ మొత్తం రూ.7,32,66,581గా ప్రకటించారు. అయితే స్థిర, చరాస్తుల ప్రస్తుత మార్కెట్ విలువ పత్రాల్లో పేర్కొన్న విలువ కంటే అనేక రెట్లు అధికంగా ఉండే అవకాశం ఉందని ఏసీబీ వెల్లడించింది.

అక్రమాస్తులపై మరింత విచారణ.
ఆదాయానికి మించిన ఆస్తుల కేసులో అవినీతి నిరోధక చట్టం 1988లోని సవరణల అనంతర సెక్షన్లు 13(1)(బి), 13(2) కింద కేసు నమోదు చేసినట్లు అధికారులు తెలిపారు. అదనపు ఆస్తుల వివరాలపై ఇంకా పరిశీలన కొనసాగుతోందని, కేసు దర్యాప్తులో ఉందని స్పష్టం చేశారు.

లంచం అడిగితే 1064కు ఫిర్యాదు చేయండి.
ప్రభుత్వ ఉద్యోగులు ఎవరైనా లంచం డిమాండ్ చేస్తే ప్రజలు ఏసీబీ టోల్‌ఫ్రీ నంబర్ 1064కు ఫిర్యాదు చేయాలని అధికారులు సూచించారు. వాట్సాప్ నంబర్ 9440446106, ఫేస్‌బుక్‌లో తెలంగాణ ఏసీబీ, ఎక్స్ వేదికగా ఏవశ్రీఘఅస్త్రుఅఘ ూాజదీ ద్వారా కూడా సంప్రదించవచ్చని తెలిపారు. ఫిర్యాదుదారుల వివరాలను గోప్యంగా ఉంచుతామని వెల్లడించారు.

జగత్‌పల్లిలో ఉచిత పశు ఆరోగ్య శిబిరం.. పశువులకు వైద్య సేవలు

పశుగ్రాసం సాగు చేసే రైతులకు రూ.14 వేల ప్రోత్సాహకం



పెద్దమందడి నవంబర్ 13 పశువుల ఆరోగ్య పరిరక్షణే లక్ష్యంగా పెద్దమందడి మండలం జగత్‌పల్లి గ్రామంలో పశుసంవర్ధక శాఖ, పశుగణాభివృద్ధి సంస్థ ఆధ్వర్యంలో నిర్వహించిన ఉచిత పశు ఆరోగ్య శిబిరం విజయవంతమైంది. గ్రామ సర్పంచ్ పెంటన్న యాదవ్ శిబిరాన్ని ప్రారంభించారు. ఈ సందర్భంగా పాడి పశువులకు, గర్భకోశ సంబంధిత వ్యాధులతో బాధపడుతున్న గేదెలకు వైద్య పరీక్షలు నిర్వహించి చికిత్స అందించారు. దూడలకు నట్టల నివారణ మందులు తాగించారు. అనంతరం పశుగ్రాస పెంపకంపై రైతులకు అవగాహన కల్పించారు. రాబోయే రోజుల్లో ఎల్‌నినో ప్రభావంతో పశుగ్రాస కొరత ఏర్పడే అవకాశం ఉన్నందున రైతులు ముందస్తుగా పశు గ్రాసం సాగు చేపట్టాలని మండల పశువైద్యాధికారి డాక్టర్ శ్యామ్ సూచించారు. వి బి జి రామ్ జి పథకం కింద ఒక ఎకరం పశుగ్రాసం సాగు చేసే రైతులకు రూ.14 వేల ప్రోత్సాహకం అందించే అవకాశం ఉందని వివరించారు. పశుపోషకులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని కోరారు. ఈ కార్యక్రమంలో రైతులు, పశువైద్య సిబ్బంది జగదీష్, వెంకటేష్, గోపాలమిత్రులు రవి, రఘు తదితరులు పాల్గొన్నారు.

ఇందిరమ్మ కుటుంబ జీవిత బీమా పథకం



ఇందిరమ్మ కుటుంబ జీవిత బీమా పథకం ద్వారా ప్రతి కుటుంబానికి రూ.5 లక్షల బీమా భద్రత కల్పించేందుకు పకడ్బందీ ఏర్పాట్లు చేయాలని NGKL కలెక్టర్ హేమంత కేశవ్ పాటిల్ అధికారులను ఆదేశించారు. అర్హులైన ప్రతి కుటుంబానికి పథకంపై అవగాహన కల్పించి, ఎవరూ మిగిలిపోకుండా వివరాలను పారదర్శకంగా, కచ్చితత్వంతో నమోదు చేయాలని సూచించారు.

సర్కిల్--56లో అక్రమ నిర్మాణాల సామ్రాజ్యం.. టౌన్‌ప్లానింగ్ శాఖ బిల్డర్లకు బానిసైందా?

- అనుమతులు అటకెక్కాయి.. ముడుపులకే పెద్దపీటనా? సాయిబాబా నగర్‌లో ఇదేం దందా?
- బిల్డర్ల జేబులు నిండితే చాలు.. నిబంధనలు పాతరేసే అధికారులెవరు?
- అక్రమ నిర్మాణాలకు టౌన్‌ప్లానింగ్ అధికారుల మౌనమే కొండంత అండనా?
- చట్టం కంటే ముడుపులే గొప్పనా? కొంపల్లి సర్కిల్--56లో ఎవరిది రాజ్యం?
- అనుమతులు లేకున్నా నిర్మాణం ఆగదా? అధికారుల కళ్లు మూసుకుపోయాయా?
- బిల్డర్ ఇష్టమే చట్టమా? టౌన్‌ప్లానింగ్ అధికారులు ప్రేక్షకులుగా మిగిలారా?
- అక్రమ నిర్మాణాలపై చర్యలకు బ్రేక్.. ముడుపుల ఆరోపణలపై విచారణకు వెనుకడుగు ఎందుకు?
- నిబంధనలు సామాన్యులకేనా? డబ్బున్న బిల్డర్లకు ప్రత్యేక చట్టమా?
- సాయిబాబా నగర్‌లో భారీ నిర్మాణం.. అధికారుల నోటికి తాళం.. ఉన్నతాధికారులకు కనిపించడం లేదా?





కుత్బుల్లాపూర్ : నవంబర్ 13 (పీపుల్స్ న్యూస్)
కొంపల్లి సర్కిల్--56 పరిధిలోని సూరారం సాయిబాబా నగర్‌లో మసీదు సమీపంలో జరుగుతున్న భారీ భవన నిర్మాణం ఇప్పుడు చర్చనీయాంశంగా మారుతోంది. నిర్మాణానికి అవసరమైన అనుమతులు ఉన్నాయా? ఆమోదిత నిర్మాణ ప్రణాళిక ప్రకారమే పనులు కొనసాగుతున్నాయా? లేక నిబంధనలను పక్కనపెట్టి ఇష్టారాజ్యంగా నిర్మాణం చేపడుతున్నారా? అనే ప్రశ్నలు స్థానికంగా వ్యక్తమవుతున్నాయి. అక్రమ నిర్మాణాలను అడ్డుకోవాల్సిన టౌన్‌ప్లానింగ్ అధికారులు మాత్రం చూసీచూడనట్లు వ్యవహరిస్తున్నారనే ఆరోపణలు వినిపిస్తున్నాయి.

అనుమతులు లేకుంటే నిర్మాణం ఎలా సాగుతోంది?
భవన నిర్మాణానికి సంబంధిత శాఖల నుంచి ముందస్తు అనుమతులు పొందడం తప్పనిసరి. ఆమోదిత ప్రణాళికకు అనుగుణంగానే నిర్మాణ పనులు చేపట్టాలి. అయితే సాయిబాబా నగర్‌లో జరుగుతున్న భారీ నిర్మాణానికి సంబంధించి అనుమతుల వివరాలు ఏమిటి? భవన నిర్మాణ ప్రణాళికకు ఆమోదం ఉందా? ఎన్ని అంతస్తులకు అనుమతి తీసుకున్నారు? వాస్తవంగా ఎన్ని అంతస్తులు నిర్మిస్తున్నారు? అన్న వివరాలను అధికారులు బహిర్గతం చేయాలి. అనుమతులు లేకుండా నిర్మాణం జరుగుతున్నట్లు తేలితే తక్షణమే పనులు నిలిపివేసి చట్టప్రకారం చర్యలు తీసుకోవాలి.

బిల్డర్ల బరితెగింపు.. అధికారులది ప్రేక్షకపాత్రా?
సర్కిల్--56 పరిధిలో నిర్మాణాలు జరుగుతున్న ప్రాంతాల్లో టౌన్‌ప్లానింగ్ అధికారులు నిరంతరం పర్యవేక్షణ చేయాల్సి ఉంటుంది. కానీ భారీ నిర్మాణం జరుగుతున్నట్లు ఆరోపణలు వస్తున్నా అధికారులు క్షేత్రస్థాయిలో తనిఖీలు నిర్వహించారా? నిర్మాణదారులకు నోటీసులు జారీ చేశారా? నిబంధనల ఉల్లంఘనలను గుర్తించారా? అన్నది ప్రశ్నార్థకంగా మారింది. నిర్మాణం పూర్తయ్యే వరకు వేచి చూసి ఆ తర్వాత చర్యల పేరుతో హడావుడి చేయడం వల్ల ప్రయోజనం ఏమిటి? అక్రమ నిర్మాణాలను ప్రారంభ దశలోనే అడ్డుకోవాల్సిన బాధ్యత అధికారులపై లేదా?

లంచాలిస్తే అక్రమ నిర్మాణాలు సక్రమమవుతాయా?
టౌన్‌ప్లానింగ్ శాఖలో ముడుపుల వ్యవహారాలపై ప్రజల్లో అనుమానాలు వ్యక్తమవుతున్నాయి. అధికారులకు లంచాలు చెల్లిస్తే అనుమతులు లేకున్నా నిర్మాణాలు కొనసాగించుకోవచ్చా? డబ్బు ప్రభావంతో నిబంధనల ఉల్లంఘనలను పట్టించుకోవడం లేదా? అన్న ప్రశ్నలు తలెత్తుతున్నాయి. అయితే ఈ ఆరోపణలకు సంబంధించి ఆధారాలతో విచారణ జరిపి వాస్తవాలను బయటపెట్టాల్సిన అవసరం ఉంది. అవినీతి జరిగినట్లు తేలితే బాధ్యులపై కఠిన చర్యలు తీసుకోవాలి. అధికారులు తమపై వస్తున్న ఆరోపణలకు సమాధానం చెప్పాలి.

సామాన్యులకే నిబంధనలా? బిల్డర్లకు మినహాయింపులా?
సాధారణ ప్రజలు ఇంటి నిర్మాణం చేపట్టాలంటే అనుమతులు, నిబంధనలు, అధికారుల తనిఖీలతో ఎన్నో ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. మరి భారీ నిర్మాణాలు చేపట్టేవారికి అదే నిబంధనలు వర్తించవా? చట్టం ముందు అందరూ సమానమే అన్న సూత్రం నిర్మాణ రంగంలోనూ అమలవుతోందా? డబ్బు, పలుకుబడి ఉన్నవారికి ఒక న్యాయం.. సామాన్యులకు మరో న్యాయమా? అనే ప్రశ్నలకు సర్కిల్--56 అధికారులు సమాధానం చెప్పాల్సిన సమయం ఆసన్నమైంది.

ఉన్నతాధికారులు స్పందించాలి.. అక్రమ నిర్మాణాలపై కొరడా ఝుళిపించాలి!
కొంపల్లి సర్కిల్--56 టౌన్‌ప్లానింగ్ అధికారులు సాయిబాబా నగర్‌లో మసీదు సమీపంలోని భారీ నిర్మాణాన్ని తక్షణమే పరిశీలించాలి. నిర్మాణ అనుమతులు, ఆమోదిత ప్రణాళిక, స్థల విస్తీర్ణం, నిర్మాణంలో ఉన్న అంతస్తులు తదితర వివరాలను క్షేత్రస్థాయిలో తనిఖీ చేయాలి. అనుమతులకు విరుద్ధంగా నిర్మాణం జరుగుతున్నట్లు నిర్ధారణ అయితే చట్టప్రకారం చర్యలు తీసుకోవాలి. విధుల్లో నిర్లక్ష్యం, అవినీతి లేదా అక్రమాలకు సహకారం ఉన్నట్లు ఆధారాలు లభిస్తే సంబంధిత అధికారులపైనా శాఖాపరమైన విచారణ చేపట్టాలి.

రూ. 10,000 అప్పు తీర్చడం కోసం ఏటీఎంలో చోరీకి యత్నం - నిందితుడిని గంటల వ్యవధిలోనే పట్టుకున్న పోలీసులు



కామారెడ్డి :ఇటీవల కాలంలో బ్యాంక్ ఏటీఎంలలో చోరీ చేసేందుకు అనేక దొంగలముఠాలు ప్రయత్నిస్తున్నాయి. కొన్నిచోట్ల అందినకాడికి దోచుకుంటున్నాయి. మరొకొన్ని చోట్ల స్థానికులు, సిబ్బంది అప్రమత్తతతో విఫలం అవుతున్నాయి. అయితే ఇలాంటి ఘటనల్లో చాలా చోట్ల నిందితులకు ఆర్థిక ఇబ్బందులో చోరీకి కారణం అవుతున్నాయి. లక్షల్లో అప్పులు ఉండడం లేదా సులభంగా డబ్బు సంపాదించాలనే ఆశతో చోరీలకు పాల్పడుతున్నారు. అయితే కేవలం రూ.10 వేల కోసం ఓ వ్యక్తి ఏకంగా ఏటీఎంలో దొంగతనం చేసిన ఘటన ఇటీవల చోటుచేసుకుంది.
కామారెడ్డి జిల్లాలో ఎస్?బీఐ ఏటీఎం వద్ద ఇటీవల చోరీ జరిగింది. మహారాష్ట్రలోని పర్భణికి చెందిన మహేష్ జ్ఞానోబా బిండే ఈ చోరీకి పాల్పడినట్లు జిల్లా ఎస్పీ రాజేశ్? చంద్ర వెల్లడించారు. నిందితుడిని అరెస్ట్? చేసినట్లు తెలిపారు. అయితే నిందితుడు తనకున్న రూ.10,000 అప్పును తీర్చుకునేందుకు ఏకంగా ఏటీఎం వద్ద చోరీ చేయడం గమనార్హం.
కామారెడ్డి ఎస్పీ వెల్లడించిన వివరాల ప్రకారం, నిందితుడు మహేష్ జ్ఞానోబా బిండే కామారెడ్డి పట్టణంలోని 'వాల్మీకి బ్యాండ్'లో వాయిద్యకారుడిగా పనిచేస్తూ జీవనోపాధి పొందుతున్నాడు. ఎవరికో చెల్లించాల్సిన రూ.10,000 అప్పును తీర్చుకునే క్రమంలో, బుధవారం అర్ధరాత్రి దాటిన తర్వాత ఏటీఎం నుంచి నగదును దొంగిలించేందుకు ప్రయత్నించాడు.

సెక్యూరిటీ అలారానికి పారిపోయిన నిందితుడు
పోలీసులకు దొరక్కుండా ఉండేందుకు ముందుగా అక్కడ ఉన్న సీసీటీవీ కెమెరాలను తొలగించాడు. అనంతరం ఇనుప రాడ్డుతో ఏటీఎం మెషీన్‌ను పగలగొట్టి నగదును దొంగిలించేందుకు ప్రయత్నించాడు. అయితే సెక్యూరిటీ అలారం మోగడంతో భయంతో అక్కడ నుంచి పారిపోయాడు. నిందితుడు తన స్వస్థలం వెళ్లేందుకు రైల్వే స్టేషన్? వైపు వెళ్తుండగా, పోలీసులు గుర్తించి అరెస్ట్? చేశారు. నిందితుడి నుంచి ఇనుప రాడ్డు, ఏటీఎం కేంద్రం నుంచి తొలగించిన సీసీటీవీ కెమెరాలు, మొబైల్ ఫోన్‌ను పోలీసులు స్వాధీనం చేసుకున్నారు. నిందితుడిని జ్యుడీషియల్ కస్టడీకి తరలించినట్లు ఎస్పీ పేర్కొన్నారు. చోరీ కేసును కొన్ని గంటల వ్యవధిలోనే చేధించిన పోలీస్ అధికారులను కామారెడ్డి జిల్లా ఎస్పీ రాజేశ్? చంద్ర అభినందించారు. వారికి నగదు బహుమతులను అందజేశారు.

తీన్మార్ మల్లన్న వాహనంపై.. దాడి హత్యాయత్నమే

- తీవ్రంగా ఖండించిన చౌదరిగూడ మండల నేతలు..



జల్లేడు చౌదరిగూడ, నవంబర్ 14: తెలంగాణ రాజ్యాధికార పార్టీ వ్యవస్థాపకులు తీన్మార్ మల్లన్న వాహనంపై జరిగిన ప్రమాద ఘటన ముమ్మాటికీ హత్యాయత్నమేనని ఆ పార్టీ జిల్లేడు చౌదరిగూడ మండల అధ్యక్షుడు దొరతల రాములు, ఉపాధ్యక్షుడు జిల్లెల్ల నర్సింలు ఆరోపించారు. ఈ ఘటనను మండల కమిటీ పక్షాన తీవ్రంగా ఖండిస్తున్నట్లు వారు ఒక ప్రకటనలో తెలిపారు. ?బీసీ రాజ్యాధికార లక్ష్యంగా తీన్మార్ మల్లన్న చేపడుతున్న పాదయాత్ర యాదాద్రి భువనగిరి జిల్లా మోత్కూరు మండలం అనాజపురం గ్రామ పరిధిలోకి చేరుకున్న సమయంలో ఈ ఊహించని ఘటన చోటుచేసుకుంది. కాన్వాయ్‌లో మల్లన్న వాహనం వెనుక మరిన్ని కార్లు ఉన్నప్పటికీ, ఒక లారీ నేరుగా వచ్చి ఆయన ప్రయాణిస్తున్న కారును బలంగా ఢీకొట్టింది. వెనుక వాహనాలను వదిలి, కేవలం మల్లన్న కారునే లక్ష్యంగా చేసుకుని ఢీకొట్టడం వెనుక పెద్ద కుట్ర దాగి ఉందని, ఇది ఉద్దేశపూర్వకంగా చేసిన హత్యాయత్నమేనని వారు అనుమానం వ్యక్తం చేశారు. ఈ ప్రమాదంలో కారులో ప్రయాణిస్తున్న భార్యాభర్తలకు తీవ్ర గాయాలయ్యాయని వారు ఆవేదన వ్యక్తం చేశారు. ?ఇలాంటి దాడులు ఎన్ని జరిగినా బీసీ రాజ్యాధికార నినాదం ఆగదని, బడుగు బలహీన వర్గాలైన బీసీ, ఎస్సీ, ఎస్టీ, మైనార్టీల హక్కుల సాధన కోసం తీన్మార్ మల్లన్న పోరాటం నిరంతరం కొనసాగుతుందని నేతలు స్పష్టం చేశారు. ఈ ఘటనపై పోలీసులు సమగ్ర విచారణ జరిపి, బాధ్యులపై కఠిన చర్యలు తీసుకోవాలని వారు డిమాండ్ చేశారు.

పరిగిలో కర్ణాటక మంత్రి ప్రియాంక్ ఖర్గేకు ఘన స్వాగతం



పరిగి, నవంబర్ 14 :

పరిగి పట్టణానికి విచ్చేసిన కర్ణాటక రాష్ట్ర హోంమంత్రి ఏఐసిసి అధ్యక్షులు మల్లికార్జున ఖర్గే తనయుడు ప్రియాంక్ ఖర్గే, శుక్రవారం హైదరాబాదు నుండి కర్ణాటక రాష్ట్రానికి వెళుతున్న సందర్భంగా పరిగి పట్టణానికి చేరుకోగానే ప్రియాంక కార్గేను మర్యాదపూర్వకంగా కలుసుకొని వివిధ అంశాలను తన దృష్టికి తీసుకువెళ్లిన పరిగి నియోజకవర్గ కాంగ్రెస్ నాయకులు ఈ సందర్భంగా స్థానిక నాయకులు ఆయనకు పుష్పగుచ్ఛం అందించి ఘనంగా సత్కరించారు. అనంతరం మంత్రి ప్రియాంక్ ఖర్గే నాయకులను ఉద్దేశించి మాట్లాడుతూ.. తెలంగాణలో ప్రజా ప్రభుత్వం అందిస్తున్న సంక్షేమ పథకాలను ప్రజల్లోకి మరింత విస్తృతంగా తీసుకెళ్లాలని సూచించారు. పార్టీ బలోపేతానికి కార్యకర్తలు, నాయకులు సమన్వయంతో పనిచేయాలని ఆయన పిలుపునిచ్చారు. అనంతరం నియోజకవర్గ నాయకులు మాట్లాడుతూ.. జాతీయ నాయకులు మల్లికార్జున ఖర్గే, మార్గదర్శకత్వంలో, స్థానిక నాయకత్వం అండతో పరిగి నియోజకవర్గ అభివృద్ధికి, పార్టీ అభ్యున్నతికి తామంతా నిరంతరం కృషి చేస్తామని మంత్రికి తెలియజేశారు. ఈ కార్యక్రమంలో పరిగి నియోజకవర్గ నాయకులు హనుమంతు ముదిరాజ్, రాకంచెర్ల పెంటయ్య, దోమ విజయకుమార్ రెడ్డి, బంగ్ల యాదయ్య గౌడ్, విశ్రాంత సైనికోద్యోగి లింగమయ్య ముదిరాజ్, బాస్పల్లి శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

గురుకులాలకు సరుకుల సరఫరాలో నిర్లక్ష్యాన్ని సహించం: మంత్రి అడ్లూరి లక్ష్మణ్

హైదరాబాద్, నవంబర్ 13: గురుకుల విద్యార్థులకు సరుకులు, కిట్ల సరఫరాలో నిర్లక్ష్యం వహిస్తే కఠిన చర్యలు తప్పవని మంత్రి అడ్లూరి లక్ష్మణ్ ఆగ్రహం వ్యక్తం చేశారు. ఈ మేరకు మఫత్లాల్ ఇండస్ట్రీస్ సంస్థకు హెచ్చరికలు జారీ చేశారు.గురుకుల విద్యార్థులకు పెండింగ్‌లో ఉన్న 2 వేల జతల తెల్ల సాక్సులు, 3 వేల ట్రంకు పెట్టెలను గడువులోగా సరఫరా చేయాలని.. లేదంటే.. టెండర్ నిబంధనల ప్రకారం కఠిన చర్యలు తీసుకుంటామని మంత్రి అడ్లూరి.. మఫత్లాల్ ఇండస్ట్రీస్ సంస్థకు హెచ్చరికలు జారీ చేశారు. కాగా.. ఈ నెల 16లోగా పెండింగ్ సరుకులన్నీ అందిస్తామని మఫత్లాల్ సంస్థ హామీ ఇచ్చినట్లు తెలుస్తోంది.గురుకుల విద్యార్థులకు సరఫరా చేసే సరుకుల విషయంలో మంత్రి సంబంధిత అధికారులకు కీలక ఆదేశాలు జారీ చేశారు. ప్రతీ వస్తువు నాణ్యతను క్షుణ్ణంగా పరిశీలించాలని ఆదేశించారు. ఈ క్రమంలో ప్రతి జిల్లాకు నోడల్ అధికారిని నియమించి సరఫరాలను పర్యవేక్షించాలని సూచించారు. గురుకులాల్లో నిత్యావసరాల కొరత రాకుండా బఫర్ స్టాక్‌ను తప్పనిసరిగా నిర్వహించాలని ఆదేశించారు. నవంబర్ 25లోగా సరఫరా పురోగతిపై ఆయనకు సమగ్ర నివేదిక ఇవ్వాలని ఆదేశించారు. కాగా.. ఎస్సీ, ఎస్టీ విద్యార్థుల సంక్షేమంలో నిర్లక్ష్యాన్ని సహించేది లేదని.. విద్యార్థులకు నాణ్యమైన భోజనం, సరుకులు సకాలంలో అందేలా చర్యలు చేపట్టాలని అధికారులను ఆదేశించారు.



పిల్లల భద్రత బలిపీఠంపై.. నిర్మాణ పనుల మధ్య తరగతుల నిర్వహణకు ఎవరిచ్చారు అనుమతి?

- **ఫైర్ సేఫ్టీ ధ్రువపత్రం ఉందా? అగ్నిప్రమాదం జరిగితే చిన్నారుల ప్రాణాలకు బాధ్యత ఎవరిది?**
- **ప్లే గ్రౌండ్ లేకుంటే విద్యార్థులకు ఆటవిడుపు ఎక్కడ? నిబంధనల అమలుపై యాజమాన్యానికి పట్టింపు లేదా?**
- **పాఠశాల గుర్తింపు నుంచి భవన అనుమతుల వరకు అన్నీ సక్రమమేనా? అధికారుల తనిఖీలకు యాజమాన్యం సిద్ధమేనా?**
- **ఫిర్యాదులు వస్తున్నా చర్యలు శూన్యం.. విద్యాశాఖ కార్యాలయాల్లో ఫైళ్లు కదలవా? లేక ఉద్దేశపూర్వక నిర్లక్ష్యమా?**
- **చిన్నారుల భద్రతపై ఇంత నిర్లక్ష్యమా? ప్రమాదం జరిగాక మేల్కొంటారా.. ముందే చర్యలు తీసుకోరా?**
- **స్కూల్ యాజమాన్యానికి నిబంధనలు వర్తించవా? తనిఖీలు చేయాల్సిన అధికారులు ఎక్కడ దాక్కున్నారు?**
- **అధికారుల మౌనం వెనుక ఆంతర్యమేమిటి? రాజకీయ ఒత్తిళ్లా.. మరేదైనా కారణమా? సమాధానం చెప్పాల్సిందే!**
- **విద్యాబోధన పేరుతో విద్యార్థుల భద్రతతో రాజీ పడుతున్నారా? జిల్లా విద్యాశాఖ తక్షణమే స్పందించాలి!**
- **రేడియంట్ స్కూల్ అనుమతులపై బహిరంగ విచారణ జరపాలి.. నిబంధనలు ఉల్లంఘించినట్లు తేలితే కఠిన చర్యలు తీసుకోవాలి!**







కుత్బుల్లాపూర్, నవంబర్ 13 (పీపుల్స్ న్యూస్)

విద్యార్థులకు విద్యాబుద్ధులు నేర్పించాల్సిన పాఠశాలలోనే వారి భద్రత ప్రశ్నార్థకంగా మారుతోందా? శ్రీకృష్ణ నగర్‌లోని రేడియంట్ (గ్రూఎచీ) హైస్కూల్ నిర్వహణపై అనేక అనుమానాలు, ప్రశ్నలు వ్యక్తమవుతున్నాయి. పాఠశాలకు అవసరమైన అనుమతులు ఉన్నాయా? భవన నిర్మాణ పనులు పూర్తికాకుండానే తరగతులు నిర్వహిస్తున్నారా? విద్యార్థుల భద్రతకు అవసరమైన ఏర్పాట్లు చేశారా? అన్న అంశాలు ఇప్పుడు చర్చనీయాంశంగా మారాయి.

నిర్మాణ పనుల మధ్యే విద్యాబోధనా?

పాఠశాల భవన నిర్మాణ పనులు కొనసాగుతున్న దశలోనే విద్యార్థులకు తరగతులు నిర్వహిస్తున్నారనే ఆరోపణలు వినిపిస్తున్నాయి. నిర్మాణ పనులు జరుగుతున్న ప్రాంతంలో చిన్నారుల రాకపోకలు ఉంటే ప్రమాదాలు సంభవించే అవకాశం లేదా? నిర్మాణ సామగ్రి, విద్యుత్ పరికరాలు, ఇతర ప్రమాదకర పరిస్థితుల నుంచి విద్యార్థులను రక్షించేందుకు ఎలాంటి ఏర్పాట్లు చేశారు? నిర్మాణ పనులు పూర్తయ్యాయా? భవన వినియోగానికి సంబంధిత అనుమతులు పొందారా? అనే ప్రశ్నలకు పాఠశాల యాజమాన్యం సమాధానం చెప్పాల్సిన అవసరం ఉంది.





ఫైర్ సేఫ్టీ ఉందా? ప్రమాదం జరిగితే బాధ్యత ఎవరిది?

పాఠశాలల్లో అగ్నిప్రమాదాల నివారణకు అవసరమైన భద్రతా ఏర్పాట్లు అత్యంత కీలకం. రేడియంట్ స్కూల్‌కు ఫైర్ సేఫ్టీ అనుమతులు ఉన్నాయా? అగ్నిమాపక పరికరాలు అందుబాటు లో ఉన్నాయా? అత్యవసర పరిస్థితుల్లో విద్యార్థులు సురక్షితంగా బయటకు వెళ్లేందుకు మార్గాలు ఉన్నాయా? సిబ్బందికి అగ్నిప్రమాదాల సమయంలో తీసుకోవాల్సిన జాగ్రత్తలపై శిక్షణ ఇచ్చారా? అనే అంశాలను అధికారులు తక్షణమే పరిశీలించాలి.

ప్లే గ్రౌండ్ ఎక్కడ? విద్యార్థులకు సౌకర్యాలు కల్పించారా?

పాఠశాలలో విద్యార్థులకు అవసరమైన ఆటస్థలం ఉందా? క్రీడలు, శారీరక వ్యాయామాలకు తగిన సదుపాయాలు కల్పించారా? పాఠశాల భవనంలో తరగతి గదులు, గాలి, వెలుతురు, పారిశుద్ధ్యం, తాగునీరు వంటి కనీస సదుపాయాలు ఉన్నాయా? పాఠశాల గుర్తింపు నిబంధనలకు అనుగుణంగా నిర్వహణ సాగుతోందా? అన్న విషయాలపై విద్యాశాఖ అధికారులు క్షేత్రస్థాయిలో తనిఖీలు నిర్వహించాలి.

ఫిర్యాదులు వస్తున్నా చర్యలు ఎందుకు లేవు?

పాఠశాల నిర్వహణపై ఫిర్యాదులు వచ్చినట్లు స్థానికంగా ఆరోపణలు వినిపిస్తున్నప్పటికీ, వాటిపై అధికారులు ఎలాంటి చర్యలు తీసుకున్నారనే విషయం స్పష్టంగా తెలియడం లేదు. ఫిర్యాదులపై విచారణ జరిగిందా? పాఠశాలను తనిఖీ చేశారా? లోపాలు గుర్తిస్తే నోటీసులు జారీ చేశారా? లేక ఫిర్యాదులు కార్యాలయాలకే పరిమితమై బుట్టదాఖలవుతున్నాయా? అన్న ప్రశ్నలు తలెత్తుతున్నాయి.

అధికారుల మౌనం వెనుక మర్మమేమిటి?

విద్యార్థుల భద్రతకు సంబంధించిన అంశాలపై అధికారులు మౌనంగా ఉండటం పలు అనుమానాలకు తావిస్తోంది. యాజమాన్యంపై చర్యలు తీసుకోవడంలో జాప్యానికి కారణమేమిటి? రాజకీయ ఒత్తిళ్లు ఏమైనా ఉన్నాయా? ఇతర ప్రభావాలు పనిచేస్తున్నాయా? అనే ప్రశ్నలకు సంబంధిత అధికారులు స్పష్టమైన సమాధానం ఇవ్వాలి. ఎలాంటి ఆధారాలు లేకుండా ఆరోపణలను నిజాలుగా పరిగణించలేం. అయితే ప్రజల్లో వ్యక్తమవుతున్న సందేహాలను నివృత్తి చేయాల్సిన బాధ్యత అధికారులపై ఉంది.

జిల్లా విద్యాశాఖ అధికారి స్పందించాలి!

రేడియంట్ (గ్రూఎచీ) హైస్కూల్‌కు సంబంధించిన విద్యాశాఖ గుర్తింపు, భవన నిర్మాణ అనుమతులు, ఫైర్ సేఫ్టీ ధ్రువపత్రాలు, ప్లే గ్రౌండ్, విద్యార్థుల భద్రతా ఏర్పాట్లపై సమగ్ర విచారణ చేపట్టాలి. అవసరమైతే విద్యాశాఖ, అగ్నిమాపక శాఖ, సంబంధిత భవన నిర్మాణ అనుమతుల శాఖల అధికారులు సంయుక్తంగా తనిఖీలు నిర్వహించాలి. నిబంధనల ఉల్లంఘనలు నిర్ధారణ అయితే చట్టప్రకారం చర్యలు తీసుకోవాలి.

ప్రమాదం జరిగిన తర్వాత విచారణలు, నివేదికలు అవసరం లేదు.. ప్రమాదం జరగకముందే అప్రమత్తమై చిన్నారుల భద్రతకు భరోసా కల్పించాలి. రేడియంట్ (స్ వివిన్) హై స్కూల్ యాజమాన్యం అనుమతులు, భద్రతా ఏర్పాట్లపై ప్రజలకు స్పష్టత ఇవ్వాలి. విద్యాశాఖ అధికారులు మౌనం వీడి వాస్తవాలను వెల్లడించాలి. చిన్నారుల భవిష్యత్తు, భద్రత విషయంలో నిర్లక్ష్యానికి తావుండకూడదు!

ప్రతీ కుటుంబానికి ఇందిరమ్మ బీమా వర్తింపజేస్తాం

ఆసిఫాబాద్, నవంబరు 13 : రాష్ట్రంలో ప్రతీ కుటుంబానికి ఇందిరమ్మ జీవిత బీమా పథకం వర్తింపజేసే విధంగా చర్యలు తీసుకుంటున్నాని ఉప ముఖ్యమంత్రి మల్లు భట్టి విక్రమార్క అన్నారు. హైదరాబాద్‌లోని తన చాంబర్ నుంచి శుక్రవారం వీడియో కాన్ఫరెన్స్ ద్వారా అన్ని జిల్లాల కలెక్టర్లు, అదనపు కలెక్టర్లు, మున్సిపల్ కమిషనర్లు, పంచాయతీరాజ్, ప్రణాళికశాఖ అధికారులతో సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఉపముఖ్యమంత్రి మాట్లాడుతూ ఈనెల 19న మాజీ ప్రధాని ఇందిరగాంధీ జయంతిని పురస్కరించుకొని ముఖ్యమంత్రి



చేతుల మీదుగా ఇందిరమ్మ కుటుంబ జీవితబీమా పథకాన్ని ప్రారంభించనున్నామని చెప్పారు. అదే రోజు అన్ని గ్రామపంచాయతీలలో, మున్సిపాలిటీలలో ప్రారంభించేందుకు అధికారులు చర్యలు చేపట్టాలన్నారు. ప్రతి గ్రామపంచాయతీలో ప్రతి వార్డులో కౌంటర్లు ఏర్పాటు చేసి దరఖాస్తులు స్వీకరించాలని సూచించారు. దరఖాస్తుపై కుటుంబ పెద్ద సంతకం తీసుకోవాలని తెలిపారు. ఈ పథకానికి రాష్ట్రానికి చెందినవారై వయస్సు 19 నుంచి 59 సంవత్సరాలలోపు వారు అర్హులని తెలిపారు. ఈ పథకంపై జిల్లాలో ప్రజలందరికీ తెలిసే విధంగా విస్తృత ప్రచారం నిర్వహించాలని తెలిపారు.

బాలాజీ లేఔట్‌లో బిల్డర్ బరితెగింపు.. సర్కిల్--57 టౌన్‌ప్లానింగ్ అధికారులది బానిసత్వమా?

- అనుమతులకు పాతర.. బిల్డర్‌కు అధికారుల అండదండలా? సర్కిల్ --57లో ఇదేం పాలన?
- బిల్డర్ కనుసైగే శాసనమా? టౌన్‌ప్లానింగ్ అధికారుల అధికారం బందీ అయిందా?
- అక్రమ నిర్మాణానికి రెడ్ కార్పెట్.. నిబంధనలకు సమాధి! బాలాజీ లేఔట్‌లో ఎవరిది రాజ్యం?
- బిల్డర్ల ముందు చట్టం బలాదూరా? సర్కిల్--57 అధికారుల మౌనం వెనుక మర్మమేమిటి?
- అనుమతులు మించితే చర్యలు తీసుకునేదెవరు? బిల్డర్ నిర్మాణానికి అధికారుల రక్షణ కవచమా?
- బాలాజీ లేఔట్‌లో బిల్డర్ ఇష్టారాజ్యం.. టౌన్‌ప్లానింగ్ శాఖకు కనిపించని అక్రమాలా?
- నిబంధనలు బుట్టదాఖలా.. నిర్మాణాలు జోరుగా! సర్కిల్--57లో అధికారుల పర్యవేక్షణ ఏది?
- బిల్డర్ నిర్మాణం ఆగదా? అధికారుల చర్యలు మొదలుకావా? ఉన్నతాధికారులకు కనిపించడం లేదా?
- అనుమతుల పేరుతో ఒకటి.. క్షేత్రస్థాయిలో మరొకటి! బాలాజీ లేఔట్‌లో నిర్మాణాల బాగోతమా?



కుత్బుల్లాపూర్: నవంబర్ 13 (పీపుల్స్ న్యూస్)

గాజులరామారం సర్కిల్--57 పరిధిలోని బాలాజీ లేఔట్ ప్రాంతంలో భవన నిర్మాణ నిబంధనలకు విరుద్ధంగా భారీ నిర్మాణం కొనసాగుతోందనే ఆరోపణలు స్థానికంగా తీవ్ర చర్చకు దారితీస్తున్నాయి. భవన నిర్మాణానికి మంజూరైన అనుమతులను మించి పనులు చేపడుతున్నారనే విమర్శలు వ్యక్తమవుతున్నాయి. ఒకవైపు బిల్డర్ నిర్మాణ పనులు ముందుకు సాగుతుంటే, మరోవైపు వాటిని పర్యవేక్షించి నిబంధనలు అమలు చేయాల్సిన టౌన్‌ప్లానింగ్ అధికారులు ఏం చేస్తున్నారనే ప్రశ్నలు వెల్లువెత్తుతున్నాయి. బిల్డర్ నిర్మాణం ఆగదు.. అధికారుల చర్యలు మొదలుకావు.. ఇదేనా సర్కిల్--57లో నిబంధనల అమలు? అన్న ప్రశ్న స్థానికుల నుంచి వినిపిస్తోంది.

అనుమతులు మించితే అధికారులు ఏం చేస్తున్నట్లు?

భవన నిర్మాణానికి అనుమతులు తీసుకోవడం ఒక ఎత్తయితే, మంజూరైన ప్రణాళిక ప్రకారమే నిర్మాణం చేపట్టడం మరో బాధ్యత. అయితే బాలాజీ లేఔట్‌లో జరుగుతున్న నిర్మాణం ఆమోదిత ప్రణాళికకు అనుగుణంగా ఉందా? అనుమతించిన అంతస్తులకే పరిమితమయ్యారా? అదనపు అంతస్తులు లేదా విస్తీర్ణం పెంచి నిర్మిస్తున్నారా? అన్న అంశాలను అధికారులు పరిశీలించారా? అన్నది ప్రశ్నార్థకం. అనుమతులకు మించి నిర్మాణం జరుగుతున్నట్లు నిర్ధారణ అయితే తక్షణమే పనులు నిలిపివేసి చట్టపరమైన చర్యలు తీసుకోవాల్సిన బాధ్యత అధికారులపై లేదా?

బిల్డర్ బరితెగింపు.. అధికారుల మౌనం వెనుక మర్మమేమిటి?

నిర్మాణ నిబంధనలను పర్యవేక్షించాల్సిన టౌన్‌ప్లానింగ్ విభాగం క్షేత్రస్థాయిలో తనిఖీలు నిర్వహించాల్సి ఉంటుంది. కానీ బాలాజీ లేఔట్‌లో అనుమతులకు మించి నిర్మాణం జరుగుతోందనే ఆరోపణలు వస్తున్నప్పటికీ చర్యలు కనిపించడం



లేదని స్థానికులు ప్రశ్నిస్తున్నారు. బిల్డర్‌కు నిర్మాణం కొనసాగించేందుకు పూర్తి సహకారం అందుతోందా? అధికారుల దృష్టికి ఈ విషయం వెళ్లలేదా? లేక తెలిసినా పట్టించుకోవడం లేదా? అన్న అనుమానాలకు సంబంధిత అధికారులు సమాధానం చెప్పాలి.

బిల్డర్లకు ఒక న్యాయం.. సామాన్యులకు మరో న్యాయమా?

సామాన్యులు ఇంటి నిర్మాణం చేపట్టాలంటే అనుమతులు, నిబంధనలు, తనిఖీల పేరుతో ఎన్నో ప్రక్రియలు ఎదుర్కోవాల్సి వస్తోంది. మరి భారీ భవన నిర్మాణాల విషయంలో అనుమతులకు మించి పనులు జరుగుతున్నాయనే ఆరోపణలు వచ్చినప్పుడు అధికారులు ఎందుకు స్పందించడం లేదు? చట్టం అందరికీ సమానంగా వర్తించాల్సిన చోట బిల్డర్లకు ప్రత్యేక మినహాయింపులు ఉన్నాయా? డబ్బు, పలుకుబడి ఉంటే నిబంధనలను పక్కనపెట్టవచ్చా? అనే ప్రశ్నలు ప్రజల్లో వ్యక్తమవుతున్నాయి.

ముడుపుల ఆరోపణలపై విచారణ జరిపే ధైర్యం ఉందా?

అక్రమ నిర్మాణాలపై అధికారుల మౌనం అనేక అనుమానాలకు తావిస్తోంది. బిల్డర్‌కు అధికారుల నుంచి సహకారం అందుతోందనే ఆరోపణలపై ఉన్నతాధికారులు విచారణ జరిపించాలి. ఎవరైనా అక్రమ నిర్మాణాలకు సహకరించారా? విధుల్లో నిర్లక్ష్యం వహించారా? అవినీతి లేదా ముడుపుల వ్యవహారం ఏదైనా ఉందా? అనే అంశాలను ఆధారాలతో పరిశీలించాలి. ఆరోపణలు నిజమని నిర్ధారణ కాకముందే ఎవరినీ దోషిగా ప్రకటించలేం. కానీ విచారణ జరపకుండా మౌనంగా ఉండటం కూడా సమస్యకు పరిష్కారం కాదు.

నిర్మాణం పూర్తయ్యాక మేల్కొంటే ప్రయోజనం ఏమిటి?

అనుమతులకు విరుద్ధంగా నిర్మాణాలు కొనసాగితే భవిష్యత్తులో భవన భద్రత, పార్కింగ్, రహదారులపై ఒత్తిడి, పరిసర ప్రాంతాల ప్రజలకు ఇబ్బందులు తలెత్తే ప్రమాదం ఉంది. నిర్మాణం పూర్తయిన తర్వాత నోటీసులు ఇవ్వడం, చర్యల పేరుతో హడావుడి చేయడం కంటే నిర్మాణ దశలోనే ఉల్లంఘనలను గుర్తించి అడ్డుకోవడం ముఖ్యం. టౌన్‌ప్లానింగ్ అధికారుల పర్యవేక్షణ కాగితాలకే పరిమితమా? క్షేత్రస్థాయిలో అమలు ఎప్పుడు కనిపిస్తుంది?గాజులరామారం సర్కిల్--57 టౌన్‌ప్లానింగ్ అధికారులు, సంబంధిత ఉన్నతాధికారులు బాలాజీ లేఔట్‌లోని నిర్మాణంపై తక్షణమే క్షేత్రస్థాయి తనిఖీలు చేపట్టాలి. మంజూరైన భవన నిర్మాణ అనుమతులు, ఆమోదిత ప్రణాళిక, వాస్తవ నిర్మాణాన్ని పోల్చి చూడాలి. నిబంధనల ఉల్లంఘనలు నిర్ధారణ అయితే చట్టప్రకారం పనులు నిలిపివేసి తదుపరి చర్యలు చేపట్టాలి. విధుల్లో నిర్లక్ష్యం లేదా అక్రమాలకు సహకారం ఉన్నట్లు ఆధారాలు లభిస్తే బాధ్యులపై శాఖాపరమైన విచారణ జరపాలి.బాలాజీ లేఔట్‌లో బిల్డర్ చెప్పిందే చట్టమా? టౌన్‌ప్లానింగ్ అధికారులు కేవలం ప్రేక్షకులుగానే మిగిలిపోతారా? అనుమతులకు మించి నిర్మాణం జరుగుతోందనే ఆరోపణలకు సమాధానం చెప్పేదెవరు? బిల్డర్ ప్రయోజనాలే ముఖ్యమా? ప్రజా ప్రయోజనాలు పట్టవా?సర్కిల్--57లో బిల్డర్లదే పైచేయి అనే విమర్శలకు అధికారులు తమ చర్యలతో సమాధానం చెప్పాలి. అక్రమ నిర్మాణాలకు అడ్డుకట్ట వేయాలి.. అధికారుల బాధ్యతను ఉన్నతాధికారులు నిర్ధారించాలి. లేకపోతే టౌన్‌ప్లానింగ్ శాఖ పనితీరుపై ప్రజల్లో నెలకొన్న అనుమానాలు మరింత బలపడే ప్రమాదం ఉంది!

చల్మెడలో గ్రామంలో గ్రామసభ ఎలినో పై అవగాహన



మెదక్ జిల్లా బ్యూరో,నవంబర్ 13

నిజాంపేట మండల పరిధిలోని చల్మెడ గ్రామంలో శుక్రవారం ఎల్ నినో ప్రభావం పై గ్రామ కచేరి వద్ద గ్రామసభ నిర్వహించారు.గ్రామ సర్పంచ్ బొమ్మెన మల్లేశం ఆధ్వర్యంలో జరిగిన ఈ సమావేశంలో రైతులకు పలు సూచనలు చేశారు. ఈ సందర్భంగా సర్పంచ్ మాట్లాడుతూ ఎల్ నినో ప్రభావంతో వర్షాభావ పరిస్థితులు ఏర్పడే అవకాశం ఉన్నందున రైతులు ఆరుతడి పంటల సాగుపై మొగ్గు చూపాలని సూచించారు. ప్రతి రైతు కంపోస్టు, ఇంకుడు గుంతలు నిర్మించుకోవాలని, ప్రత్యామ్నాయ పంటలు పొద్దుతిరుగు,మొక్కజొన్న, పెసర్లు,కందులు,ఆకుకూరలు వంటి పంటలు వేసుకుని నీటిని వృథా చేయకుండా పొదుపుగా వినియోగించుకోవాలని తెలిపారు. ఈ మేరకు గ్రామసభలో పలు తీర్మానాలు చేశారు. ఈ కార్యక్రమంలో తహసిల్దార్ శ్రీనివాస్, ఇంచార్జ్ ఎంపీడీవో ముజాహిద్, ఎంపీఓ రజినీకాంత్ రెడ్డి, విద్యుత్ శాఖ ఏఈ గణేష్, ఇరిగేషన్ అధికారి మహారాజ్, ఉప సర్పంచ్ మహేష్, ఫీల్డ్ అసిస్టెంట్ బిక్షపతి, వడ్ల తిరుపతి వార్డు సభ్యులు గ్రామస్తులు తదితరులు పాల్గొన్నారు.

ప్రభుత్వ జూనియర్ కళాశాల విద్యార్థులకు యూనిఫాంలు, బెల్టులు, ఐడీ కార్డుల పంపిణీ...



వనపర్తి బ్యూరో నవంబర్ 13

వనపర్తి జిల్లా పెబ్బేరు ప్రభుత్వ జూనియర్ కళాశాలలో విద్యార్థినీ విద్యార్థులకు తెలంగాణ ప్రభుత్వం అందించిన ఉచిత యూనిఫాం డ్రెస్ మెటీరియల్‌తో పాటు బెల్టులు, ఐడెంటిటీ కార్డులను కళాశాల సిబ్బంది పంపిణీ చేశారు.ఈ సందర్భంగా కళాశాల ఇన్‌చార్జ్ ప్రిన్సిపాల్ ఓబుల్ రెడ్డి మాట్లాడుతూ.. విద్యార్థులందరూ ప్రతిరోజూ ప్రభుత్వ యూనిఫాం ధరించి, క్రమశిక్షణతో కళాశాలకు క్రమం తప్పకుండా హాజరుకావాలని సూచించారు. ఏకరూప దుస్తులు ధరించడం వల్ల విద్యార్థుల్లో సమానత్వం, సమైక్యతా భావం పెంపొందుతాయని పేర్కొన్నారు.ఈ కార్యక్రమంలో అధ్యాపకులు హనుమంత్ రెడ్డి, సి. కృష్ణయ్య, జ్ఞానేశ్వర్ రెడ్డి, నవీన్ కుమార్, రవీందర్, జాకీర్ హుస్సేన్, వెంకటలక్ష్మి, శిల్ప, ఈశ్వర్‌తో పాటు బోధనేతర సిబ్బంది పాల్గొన్నారు.

గిరిజన పోరాట యోధుడు భగవాన్ బిర్సా ముండా జిల్లా అదనపు కలెక్టర్ నగేష్



మెదక్ జిల్లా బ్యూరో,నవంబర్ 13

శుక్రవారం కలెక్టర్ కార్యాలయంలో బిర్సా ముండా 151వ జయంతి వేడుకలు ఘనంగా నిర్వహించారు. అదనపు కలెక్టర్, జిల్లా అధికారులు బిర్సా ముండా చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు.ఈ సందర్భంగా జిల్లా అదనపు కలెక్టర్ నగేష్ మాట్లాడుతూ..గిరిజన హక్కుల కోసం బ్రిటిష్ పాలకులపై వీరోచితంగా పోరాడిన స్వాతంత్ర్య సమరయోధుడు, గిరిజనుల ఆరాధ్య దైవం భగవాన్ బిర్సా ముండా అని కొనియాడారు.బిర్సా ముండా గిరిజనుల హక్కులు, ఆత్మగౌరవం, స్వయం పాలన కోసం అలుపెరగని పోరాటం చేశారని కొనియాడారు. బ్రిటిష్ పాలకుల దోపిడీ, అణచివేతకు వ్యతిరేకంగా గిరిజనులను ఏకం చేసి ఉద్యమాన్ని నడిపించారని తెలిపారు. ఆయన చేసిన పోరాటం, త్యాగం దేశ చరిత్రలో చిరస్థాయిగా నిలిచిపోతాయని పేర్కొన్నారు.గిరిజనుల అభ్యున్నతి, విద్య, వైద్యం, ఉపాధి అవకాశాల కల్పనకు ప్రతి ఒక్కరూ కృషి చేయాలనిపిలుపునిచ్చారు. బిర్సా ముండా ఆశయాలను భావితరాలకు తెలియజేస్తూ, ఆయన స్ఫూర్తితో సమాజ అభివృద్ధికి కృషి చేయాలని ఆయన అన్నారు.అనంతరం బిర్సా ముండా జయంతి సందర్భంగా వివిధ పోటీలలో గెలుపొందిన విద్యార్థులకు మేమంటోలు, సర్టిఫికెట్లు అందించారు.ఈ కార్యక్రమంలో జిల్లా గిరిజన సంక్షేమ శాఖ అధికారి నీలిమ ,సంబంధిత శాఖల అధికారులు, ప్రజాప్రతినిధులు, గిరిజన సంఘాల నాయకులు, విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు.

ఎం.పి.పి. పాఠశాలలో ఉచిత దంత వైద్య శిబిరం

హైదరాబాద్ : ఎం.పి.పి. పాఠశాలలో లయన్స్ క్లబ్ ఆఫ్ హైదరాబాద్ సింజెర్జీ ఆధ్వర్యంలో నిర్వహించిన ఉచిత దంత వైద్య శిబిరం విజయవంతంగా జరిగింది.ఈ శిబిరంలో సుమారు 250 మంది విద్యార్థులు, పాఠశాల సిబ్బందికి దంత పరీక్షలు నిర్వహించారు.ఈ కార్యక్రమానికి విశేష సహకారం అందించిన లయన్స్ క్లబ్ సభ్యులందరికీ హృదయపూర్వక ధన్యవాదాలు.

ముఖ్యంగా డాక్టర్ సాయి హర్ష గారికి, వారి వైద్య బృందానికి ప్రత్యేక కృతజ్ఞతలు. ఎంతో ఓర్పుతో 250 మందికి దంత పరీక్షలు నిర్వహించి తమ సేవాభావాన్ని చాటుకున్నారు.అలాగే లయన్ కె. నాగ సిరీష గారు, లయన్ పవన్ కుమార్ గారు, లయన్ మౌనిక గారు, లయన్ గణేష్ రెడ్డి గారికి ప్రత్యేక ధన్యవాదాలు.జోన్ చైర్మన్ లయన్ అశోక్ బాబు గారు ఈ కార్యక్రమానికి హాజరై అందించిన మార్గదర్శకత్వం, సహకారం



అభినందనీయం.అదేవిధంగా ప్రత్యక్షంగా హాజరు కాలేకపోయినా తెరవెనుక నుంచి సహకరించిన ప్రతి ఒక్క లయన్ సభ్యుడికి ప్రత్యేక కృతజ్ఞతలు.ఈ కార్యక్రమం విజయవంతం కావడానికి సహకరించిన పాఠశాల ప్రధానోపాధ్యాయులు శ్రీ దశరథ నాయక్ గారికి, ఉపాధ్యాయులు శ్రీ కె. ప్రకాష్ గారికి కూడా ధన్యవాదాలు తెలియజేశారు.సమాజ సేవే లక్ష్యంగా, విద్యార్థుల ఆరోగ్య పరిరక్షణకు లయన్స్ క్లబ్ ఆఫ్ హైదరాబాద్ సింజెర్జీ చేస్తున్న ఈ సేవా కార్యక్రమం అభినందనీయం.ఈ సందర్భంగా క్లబ్ అధ్యక్షులు జి. జీవన్ కుమార్ టి. గారు, హైదరాబాద్ సింజెర్జీ లయన్ సభ్యులందరి తరఫున ప్రతి ఒక్కరికీ హృదయపూర్వక ధన్యవాదాలు తెలియజేశారు. లయన్స్ క్లబ్ ఆఫ్ సింజెర్జీ -- సేవే మా లక్ష్యం!

ఓడినా.. మనసులు గెలిచిన కోహ్లీ!

- ఆరు వికెట్లు తీసిన మ్యాట్ హెన్రీకి టీమిండియా జెర్సీ బహుమతి.. వైరల్‌గా మారిన వీడియో



న్యూఢిల్లీ: క్రికెట్ మైదానంలో ప్రత్యర్థులపై దూకుడుగా ఆడే టీమిండియా స్టార్ బ్యాటర్ విరాట్ కోహ్లీ.. మైదానం బయట తన ప్రత్యేక వ్యక్తిత్వంతో మరోసారి అభిమానుల మనసులు గెలుచుకున్నాడు. న్యూజిలాండ్‌తో జరిగిన నాలుగో వన్డేలో భారత జట్టు ఘోర పరాజయం పాలైనప్పటికీ, అద్భుత బౌలింగ్‌తో చెలరేగిన కివీస్ పేసర్ మ్యాట్ హెన్రీని కోహ్లీ ప్రత్యేకంగా అభినందించాడు. మ్యాచ్ అనంతరం హెన్రీకి తన టీమిండియా జెర్సీని బహుమతిగా అందజేశాడు. ఈ హృదయపూర్వక సన్నివేశానికి సంబంధించిన వీడియో ప్రస్తుతం సామాజిక మాధ్యమాల్లో వైరల్‌గా మారింది. ఈ మ్యాచ్‌లో మ్యాట్ హెన్రీ భారత బ్యాటర్లకు చుక్కలు చూపించాడు. తన పదునైన బంతులతో టీమిండియా టాప్ ఆర్డర్‌ను కుప్పకూల్చాడు. ముఖ్యంగా ఇన్నింగ్స్ తొలి ఓవర్‌లోనే రోహిత్ శర్మ, విరాట్ కోహ్లీ, శ్రేయస్ అయ్యర్‌లను డకౌట్ చేసి భారత జట్టుకు కోలుకోలేని దెబ్బతీశాడు. అనంతరం కూడా తన బౌలింగ్‌తో భారత బ్యాటర్లను ఇబ్బంది పెట్టాడు. మొత్తం 9.4 ఓవర్లలో 27 పరుగులు మాత్రమే ఇచ్చి ఆరు వికెట్లు పడగొట్టి న్యూజిలాండ్ విజయంలో కీలక పాత్ర పోషించాడు. అంతకుముందు న్యూజిలాండ్ బ్యాటింగ్‌లో విల్ యంగ్ అద్భుత శతకంతో ఆకట్టుకున్నాడు. 108 బంతుల్లో 125 పరుగులు చేసి జట్టు భారీ స్కోరు సాధించడంలో కీలక పాత్ర పోషించాడు. దీంతో న్యూజిలాండ్ 333 పరుగుల లక్ష్యాన్ని భారత్ ముందుంచింది. భారీ లక్ష్య ఛేదనలో భారత బ్యాటింగ్ పూర్తిగా విఫలమైంది. హెన్రీ ధాటికి టాప్ ఆర్డర్ కుప్పకూలడంతో పాటు మిగతా బ్యాటర్లు కూడా పెద్దగా ప్రతిఘటించలేకపోయారు. చివరకు భారత్ 89 పరుగులకే ఆలౌటై 244 పరుగుల భారీ తేడాతో ఓటమి చవిచూసింది. అయితే మ్యాచ్ ఫలితంతో సంబంధం లేకుండా కోహ్లీ చూపిన క్రీడాస్ఫూర్తి అందరి దృష్టిని ఆకర్షించింది. తన వికెట్ తీసిన ప్రత్యర్థి బౌలర్‌ను అభినందిస్తూ జెర్సీని బహుమతిగా ఇవ్వడం అతడి గొప్ప మనసుకు నిదర్శనమని అభిమానులు ప్రశంసిస్తున్నారు. ఆటలో గెలుపోటములు సహజమని, ప్రత్యర్థి ప్రతిభను గుర్తించి గౌరవించడం నిజమైన క్రీడాస్ఫూర్తి అని నెటిజన్లు అభిప్రాయపడుతున్నారు. మైదానంలో ఎంత దూకుడుగా కనిపించినా, ప్రత్యర్థి ఆటగాళ్ల ప్రతిభను గుర్తించి అభినందించడంలో కోహ్లీ ఎప్పుడూ ముందుంటాడు.

గతంలోనూ పలువురు అంతర్జాతీయ క్రికెటర్లకు తన జెర్సీలను బహుమతిగా అందించిన సందర్భాలున్నాయి. తాజాగా మ్యాట్ హెన్రీకి జెర్సీ అందించడం మరోసారి కోహ్లీ వ్యక్తిత్వాన్ని చాటిచెప్పింది. దీంతో మ్యాచ్‌లో భారత్ ఓడినా.. క్రీడాస్ఫూర్తితో కోహ్లీ అభిమానుల హృదయాలను గెలుచుకున్నాడనే ప్రశంసలు వెల్లువెత్తుతున్నాయి.

మైనపు విగ్రహంగా హర్మన్‌ప్రీత్ కౌర్!

- జైపూర్‌లో ప్రత్యేక గౌరవం.. మహిళా క్రికెట్‌కు చారిత్రక గుర్తింపు



జైపూర్: భారత మహిళా క్రికెట్ జట్టు మాజీ కెప్టెన్ హర్మన్‌ప్రీత్ కౌర్‌కు అరుదైన గౌరవం దక్కింది. రాజస్థాన్‌లోని జైపూర్ నహర్‌గఢ్ కోటలో ఉన్న హిస్టారికా మ్యూజియంలో ఆమె మైనపు విగ్రహాన్ని ఏర్పాటు చేశారు. శుక్రవారం (నవంబర్ 13) జరిగిన కార్యక్రమంలో హర్మన్‌ప్రీత్ స్వయంగా తన విగ్రహాన్ని ఆవిష్కరించారు. తొలిసారిగా తన మైనపు ప్రతిమను చూసిన ఆమె ఈ గౌరవం తనకు ఎంతో సంతోషాన్ని, గర్వాన్ని కలిగించిందని తెలిపారు. 2025 నవంబర్‌లో హర్మన్‌ప్రీత్ నాయకత్వంలో భారత మహిళా జట్టు తొలిసారిగా వన్డే ప్రపంచకప్‌ను గెలుచుకుని చరిత్ర సృష్టించింది. ఈ అద్భుత విజయానికి గుర్తింపుగా జైపూర్ వైక్స్ మ్యూజియం నిర్వాహకులు ఆమె విగ్రహాన్ని రూపొందించాలని నిర్ణయించారు. సుమారు ఏడాది పాటు శ్రమించి కళాకారులు ఈ విగ్రహాన్ని తయారు చేశారు. ఈ సందర్భంగా హర్మన్‌ప్రీత్ మాట్లాడుతూ.. తన విగ్రహాన్ని ఏర్పాటు చేసిన కళాకారులకు కృతజ్ఞతలు తెలిపారు.

సచిన్ టెండూల్కర్, మహేంద్రసింగ్ ధోనీ వంటి దిగ్గజ క్రికెటర్ల సరసన తన విగ్రహం ఉండటం గొప్ప గౌరవంగా భావిస్తున్నానన్నారు. భవిష్యత్తులో ఈ విగ్రహం యువ క్రికెటర్లకు, ముఖ్యంగా అమ్మాయిలకు స్ఫూర్తినిస్తుందని ఆశాభావం వ్యక్తం చేశారు. ప్రపంచకప్ విజయం మహిళా క్రికెట్‌లో కొత్త అధ్యాయానికి నాంది పలికిందని హర్మన్‌ప్రీత్ పేర్కొన్నారు. 1983లో భారత పురుషుల జట్టు ప్రపంచకప్ గెలిచిన తర్వాత దేశంలో క్రికెట్‌కు ఆదరణ పెరిగినట్లే, మహిళల ప్రపంచకప్ విజయం కూడా మహిళా క్రికెట్ రూపురేఖలను మార్చగలదని అభిప్రాయపడ్డారు. ఈ గౌరవం భారత మహిళా క్రికెట్ విజయానికి మరో గుర్తింపుగా నిలిచింది.



89 పరుగులకే భారత్ చిత్తు..
గంభీర్ తీవ్ర అసంతృప్తి!

- **బ్యాటర్ల వైఫల్యంపై కోచ్ ఆగ్రహం.. ప్రపంచకప్‌కు ముందే గుణపాఠం నేర్చుకోవాలని సూచన**

మౌంట్ మాంగనూయి, నవంబర్ 13: న్యూజిలాండ్‌తో జరిగిన నాలుగో వన్డేలో భారత జట్టు ఘోర పరాజయాన్ని చవిచూసింది. 334 పరుగుల భారీ లక్ష్యంతో బరిలోకి దిగిన టీమిండియా కేవలం 89 పరుగులకే కుప్పకూలింది. దీంతో 244 పరుగుల తేడాతో న్యూజిలాండ్ ఘన విజయం సాధించింది. భారత బ్యాటర్ల పేలవ ప్రదర్శనపై ప్రధాన కోచ్ గౌతమ్ గంభీర్ తీవ్ర అసంతృప్తి వ్యక్తం చేశారు. కీలకమైన మ్యాచ్‌లో బ్యాటర్లు కనీస పోరాటం కూడా చేయకపోవడం జట్టు శిబిరంలో ఆందోళన కలిగించింది. మ్యాచ్ అనంతరం గంభీర్ మాట్లాడుతూ.. అంతర్జాతీయ క్రికెట్‌లో ఆడలేని బంతులంటూ ఏమీ ఉండవని వ్యాఖ్యానించారు. ప్రత్యర్థి బౌలర్లు మంచి ప్రాంతాల్లో బంతులు వేసినప్పుడు వాటిని సమర్థంగా ఎదుర్కొనే బాధ్యత బ్యాటర్లపై ఉంటుందని స్పష్టం చేశారు. వికెట్లు వరుసగా కోల్పోతూ తక్కువ స్కోరుకే ఆలౌట్ కావడం ఆమోదయోగ్యం కాదని అభిప్రాయపడ్డారు. బ్యాటింగ్‌లో నిలకడ లేకపోవడం జట్టుకు పెద్ద సమస్యగా మారిందని, ప్రతి ఆటగాడు తన బాధ్యతను గుర్తించాలని సూచించారు. క్రీజులో ఎక్కువ సమయం గడపడం, పరిస్థితులకు అనుగుణంగా ఆడటం నేర్చుకోవాలని పేర్కొన్నారు. ప్రత్యర్థి బౌలింగ్‌ను ఎదుర్కొనేందుకు అవసరమైన మానసిక సంసిద్ధతను పెంచుకోవాలని చెప్పారు. వచ్చే ఏడాది దక్షిణాఫ్రికాలో జరగనున్న ప్రపంచకప్‌ను దృష్టిలో పెట్టుకుని ఇప్పటి నుంచే జట్టు లోపాలను సరిదిద్దుకోవాల్సిన అవసరం ఉందని గంభీర్ పేర్కొన్నారు. ఇలాంటి పరిస్థితులు ప్రపంచకప్‌లోనూ ఎదురయ్యే అవకాశం ఉందని, వాటిని సమర్థంగా ఎదుర్కొనేందుకు ఆటగాళ్లు సిద్ధంగా ఉండాలని సూచించారు. ఈ ఘోర పరాజయం భారత జట్టుకు హెచ్చరికగా మారింది.

యువ ఒలింపిక్స్‌లో అంబేకర్ చరిత్ర!

- భారత్‌కు తొలి బాక్సింగ్ స్వర్ణం.. ఐర్లాండ్ బాక్సర్‌పై ఉత్కంఠ విజయం



డకార్, నవంబర్ 13: యువ ఒలింపిక్స్ బాక్సింగ్‌లో భారత యువ క్రీడాకారుడు ఎల్. అంబేకర్ మీతై చరిత్ర సృష్టించాడు. సెనెగల్‌లోని డకార్‌లో జరుగుతున్న 2026 యువ ఒలింపిక్స్‌లో పురుషుల 50 కిలోల విభాగంలో స్వర్ణ పతకం సాధించాడు. ఐర్లాండ్‌కు చెందిన క్రిస్టియన్ జుబానీతో జరిగిన ఫైనల్ పోరులో 3-2 తేడాతో విజయం సాధించి భారత్‌కు ఈ పోటీల చరిత్రలో తొలి బాక్సింగ్ స్వర్ణాన్ని అందించాడు. మణిపూర్‌కు చెందిన అంబేకర్ ఫైనల్‌లో ఆరంభం నుంచే గట్టి పోటీ ఎదుర్కొన్నాడు. తొలి రౌండ్‌లో ప్రత్యర్థి ఆధిపత్యం ప్రదర్శించినప్పటికీ, రెండో రౌండ్ నుంచి అంబేకర్ పుంజుకున్నాడు. చివరి రౌండ్‌లో మరింత దూకుడుగా ఆడి న్యాయనిర్ణేతల మద్దతు పొందాడు. దీంతో 3-2 స్ప్లిట్ నిర్ణయంతో విజయం ఖరారు చేసుకున్నాడు. ఫైనల్‌కు చేరుకునే క్రమంలోనూ అంబేకర్ అద్భుత ప్రదర్శన చేశాడు. క్వార్టర్ ఫైనల్‌లో నమీబియా బాక్సర్ అబ్రహం కలెంగాను తొలి రౌండ్‌లోనే ఓడించాడు. సెమీఫైనల్‌లో కొలంబియాకు చెందిన ఇజోన్ జెఫ్రీ గలియా అరెవాలోపై 5-0తో ఘన విజయం సాధించి ఫైనల్‌కు చేరుకున్నాడు. ఈ విజయంతో యువ ఒలింపిక్స్ బాక్సింగ్‌లో భారత్ ఎన్నడూ సాధించని ఘనతను అంబేకర్ అందించాడు. గతంలో 2010 యువ ఒలింపిక్స్‌లో శివ థాపా రజతం, వికాస్ కృష్ణన్ కాంస్య పతకం సాధించగా.. ఇప్పుడు అంబేకర్ స్వర్ణం గెలిచి భారత బాక్సింగ్ చరిత్రలో కొత్త అధ్యాయాన్ని లిఖించాడు. మరోవైపు భారత మహిళా బాక్సర్ గుంజన్ కూడా 48 కిలోల విభాగంలో స్వర్ణం సాధించడంతో భారత బాక్సింగ్‌కు ఒకే రోజు రెండు పతకాలు దక్కాయి.

అర్ష్‌దీప్‌కు ఒకేరోజు డబుల్ ధమాకా!



న్యూఢిల్లీ, నవంబర్ 13: టీమిండియా పేసర్ అర్ష్‌దీప్ సింగ్‌కు ఒకేరోజు రెండు శుభవార్తలు అందాయి. ఐపీఎల్ ట్రేడింగ్‌లో భాగంగా పంజాబ్ కింగ్స్ నుంచి ముంబై ఇండియన్స్ జట్టులోకి మారిన అతడు.. మరోవైపు తన ప్రేయసి, నటి సమ్రీన్ కౌర్‌తో నిశ్చితార్థం చేసుకున్నాడు. దీంతో అర్ష్‌దీప్ ఆనందంలో మునిగిపోయాడు. ఐపీఎల్ 2027 సీజన్‌కు ముందు జరిగిన ట్రేడింగ్‌లో అర్ష్‌దీప్ సుమారు రూ.18 కోట్ల ఒప్పందంతో ముంబై ఇండియన్స్ జట్టులోకి వెళ్లాడు. గత ఎనిమిది సీజన్లుగా పంజాబ్ కింగ్స్‌కు ప్రాతినిధ్యం వహించిన అతడు, ఇప్పుడు కొత్త జట్టుతో తన ప్రయాణాన్ని కొనసాగించనున్నాడు. మరోవైపు న్యూజిలాండ్ పర్యటనలో ఉన్న అర్ష్‌దీప్ తన చిరకాల ప్రేయసి సమ్రీన్ కౌర్‌తో నిశ్చితార్థం చేసుకున్నాడు. ఈ వేడుకకు సంబంధించిన ఫొటోలను ఇద్దరూ సామాజిక మాధ్యమాల్లో పంచుకున్నారు. అర్ష్‌దీప్ మోకాళ్లపై కూర్చొని సమ్రీన్‌కు ఉంగరం తొడుగుతున్న ఫొటోలు అభిమానులను ఆకట్టుకున్నాయి. దీంతో క్రికెట్ అభిమానులు, పలువురు ప్రముఖులు ఈ జంటకు శుభాకాంక్షలు తెలుపుతున్నారు. సమ్రీన్ కౌర్ నటి, మోడల్‌గా గుర్తింపు పొందింది. ఫెమినా మిస్ ఇండియా పోటీల్లో పాల్గొన్న ఆమె పలు హిందీ, పంజాబీ చిత్రాలు, సంగీత వీడియోల్లో నటించింది. ఇలా ఒకేరోజు క్రికెట్ కెరీర్‌లో కొత్త మలుపు, వ్యక్తిగత జీవితంలో కొత్త బంధం ఏర్పడటంతో అర్ష్‌దీప్‌కు ఈ రోజు ప్రత్యేకంగా నిలిచింది.

సచిన్ రికార్డును సమం చేసిన విరాట్ కోహ్లీ!

న్యూజిలాండ్‌తో మ్యాచ్‌లో డకౌట్.. వన్డేల్లో 20వ సారి ఖాతా తెరవకుండానే వెనుదిరిగిన స్టార్ బ్యాటర్



మౌంట్ మాంగనూయి, నవంబర్ 13: టీమిండియా స్టార్ బ్యాటర్ విరాట్ కోహ్లీ ఖాతాలో అనుకోని రికార్డు చేరింది. న్యూజిలాండ్‌తో జరిగిన నాలుగో వన్డేలో పరుగులేమీ చేయకుండానే పెవిలియన్ చేరిన కోహ్లీ.. భారత క్రికెట్ దిగ్గజం సచిన్ టెండూల్కర్ పేరిట ఉన్న అనవసర రికార్డును సమం చేశాడు. వన్డే క్రికెట్‌లో భారత్ తరఫున అత్యధికసార్లు డకౌట్ అయిన ఆటగాళ్ల జాబితాలో సచిన్‌తో కలిసి అగ్రస్థానానికి చేరుకున్నాడు. ఈ మ్యాచ్‌లో కోహ్లీ నాలుగు బంతులు ఎదుర్కొని పరుగులేమీ చేయకుండానే న్యూజిలాండ్ పేసర్ మాట్ హెన్రీ బౌలింగ్‌లో క్లీన్‌బౌల్డ్ అయ్యాడు. న్యూజిలాండ్ నిర్దేశించిన 334 పరుగుల భారీ లక్ష్యాన్ని ఛేదించేందుకు బరిలోకి దిగిన భారత జట్టుకు ఆరంభంలోనే గట్టి ఎదురుదెబ్బ తగిలింది. ఓపెనర్ రోహిత్ శర్మ తొలి బంతికే డకౌట్‌గా వెనుదిరిగాడు. ఆ తర్వాత క్రీజులోకి వచ్చిన కోహ్లీపై అభిమానులు భారీ ఆశలు పెట్టుకున్నప్పటికీ, అతడు కూడా ఖాతా తెరవకుండానే పెవిలియన్ చేరడంతో భారత శిబిరంలో నిరాశ నెలకొంది. మాట్ హెన్రీ తన బౌలింగ్‌తో భారత టాప్ ఆర్డర్‌ను తీవ్రంగా ఇబ్బంది పెట్టాడు. మొదట బయటకు వెళ్తున్న బంతులతో కోహ్లీని పరీక్షించిన హెన్రీ, ఆ తర్వాత లోపలికి దూసుకొచ్చే బంతితో అతడిని బోల్తా కొట్టించాడు. కోహ్లీ బ్యాట్‌ను దాటిన బంతి నేరుగా వికెట్లను పడగొట్టింది. ఈ వికెట్‌తో వన్డే క్రికెట్‌లో కోహ్లీ డకౌట్ల సంఖ్య 20కి చేరింది.

సచిన్ టెండూల్కర్ తన వన్డే కెరీర్‌లో 463 మ్యాచ్‌లు ఆడి 20 సార్లు పరుగులేమీ చేయకుండానే ఔటయ్యాడు. కోహ్లీ మాత్రం 321 మ్యాచ్‌ల్లోనే ఈ సంఖ్యను చేరుకోవడం గమనార్హం. ఇద్దరూ ఒకే సంఖ్యలో డకౌట్లు నమోదు చేసినప్పటికీ, కోహ్లీ తక్కువ మ్యాచ్‌ల్లోనే ఈ రికార్డును సమం చేశాడు. భారత్ తరఫున వన్డేల్లో అత్యధిక డకౌట్ల జాబితాలో కోహ్లీ, సచిన్ చెరో 20 డకౌట్లతో తొలి స్థానంలో ఉండగా, మాజీ బౌలర్ జవగళ్ శ్రీనాథ్ 19 డకౌట్లతో తర్వాతి స్థానంలో ఉన్నాడు. అనిల్ కుంబ్లే, రోహిత్ శర్మ చెరో 18 సార్లు డకౌట్ అయ్యారు. క్రికెట్ చరిత్రలో ఎన్నో గొప్ప రికార్డులు సాధించిన కోహ్లీకి ఈ రికార్డు మాత్రం చేదు అనుభవంగా మిగిలింది. న్యూజిలాండ్ బౌలర్ల ధాటికి భారత టాప్ ఆర్డర్ కుప్పకూలడం, కీలక ఆటగాళ్లు త్వరగా వికెట్లు కోల్పోవడం జట్టు ప్రదర్శనపై ప్రశ్నలు లేవనెత్తింది.



తెలుగు ఆడియన్స్ పల్స్ పట్టేసిన దుల్కర్..

మలయాళ స్టార్ హీరో దుల్కర్ సల్మాన్ తెలుగు.. ప్రేక్షకులకు బాగా దగ్గరవుతున్నారు. కొంతమంది తెలుగు హీరోల కన్నా కూడా ఈయనకి అభిమానులు ఎక్కువగా ఉండటం విశేషం. అయితే దీనికి కారణం కేవలం సినిమాలు మాత్రమే కాదు. ఆయన ఎంచుకునే కథలు, పాత్రలు, అభిమానులతో మెలిగే విధానం కూడా అయింది తెలుగు ప్రేక్షకులకు ఎక్కువ దగ్గర చేస్తున్నాయి. సాధారణంగా ఒక భాషకు చెందిన హీరో మరో భాషలో గుర్తింపు తెచ్చుకోవాలంటే అక్కడి ప్రేక్షకులకు చాలా దగ్గర అవ్వాలి. వారి అభిరుచులకు తగ్గ సినిమాలు చేయడంతో పాటు, సినిమా ప్రమోషన్లకు కూడా తగిన ప్రాధాన్యత ఇవ్వాలి. ఈ విషయం దుల్కర్ సల్మాన్ బాగా అర్థం చేసుకున్నారు. తెలుగు సినిమాలు చేస్తున్నప్పటి నుంచే ఇక్కడి ప్రేక్షకులతో అనుబంధాన్ని పెంచుకోవడానికి ఆయన ప్రయత్నిస్తున్నారు. ఇంటర్వ్యూలలో తెలుగులో మాట్లాడుతూ ఉండడం.. సినిమా ప్రమోషన్లలో చురుగ్గా పాల్గొనడం ఆయనకు మరింత ప్లస్ అవుతోంది. మరోవైపు దుల్కర్ సల్మాన్ తీసే సినిమాలు కూడా.. ఆయనకు పాపులారిటీ పెంచుతూనే వస్తున్నాయి . హీరో అంటే భారీ యాక్షన్ సన్నివేశాలు, ఎలివేషన్లు ఉండాలనే లెక్కలకు దుల్కర్ ఎక్కువగా ప్రాధాన్యత ఇవ్వరు. కథలో తన పాత్రకు ఎంత ప్రాధాన్యత ఉంది, ఆ పాత్ర ప్రేక్షకుల మనసుల్లో ఎంతకాలం నిలిచిపోతుంది అనే విషయాలపై దృష్టి పెడతారు. అందుకే మహానటి, సీతారామం, లక్కీ భాస్కర్ వంటి విభిన్నమైన సినిమాలతో తెలుగు ప్రేక్షకులను ఆకట్టుకున్నారు. ఇప్పుడు ఆకాశంలో ఒక తార సినిమాతో మరోసారి తెలుగు ప్రేక్షకుల ముందుకు రావడానికి సిద్ధమవుతున్నారు. నవంబర్ 20న ఈ సినిమా విడుదల కానుంది. ఈ సినిమా కూడా చాలావరకు.. దుల్కర్ సల్మాన్ గత తెలుగు సినిమాల లాగానే.. కంటెంట్ చాలా స్ట్రాంగ్ గా ఉండేలా కనిపిస్తోంది. నిజానికి మరో భాషలో స్టార్‌డమ్ సంపాదించడం అంత సులభం కాదు. కానీ దుల్కర్ తన సినిమా సెలక్షన్, తన ప్రమోషన్ స్ట్రాటజీ ద్వారా.. ఈ విషయాన్ని తేలిక గానే చేసేసారు. ఇక ఇదే విషయం మన తెలుగు హీరోలు కూడా దుల్కర్ సల్మాన్ దగ్గర నుంచి నేర్చుకోవడం చాలా అవసరం.

అల్లు అర్జున్ భార్య స్నేహారెడ్డికి అరుదైన గౌరవం

'బౌలీ ఆర్ట్ సంఘం' చైర్‌పర్సన్‌గా అల్లు స్నేహారెడ్డి నియామకం



ఐకాన్ స్టార్ అల్లు అర్జున్ భార్య, వ్యాపారవేత్త అల్లు స్నేహారెడ్డికి కళా, సాంస్కృతిక రంగాల్లో అరుదైన గౌరవం దక్కింది. ప్రతిష్టాత్మక 'బౌలీ ఆర్ట్ సంఘం' కల్చర్ అండ్ హెరిటేజ్ విభాగానికి ఫౌండింగ్ చైర్‌పర్సన్‌గా ఆమె నియమితులయ్యారు. భారతదేశంలోనే మొట్టమొదటి 'స్టెప్‌వెల్ ఆర్ట్ బినాలే'గా గుర్తింపు పొందిన ఈ ఉద్యమానికి ఆమె ప్రధాన సారథిగా వ్యవహరించనున్నారు.

దక్కన్ ప్రాంతంలో, ముఖ్యంగా హైదరాబాద్ పరిసరాల్లో ఉన్న పురాతన మెట్ల బావుల (బావోలీలు) చారిత్రక, పర్యావరణ విశిష్టతను నేటి తరానికి చాటిచెప్పడమే ఈ సంస్థ ప్రధాన లక్ష్యం. 'ది రెయిన్‌వాటర్ ప్రాజెక్ట్'కు చెందిన కల్పనా రమేశ్, 'ఏక్ చిత్ర'కు చెందిన అన్నపూర్ణ మాదిపాడిగ సంయుక్తంగా ఈ ప్రాజెక్ట్‌ను ప్రారంభించారు. ఈ పురాతన బావులను కళా వేదికలుగా తీర్చిదిద్ది ప్రజల్లో అవగాహన పెంచేందుకు స్నేహారెడ్డిని ఈ ప్రాజెక్ట్ ముఖచిత్రంగా ఎంపిక చేశారు.

ఈ క్రమంలో డిసెంబర్ 1వ తేదీ నుంచి జనవరి 10 వరకు దాదాపు 40 రోజుల పాటు భారీ స్థాయిలో బౌలీ ఆర్ట్ ఫెస్టివల్ నిర్వహించనున్నారు. బన్సీలాల్‌పేట్, గోల్కొండ, రాష్ట్రపతి నిలయం, ఫలక్‌నుమా తదితర 13కు పైగా చారిత్రక ప్రాంతాల్లో 200 మందికి పైగా కళాకారులతో ప్రదర్శనలు, చర్చలు ఏర్పాటు చేయనున్నారు. ఈ బాధ్యతలపై స్నేహారెడ్డి స్పందిస్తూ... "బౌలీ ఆర్ట్ సంఘంలో ఈ కొత్త బాధ్యత చేపట్టడం చాలా సంతోషంగా ఉంది. మన నగరం యొక్క చరిత్ర, వారసత్వ సంపదపై ముఖ్యంగా యువతరంలో మరింత అవగాహన పెంచేందుకు ఈ ప్రాజెక్ట్ ఒక గొప్ప వేదికగా నిలుస్తుంది. భావితరాల కోసం మన సంస్కృతిని కాపాడే దిశగా ఇది ఒక అర్థవంతమైన అడుగు" అని పేర్కొన్నారు.

క్యాన్సర్‌ను జయించిన మోనాల్ గజ్జర్

సర్జరీ తర్వాత ఎమోషనల్ పోస్ట్!



సినిమా తారల జీవితాలు బయటకు ఎంతో అందంగా కనిపిస్తాయి. కానీ కెమెరా వెనుక వారు ఎదుర్కొనే వ్యక్తిగత సమస్యలు.. ఆరోగ్య ఇబ్బందులు చాలామందికి తెలియవు. తాజాగా టాలీవుడ్ నటి.. బిగ్‌బాస్ ఫేమ్ మోనాల్ గజ్జర్ తన ఆరోగ్యానికి సంబంధించిన విషయాన్ని వెల్లడించి అభిమానులను షాక్‌కు గురిచేశారు. తనకు పాపిల్లరీ థైరాయిడ్ క్యాన్సర్ ఉన్నట్లు వైద్య పరీక్షల్లో తేలిందని.. ఈ మధ్యనే శస్త్రచికిత్స చేయించుకున్నట్లు ఆమె సోషల్ మీడియా ద్వారా వెల్లడించారు. ప్రస్తుతం సర్జరీ విజయవంతంగా పూర్తయిందని..క్రమంగా కోలుకుంటున్నానని తెలిపారు. ూశ్రీంశీ =ఝుఎ – రాజమౌళి ఆలోచన సరైనదేనా? మోనాల్ గజ్జర్ గురించి తెలుగు ప్రేక్షకులకు ప్రత్యేక పరిచయాలు అవసరం లేదు. అల్లరి నరేష్ హీరోగా నటించిన సుడిగాడు సినిమాతో తెలుగు ప్రేక్షకులకు దగ్గరైన ఆమె, ఆ తర్వాత బ్రదర్ ఆఫ్ బొమ్మాలి వంటి చిత్రాల్లోనూ నటించి గుర్తింపు తెచ్చుకున్నారు. సినిమాలతో పాటు టెలివిజన్ రంగంలోనూ తనదైన ముద్ర వేశారు. ముఖ్యంగా తెలుగు బిగ్‌బాస్ సీజన్ 4లో పాల్గొనడంతో ఆమెకు మరింత పాపులారిటీ వచ్చింది. ఈ షో ద్వారా బుల్లితెర ప్రేక్షకులకు కూడా దగ్గరయ్యారు. అనంతరం బెల్లంకొండ శ్రీనివాస్ నటించిన అల్లుడు అదుర్స్ సినిమాలో ఒక ఐటమ్ సాంగ్లో కనిపించి అలరించారు. అయితే తాజాగా ఆమె పంచుకున్న ఆరోగ్య సమాచారం మాత్రం అభిమానులను కలచివేసింది. తనకు పాపిల్లరీ థైరాయిడ్ క్యాన్సర్ ఉన్నట్లు గుర్తించడంతో వైద్యుల సలహా మేరకు ఆపరేషన్ చేయించుకున్నట్లు మోనాల్ తెలిపారు. ఈ సమస్యను ఎదుర్కొని ప్రస్తుతం కోలుకుంటున్నానని చెప్పడం అభిమానులకు కొంత ఊరటనిచ్చింది. తన ఆరోగ్య పరిస్థితి గురించి బహిరంగంగా మాట్లాడటం ద్వారా క్యాన్సర్‌పై అవగాహన కల్పించే ప్రయత్నం కూడా చేశారు. ఈ క్రమంలో ఈ నటి..జీవితంలో కెరీర్, కుటుంబం, ఇతర బాధ్యతలతో ఎంత బిజీగా ఉన్నా ఆరోగ్యాన్ని మాత్రం నిర్లక్ష్యం చేయకూడదని సూచించారు. శరీరంలో ఏవైనా అసాధారణ మార్పులు కనిపించినా, ఆరోగ్యంపై సందేహాలు ఉన్నా ఆలస్యం చేయకుండా వైద్యులను సంప్రదించాలని కోరారు. క్రమం తప్పకుండా ఆరోగ్య పరీక్షలు చేయించుకోవడం కూడా ఎంతో అవసరమని గుర్తుచేశారు. అంతేకాదు, మహిళల్లో క్యాన్సర్ నివారణపై అవగాహన పెంచేందుకు హెచ్‌పీవీ వ్యాక్సిన్ ప్రాముఖ్యతను కూడా ప్రస్తావించారు. ముఖ్యంగా సర్వైకల్ క్యాన్సర్ నివారణకు సంబంధించి సరైన వైద్య సలహా తీసుకోవాలని తెలిపింది. ఆమె చేసిన పోస్ట్ ప్రస్తుతం సోషల్ మీడియాలో వైరల్ అవుతుంది.

కంగనా రనౌత్ 'స్కేరీ పిక్చర్' టైటిల్ పోస్టర్ విడుదల చేసిన రానా దగ్గుబాటి.. బాలీవుడ్ లో రవిబాబు ఎంట్రీ



బాలీవుడ్ స్టార్ హీరోయిన్ కంగనా రనౌత్ ప్రధాన పాత్రలో తెరకెక్కుతున్న హారర్ చిత్రం 'స్కేరీ పిక్చర్'. ఈ సినిమాకు సంబంధించిన టైటిల్ పోస్టర్‌ను ప్రముఖ నటుడు రానా దగ్గుబాటి ఈరోజు అధికారికంగా విడుదల చేశారు. సురేష్ ప్రొడక్షన్స్, ఫ్లయింగ్ ఫ్రాగ్స్, స్పిరిట్ మీడియా పతాకాలపై దగ్గుబాటి సురేష్ బాబు, రవిబాబు ఈ చిత్రాన్ని సంయుక్తంగా నిర్మిస్తున్నారు.

తెలుగులో 'అనసూయ', 'అవును' వంటి విభిన్నమైన హారర్ థ్రిల్లర్లతో మెప్పించిన దర్శకుడు రవిబాబు, ఈ సినిమా ద్వారా హిందీ చిత్రసీమలోకి దర్శకుడిగా అరంగేట్రం చేస్తున్నారు. రానా దగ్గుబాటి తన సోషల్ మీడియా ఖాతా ద్వారా ఈ టైటిల్ పోస్టర్‌ను పంచుకుంటూ... "ఒక కొత్త పీడకల మొదలుకాబోతోంది" అని పేర్కొన్నారు.భారతదేశంలో హారర్ కథలకు మంచి ఆదరణ ఉందని, దేశంలోని విభిన్న ప్రాంతాల భయాలు, కథలను వెండితెరపైకి తెచ్చే దర్శకులకు సురేష్ ప్రొడక్షన్స్, స్పిరిట్ మీడియా ద్వారా నిరంతర మద్దతు అందిస్తామని రానా తెలిపారు. సైకలాజికల్, క్రీచర్, హారర్–కామెడీ వంటి అన్ని రకాల సబ్–జోనర్లను ప్రోత్సహించేలా ఒక ప్రత్యేక వ్యవస్థను నిర్మించడమే తమ లక్ష్యమని ఆయన వివరించారు.గతంలో 'రాజ్: ది మిస్టరీ కంటిన్యూస్', 'చంద్రముఖి 2' వంటి చిత్రాలలో నటించిన కంగనా రనౌత్, మరోసారి ఈ పూర్తి స్థాయి హారర్ చిత్రంతో ప్రేక్షకులను భయపెట్టేందుకు సిద్ధమవుతున్నారు. ఈ సినిమాను 2027లో థియేటర్లలో విడుదల చేయనున్నట్లు చిత్ర బృందం స్పష్టం చేసింది. పూర్తి తారాగణం, విడుదల తేదీకి సంబంధించిన ఇతర వివరాలను త్వరలోనే వెల్లడించనున్నారు.



ఏకంగా 22 కిలోల బరువు తగ్గిన కీరవాణి ఎక్స్‌లో పంచుకున్న అనుపమ్ ఖేర్

ఆస్కార్ విజేత, ప్రముఖ సంగీత దర్శకుడు ఎం.ఎం. కీరవాణి శారీరకంగా పూర్తిగా మారిపోయాడు. ఏకంగా 22 కిలోల బరువు తగ్గి అందరినీ ఆశ్చర్యపరిచాడు. తాజాగా హైదరాబాద్‌లో ఆయనను కలిసిన బాలీవుడ్ సీనియర్ నటుడు అనుపమ్ ఖేర్ ఈ మార్పును చూసి ఫిదా అయ్యాడు. కీరవాణి పట్టుదల, క్రమశిక్షణ నిజంగా స్ఫూర్తిదాయకమంటూ ప్రశంసలు కురిపించాడు. బరువు తగ్గిన తర్వాత ఆయన మరింత ఉత్సాహంగా, ఆత్మవిశ్వాసంతో కనిపిస్తున్నాడని కొనియాడాడు. హైదరాబాద్ పర్యటనలో కీరవాణిని కలిసిన అనుపమ్ ఖేర్.. ఆ సందర్భానికి సంబంధించిన కొన్ని ఫొటోలను తన 'ఎక్స్' ఖాతాలో పంచుకున్నాడు. కీరవాణి 22 కిలోల బరువు తగ్గడం అద్భుతమైన విషయమని పేర్కొన్నాడు. ఆయన నడకలోనూ కొత్త ఉత్సాహం కనిపించిందని, ఎంతో సంతోషంగా, ఆత్మవిశ్వాసంతో ఉన్నాడని తెలిపాడు. సంగీతంలో అద్భుతాలు సృష్టించిన కీరవాణి.. ఇప్పుడు పట్టుదల, ఏకాగ్రతతో ఏదైనా సాధించవచ్చని నిరూపించాడని ప్రశంసించాడు. ఆయన జీవితంలో ప్రారంభమైన ఈ కొత్త ప్రయాణం మరింత విజయవంతం కావాలని ఆకాంక్షించాడు.

Printed, Published & Owned by CH. Rajkumar, Published at H.no. 5-5-616, Kothirampur.Dist- Karimnagar 505001. TELANGANA State printed at SRI BALAJI PRINTING PRESS, H.NO.4-4-55, Tilak Road, Karimnagar -505001,
Head office: 2-66-121/122 near ramky one Marvel gajullaramaram Quthbulapur medchal Malkajgiri district. TELANGANA STATE. CHIEF EDITOR : K.SRAVAN KUMAR 9866330400 , RNI. NO. APTEL/2010/35724. EMAIL:Peoplesnews0909@gmail.com